# శ్రీ వేంకటేశ్వర శతకము

**108 దృష్టాంతాలంకార పద్యరత్నములు మాధవాంకితం**

**('సురాపగధార' నామాంకిత తాత్పర్య సహితం)**

*రచయిత*

**కాకితము గోవిందదాస సుకవి**

సరస్వతీవరప్రసాది సహజపాండితీసంశోభితుడు

కార్వేటినగరమేలిన సర్వోత్తమ తిరుమలేంద్రు మహారాజుగారి ఆస్థానపండితుడు

*తాత్పర్య వివరణం 'ధారణావధానబ్రహ్మ'*

**డా॥ వోలుకుల శివశంకరరావు** ఎం.ఏ., పిహెచ్.డి.

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2014**

# SRI VENKATESWARA SATHAKAM

*By*
**Kakithamu Govindadasa Sukavi**

*Commentary by*
**Dr. Volukula Sivasankara Rao, M.A., Ph.D.**

*Editor-in-Chief*
**Prof. Ravva Sri Hari**

T.T.D. Religious Publications Series No.1065
© All Rights Reserved

*First Edition : 2014*

Copies :

Price :

*Published by*
**M.G. GOPAL,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P***
Office of the Editor-in-Chief
T.T.D, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

కలియుగ ప్రత్యక్షదైవం, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఎందరో కవులు, పండితులు, వాగ్గేయకారులు తమ తమ కవితలద్వారా, పద్యాలద్వారా, పదాలద్వారా, పాటలద్వారా, కృతుల ద్వారా సంకీర్తనల ద్వారా స్తుతిస్తూ అనేకానేక రచనలు చేసి స్వామివారికి సమర్పించుకున్నారు. ఆ సాహిత్యాన్ని సేకరించి తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా ముద్రించి భక్తలోకానికి అందిస్తున్నది. అందులో భాగమే ఈ శ్రీవేంకటేశ్వర శతకం. చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధ కవివరేణ్యులు పాడిపేట వాస్తవ్యులు శ్రీ కాకితము గోవిందదాసకవి ఈ శతకరచయిత.

శతక వాఙ్మయంలో దృష్టాంతాలంకారానికి విశేష స్థానం ఉంది. ఈ శతకంలో కూడా కవి సందర్భానుసారంగా వివిధ దృష్టాంతాలను ప్రయోగించి శతకానికి ఒక విలక్షణమైన సౌందర్యాన్ని కల్పించాడు. భాషకన్నా భావానికే అధిక ప్రాధాన్యం ఇవ్వడంద్వారా కవి ఈ శతకాన్ని కేవలం పండితులనే కాకుండా సామాన్య పాఠకుని కూడా దృష్టిలో పెట్టుకుని రచించినట్లుగా కనిపిస్తున్నది.

శ్రీవేంకటేశ్వర శతకాన్ని సామాన్య పాఠకులకు మరింత సులభతరం చేసే విధంగా ప్రసిద్ధ ధారణావధాని శ్రీ వొలుకుల శివశంకర రావు గారు ఈ శతకానికి చక్కటి వ్యాఖ్యానాన్ని కూడా రచించారు. ఈ శ్రీవేంకటేశ్వర శతకాన్ని భక్తమహాశయులు ఆదరిస్తారని భావిస్తూ...

*సదా శ్రీవారి సేవలో*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానముల
తిరుపతి

# నివేదన

మహామహోపాధ్యాయ
**డా॥ సముద్రాల లక్ష్మణయ్య,**
తిరుపతి.

**కావ్యం తు జాతు జాయేత**
**కస్యచి త్ప్రతిభావతః ॥**

“ఎప్పుడో ఒకప్పుడు ఒకానొక ప్రతిభావంతుని హృదయం నుండి కావ్యం ఉద్భవిస్తుంది” అని పై వాక్యాని కర్థం.

కవిత్వం ఒక భగవద్విభూతి. భగవదనుగ్రహం లేకుంటే అది స్వాధీనం కాదు. అందువల్ల కావ్యనిర్మాతలలో అనేకులు భగవదనుగ్రహ ఫలమైన తమ కవితలను భగవంతునికే నివేదనగా సమర్పిస్తారు. పోతన వంటి మహాకవులే ఇందుకు నిదర్శనం.

కవితలలో పలు రీతులున్నాయి. అందులో శతకరచనా ప్రక్రియ తెలుగులో సంస్కృతంలోకంటె గూడా విస్తృతంగా వ్యాపించింది. నీతినీ, భక్తినీ, లోకవృత్తాన్నీ, ధర్మాధర్మాలనూ బోధించడానికి కవులు శతకరచనలు విస్తారంగా కావించారు.

అట్టి కవులు ఒక ప్రాంతానికో, ఒక జాతికో, ఒక భాషకో పరిమితులు కారు. అన్ని ప్రాంతాలలో, అన్ని జాతులలో, అన్ని భాషలలోనూ కావ్యాలు రచించిన ఘనులున్నారు.

ప్రస్తుతం ఈ శ్రీవేంకటేశ్వర శతకాన్ని రచించిన శ్రీగోవిందదాసకవిగారు 1878వ సంవత్సరంలో తిరుపతికి నాల్గు కిలోమీటర్ల దూరంలోని స్వర్ణముఖీ తీరాన గల ‘పాడిపేట’ అన్న గ్రామంలో పద్మశాలికులంలో జన్మించారు.

ఈయన పోతనాదుల వలె సహజకవి. పద్మశాలి కులస్థులకు ఆరాధ్యమునీంద్రుడైన భావనర్షిచరిత్రమును గూడా వీరు మనోజ్ఞంగా రచించి అభిజ్ఞుల ప్రశంసకు పాత్రమైనారు.

ఈ శతకములో 108 పద్యాలు శ్రీవేంకటేశ్వరాంకితంగా రచింపబడి వున్నాయి. వాటితో కలిపి 25 గేయాలు గూడా భక్తి భావబంధురంగా రచించబడినవి చేర్చడమైనది.

శతకాలు పలురకాలుగా ఉన్నా సిద్ధహస్తులైన ధూర్జటి వంటి మహాకవులు రచించిన శతకాలే లోకోత్తరమైన రచనలుగా ప్రసిద్ధి పొందాయి.

ఇందలి శ్రీ వేంకటేశ్వర శతకం చదివినపుడు వెంటనే సుప్రసిద్ధమైన భాస్కర శతకం మదిలో స్ఫురిస్తుంది. ఆశతకంలో ఒకనీతిని నిరూపించడానికి చక్కని నిదర్శనాత్మకమైన ఒక కథా ఘట్టాన్నో, ఒక సందర్భాన్నో పేర్కొనడం జరిగింది. ఆ పద్ధతినే పాటించి శ్రీగోవిందదాసుగారు ఈ శతకం రచించారు. అందువల్ల ఈ రచన అత్యంత మనోహరంగా తయారయింది.

ఇంచుమించు అరువదేండ్ల క్రితం రచించబడిన ఈ రచనను కవిపౌత్రుడైన శ్రీబిట్రా కృష్ణయ్యగారు నా వద్దకు తెచ్చి చూపగా నేను దీన్ని చదవి ఇందలి కవితా సౌందర్యానికి ముగ్ధుడ నయ్యాను. దీన్ని పునర్ముద్రించవలసిందిగా వారిని ప్రోత్సహించాను.

భగవదనుగ్రహం వల్ల తి.తి.దే. అధికారుల అంగీకారంతో ఈ శతకమిప్పుడు తి.తి.దే. ప్రచురణలలో ఒకటిగా వెలువడుతుండటం ముదావహం.

ఇందలి పద్యాలన్నీ మనోహరాలే. మచ్చుకు ఒక పద్యం చూడండి!

**తాను సమస్త ధర్మవిబుధత్వవిచారతనందియుండి య**
**జ్ఞానిని 'శిష్యగా బడసి సత్యపు బోధ యొనర్చు టెట్లనన్**
**ఈనిన పాడియావొకరి కిచ్చి తృణంబున కీడు గాని యా**
**పీనుగు వోలు దున్నగొని పెంచిన యట్టులె వేంకటేశ్వరా! (25)**

శ్రీ వేంకటేశ్వరాంకితంగా రూపొందిన ఈ శతకం ద్వితీయముద్రణ తి.తి.దే. ప్రచురణల్లో ప్రచుర ప్రచారం పొంది పలుసార్లు ముద్రితమై విస్తృతవ్యాప్తి పొందగలదని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథముద్రణకై పాటుపడిన శ్రీబిట్రా కృష్ణయ్య దంపతులను అభినందిస్తున్నాను.

తిరుపతి

**సముద్రాల లక్ష్మణయ్య**
స్పెషల్ ఆఫీసర్
పురాణ-ఇతిహాస-ప్రాజెక్టు
తి.తి.దేవస్థానములు
తిరుపతి

# సురాపగధార

1951లో ప్రచురితమయిన శ్రీ వేంకటేశ్వర శతకము 'సురాపగధార' అనే పేరు గల తాత్పర్య సహితంగా మరల యీ విజయనామ వసంతంలో 2013లో ముద్రణ పొందుట పద్మావతీ వల్లభుని సంపూర్ణానుగ్రహము తప్ప వేరు గాదు.

శతక రచయిత 'శ్రీమాన్ కీ॥శే॥ కాకితము గోవింద దాస మహాకవి శారదాదేవి వరప్రసాద సిద్ధిని పొందిన సుకవి పుంగవుడు. దృష్టాంతాలంకార సంశోభితమైన మహాకవితా దివ్యమాధురి 108 పద్యాల నిండా నిండి వుండి చదువరులకు సంపూర్ణమైన ఆనందాన్ని కల్గించును.

ఈ శతకము సర్వాంగ సుందరంగా ముద్రితమయి పాఠకలోకం హర్షించుటకు కారణమయిన పుణ్యదంపతులు శ్రీమతి బిట్రా మునెమ్మగారు శ్రీ బిట్రా కృష్ణయ్యగారు. వీరిని గురించి వీరి సాహితీ ప్రియత్వాన్ని గురించి కొంత చెప్పవలసి వుంది.

నేను 2012లో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో టి.టి.డి. ధర్మప్రచారపరిషత్ వారి ఆధ్వర్యంలో భాగవత సప్తాహం ఉపన్యాసం చేయడం జరిగింది. శ్రోతలలో తొలి వరుసలో కూర్చొని యీ దంపతులు నా ఉపన్యాసాలు శ్రద్ధగా విన్నారు. మంచి జిజ్ఞాస కల శ్రోతలుగా దంపతులు నాకు పరిచయమయ్యారు.

ఆ పరిచయంలో వారు తమ ముఖ్య బంధువులయిన శ్రీకాకితము గోవింద దాస మహాకవి రచనలు నాకు తెచ్చి యిచ్చారు.

ఆ కావ్యాలలో భావనామహర్షి చరిత్ర, శ్రీ వేంకటేశ్వర శతకం, రెండూ పరిశీలించి, చదివి గోవింద దాస మహాకవికి, వారి ప్రతిభా పాండిత్యాలకు నమస్కారాంజలి సమర్పించడం జరిగింది.

కృష్ణయ్యగారు నాకు తగిన మాననీయులుగా తోచి శ్రోతల మనోగతాభిప్రాయాలు నా ఉపన్యాసాలపై యెలా వున్నాయని అడగడం– దానికి వారు తగిన రీతిగా మాట్లాడడం అలా వారితో కొంత ఆత్మీయత మమతానురాగాలు వృద్ధి పొందాయి. కృష్ణయ్య గారు 'ఒక క్రొత్త కోరిక నన్ను కోరడం– అది సఫలీకృతమయి శ్రీ వేంకటేశ్వర శతకం సాహిత్య ప్రపంచంలో క్రొత్త రికార్డుకు తావలమై 5 గంటల సుదీర్ఘమయిన సి.డి.గా నిర్మాణం కావడం. అది ప్రపంచ తెలుగు మహాసభల్లో ఘనంగా ఆవిష్కరణ కావడం. సాహితీ ప్రియుల కరకమలాల్లో ఆ సి.డి.లు చేరి ప్రశంసలు పొందడం వేగంగా జరిగాయి.

తిరుపతి ఆకాశవాణి వారు ఒక నెలరోజులు ఆ సి.డి.ని ప్రసారం చేయడం. శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్, ఎఫ్.ఎం. రేడియోలో వారు కూడ 20 రోజులు ప్రతి రోజూ ప్రసారం చేయడం – ఆ శతక కవితా మాధుర్యానికి సాహిత్యప్రియులు ఆనందించడం, ఆ పద్యాలు ఆమూలాగ్రంగా పఠించి పరిశోధనగా విశ్లేషణ గావించిన నన్ను కవిగారి సొంత గ్రామం పాడిపేటలో మా దంపతులకు సత్కారం చేయడం – అలమేలు మంగమ్మ యయిన పద్మావతీ అమ్మవార్ల సంపూర్ణ అనుగ్రహం తప్ప వేరుగాదు.

ఇక కవిగారి ప్రతిభా పాండిత్యాలు, వారి అమోఘమయిన సరస్వతీ సాక్షాత్కారాది విశేషాలన్నీ నమ్మవలసిన నిజాలు తప్ప అన్యం కానేకాదు. వారిని గురించి కథలు పాడిపేటలో పరిసర గ్రామాల్లో, తిరుపతి పట్టణంలో అందరూ చెప్పుకుంటున్న విషయాలు. ఒక మూడు రోజులపాటు ఈ శతకంపై అన్నమాచార్య కళామందిరంలోనే నేచెప్పిన ఉపన్యాసాలలో సవివరంగా– ఈ శతకాలలోని పద్యాలనే ఆధారంగా ఉదహరిస్తూ చెప్పడం నాకు మరపుకురాని సంఘటన.

కవిగారి పేరు తలచుకొన్నంతనే నాకు మాటలకందనంత పూజ్యత వారిపై కలిగేది. గోవిందదాస మహాకవిచంద్రుని ఆశీస్సులు నాకు పరిపూర్ణంగా లభించాయని నా దృఢమయిన నమ్మకం. దానికి ప్రత్యక్ష సాక్ష్యం వారి పద్యాలకు తాత్పర్య వివరణం 'సురాపగధార' అనే పేరుతో వ్రాయడం. అది చాలా వేగంగా స్వామి అనుగ్రహంతో ప్రచురణ పొందడం, పూర్వజన్మసుకృతంగా పులకరించిన హృదయంతో పరవశించడం తప్ప ఆ యనుభూతిని మాటలలో తెలుపలేని వాడనవుతున్నాను.

కొన్ని కొన్ని ప్రేమానుబంధాలు పూర్వజన్మకృత పుణ్యాల వల్ల లభిస్తాయని పెద్దలంటారు. అటువంటి పుణ్యప్రభావంతో శ్రీమతి మునెమ్మ కృష్ణయ్య దంపతులు నాకు పరిచితులై ఈ గొప్పపని చేయించారని అలతి అలతి పదాలతో నా మనస్సును పాఠకులకు ఆవిష్కరిస్తూ, మహిమగల ఈ శతకాన్ని సమగ్రంగా చదివి ఉత్తమ కవితా సందేశాన్ని, రసానందాన్ని సమగ్రంగా పొందాలని – శ్రీ కాకితము గోవిందదాసమహాకవి శుభాశీస్సులు పాఠకులందరికీ అందాలని శుభాకాంక్షలందిస్తున్నాను.

**– డా॥ వొలుకుల శివశంకరరావు**

తాత్పర్య వివరణ కర్త

## కృతజ్ఞతలు

గౌరవనీయులైన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి గారికి, ఎడిటర్ ఇన్ చీఫ్ గారికి వారి సిబ్బందికి, ఇతర అధికారులకూ మరియు పండితులకూ మా కృతజ్ఞతలు.

శ్రీ పాడిపేట సరస్వతి పుత్రుడు సహజకవి శ్రీకాకితము గోవిందదాసు కవిగారు రచించి మాధవాంకితము చేసిన శ్రీవేంకటేశ్వర శతకము దృష్టాంతాలంకార పద్యపుష్పాలను భావముతో కూడి వున్నది. ఈ శతకమును పునర్ముద్రించి, కవిగారికి ఆత్మశాంతి కలిగించి, మరుగునపడిన యీ శతకమునకు వెలుగు నింపి, చదువరులకు తెలుగు పద్యాలలో దాగిన ద్రాక్షరసాన్ని పంచినందుకు తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి పాడిపేట ప్రజల తరపున మా కృతజ్ఞతలు.

యీ శతకమును డా॥ వొలుకుల శివశంకరరావు గారు ధారణావధాన చక్రవర్తి వారిచే తిరుపతి ఆకాశవాణిలో 2012లో భావముతో కూడిన ఈ శతకమును ఐదన్నర గంటలసేపు ప్రవచనము చేసినారు. ఆ సి.డి.ని ప్రపంచ తెలుగు మహాసభలలో పండితుల సమక్షంలో భూగర్భ గనుల శాఖామంత్రివర్యులచే ఆవిష్కరించబడింది. ఆ సి.డి.ని దూరదర్శన్ ద్వారా దేశమంతా శ్రోతలకు ఆహ్లాదము కలిగించి వీనుల విందుగా వినిపించినారు. వారికి కూడా నా హృధయపూర్వక ధన్యవాదములను తెలియజేసు కుంటున్నాను.

**– శ్రీమతి బిట్రా మునెమ్మ & శ్రీ బిట్రా కృష్ణయ్య**
సెల్ నెం. 94913 10299

**గమనిక –** పై సి.డి.కి. వెబ్‌సైట్ సౌకర్యము కలదు. ఆసక్తికలవారు ఉచితముగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

http://sn.im/satakaminfo.site4
sites.co.in/2012/09/srivenkateswara.satakam.html





*Writer photo for backpage*



గ్రంథకర్త - సరస్వతీవరప్రసాది సహజపాండితీసంశోభితుడు

కార్వేటినగరమేలిన సర్వోత్తమ తిరుమలేంద్రు మహారాజుగారి ఆస్థానపండితుడు 1920

**"శ్రీకాకితము గోవిందదాసకవి"**

# శ్రీ వేంకటేశ్వర శతకము

**ఈ పద్యంలో భగవంతుని అనుగ్రహ విశేషం వర్ణింప బడింది.**

**ఉ. శ్రీరమణీమనోహర ప్రసిద్ధసురార్చిత దివ్యనామ సం**
**సార సముద్రసంతరణ సాధులనీదరి జేర్పకుందువే**
**క్రూరు దజామిళుండు తనకూరిమి పుత్రుని బేరుకొన్న వే**
**జేరి శుభంబులం బడయ జేసితివే మును వేంకటేశ్వరా! 1**

పద్మావతీవల్లభా–సుప్రసిద్ధులయిన ముప్పదిమూడుకోట్ల దేవతలచే నిరంతరం స్మరించే అర్చించే దివ్యనామ విభాసితుడా– శ్రీవేంకటేశ్వరా– సంసార సంద్రంలో కూరుకుపోయిన జీవుల నుద్ధరించే దయగల స్వామీ. మంచివరాలను నీదరి జేర్చకుండా వుండవు గదా–

ఎందుకనగా – క్రూరుడయిన అజామిళుడు తనకు ప్రియమయిన చిన్నపుత్రుని నారాయణ నామముతో పిలుచుకున్నంతనే ఎంతో సంతోషాన్నిపొంది అతడు చేసిన పాపాలన్నింటినీ క్షమించి శుభాలెన్నో అతనికి కలిగించావు. నీ సన్నిధిలో అతనిని వుంచావు. అటువంటప్పుడు మంచివారలను నీదరికి జేర్చక వుండవు గదా. తప్పక వారికి అజామిళు నికంటే గొప్ప స్థితిని అనుగ్రహించగలవు.

* * *

**ఈ పద్యంలో కుకవి నింద వర్ణింప బడింది.**

**ఉ. భూమిని పూర్వపుణ్యఫల పూజ్యులువ్రాసిన దివ్యశబ్దముల్**
**పామరుడేరితెచ్చి యొకపద్దెమువ్రాసిన మెచ్చనెట్లగున్?**

**మామిడిపండులో నడుమ మాధురినిండియు జీడికాడయం**
**దేమరకుండునట్లు కృతికేర్పడు దోషము వేంకటేశ్వరా! 2**

శ్రీ వేంకటేశ్వరా ఈ భూమిలో కొందరు కవులుగా చలామణి కావాలనే లోభబుద్ధితో పూర్వపుణ్యఫలంగా సుకవితలు వెలయించిన సుకవుల కావ్యాలలోని కొన్ని మంచి శబ్దములు ఆ పామరులు దొంగతనంగా ఏరితెచ్చి యేదో నానాకష్టాలు పడి ఒక పద్యము కూర్చిన – దానిని మెచ్చుట సరిగాదు కదా. ఎందుకనగా– అది కుకవి విరచిత దోషభరితమయిన కావ్యమగును. దానిని సహృదయ పాఠకలోకము మెచ్చదు.

మామిడి పండు మధ్యలో ఎంతగానో మాధుర్యముండినప్పటికీ జీడికాడ యందు ఆ మాధుర్యములేక చప్పగా వుండి నోటికి అరుచి కలిగించును. ఛీయని దానిని తొలగించి ఊసి వేయుదురు. అంతమాత్రమే గాని దానిని మాధుర్యంగా వుందని మెచ్చరు. అటులనే ఇతర కవుల కావ్యాలలోని మంచి పదాలు దొంగిలించి పద్యం వ్రాసినా జీడికాడను మెచ్చనట్లుగా విజ్ఞులు దానిని మెచ్చరు.

* * *

**ఈ పద్యంలో సద్గుణాతిశయం వివరించబడింది.**

**ఉ. దండిమనంబు నీతియు నుదారత ధర్మము నెల్ల సద్గుణా**
**లుండెడువారు పేదలయియుండియు సద్గుణ మొల్లకుందురే**
**కొండలమీదబుట్టి అతికోమలతన్ గృశియించి నీళ్లులే**
**కెండిన మర్వమెట్టువిడు హెచ్చు సువాసన వేంకటేశ్వరా! 3**

శ్రీ వేంకటేశ్వరా – గుణవంతులు అనేక విషయాలలో గొప్పవారయి వుండి ఒకానొక విషయంలో న్యూనత కలిగి దారిద్ర్య బాధతో వారు కుందుచున్నప్పటికీ తమ గొప్ప సద్గుణాతిశయాన్ని విడిచి వుండలేరు.

దానికి ఉదాహరణ మరువము యొక్క పరిమళమే ఎక్కడో కొండకోనల్లో పుట్టి అతికోమలత్వంతో కృశియించి నీళ్ళు లేక ఎండిపోయినప్పటికీ దానికి పుట్టుకతో వచ్చిన సువాసనను మరువము వదలి వుండలేదు.

అలాగే మంచిగణవంతులయినవారు తమ వద్ద గొప్ప మనస్సు ఔదార్యము సద్గుణాలు. ఇలా ఎన్నో మేలైన విషయాలు కలవు కాబట్టి విధివైపరీత్యంలో దారిద్ర్య బాధ పొందుచున్నప్పటికీ మరువము వలె గొప్పతనాన్ని వదలక అల్పత్వము లేక పదిమంది మెచ్చుకొనేటట్లుగా వుంటారు.

* * *

**'దాత గొప్పదనం ఈ పద్యంలో వుంది'**

**ఉ. దాత దరిద్రతన్ బడసి తాపము నందుచునున్న యాచకుం**
**దాతనిజేరివేడ తృణమైన నొసంగకపోవ దెట్లనన్**
**ఖ్యాతి గడించునేరు నొకకాలము నందున నెండిపోయినన్**
**లోతుగద్రవ్వనీరు త్రుటిలోన నొసంగదె వేంకటేశ్వరా! 4**

పూర్వజన్మపుణ్యం వల్ల దాతగా పేరుపొందిన పుణ్యాత్ముడు ఏదో పరిస్థితుల ప్రభావంతో దరిద్రుడై దారిద్ర్యంతో బాధపడుతున్నా యాచకుడెదురపడి తనను ఏదయినాయిమ్మని అడిగినప్పుడు అతడు తన యొక్క స్వభావ ధర్మమయిన ఈవి వలన ఏదో ఒకటి అతనికివ్వకుండా అతని కోరిక తీర్చకుండా ఉండలేడుగదా దానికి దృష్టాంతము గలగలా పారే ఏరు కదా

ఏలననగా ఏరు పూర్వకాలంలో మహాప్రవాహం కలిగి పేరుపొంది ఇపుడు కాలప్రభావంతో ఎండిపోయినప్పటికీ దప్పిక గొన్నవాడు ఆ ఏరువున్న

ప్రదేశంలో ఎంత ఎండాకాలమయినప్పటికీ కొంత లోతుగా త్రవ్విన యెడల అక్కడ నీరు లభించకుండా ఉండదు కదా. ఆ యేరు నీరు తప్పక యిస్తుంది.

అలాగే దాత దరిద్రుడయినా స్వభావం ఇచ్చేది కాబట్టి అడిగిన వారికి కాదనకుండా ఏదయినాయిస్తాడు.

* * *

**మంచివారికి చేసే మేలును గురించి ఈపద్యం వివరించింది**

**ఉ. శ్రేయము పుణ్యమూర్తులకు జేసిన జీవితకాల మాత్మలో**
**బాయనిప్రేమ జూపికడు భాగ్యము వారలకిత్తు రెప్పుడున్**
**తోయము నించిపెంచి కృపతోగన తియ్యని నారికేళముల్**
**కాయలుగాచి మోసి కలకాలము నీయదె వేంకటేశ్వరా! 5**

మంచివారలకు ఏదయినా మేలు చేసినట్లయితే వారు ఆ మేలును వారు బ్రతికినంతకాలం మఱచి పోకుండా వుండి తగిన సమయాలలో ఆమేలు చేసినవారలకు కడు భాగ్యాన్ని మాటిమాటికి కలిగించి కాపాడుతూ వుంటారు.

దానికి ఉదాహరణ పెరటిలోని కొబ్బరి చెట్టేకదా ఆ కొబ్బరి చెట్టుకు చిన్నప్పుడు పాదిచేసి నీళ్ళుపోసి యజమాని పెంచిన విషయం గుర్తుపెట్టుకొని ఆ మేలును ఏనాడు మఱచిపోలేనని ఆ కొబ్బరిచెట్టు పెరిగి పెద్దదయినాక తలనిండా అన్నివైపులా ఎన్నో నారికేళ ఫలాల్ని మోసి అవి యన్ని యజమానికిచ్చి తన కృతజ్ఞతను ఆ కొబ్బరిచెట్టు తమ బ్రతికినంతకాలం చూపిస్తున్నదికదా! అలాగే సజ్జనులకు చేసిన మేలు కూడా కొబ్బరిచెట్టునకు చేసినటువంటిదే అవుతుంది.

* * *

**పుట్టుకతో వచ్చే దుర్గుణం ఎటువంటిదో ఈ పద్యంలో చెప్పబడింది**

**ఉ. పుట్టువుతోడ దుర్గుణము బుట్టిన దానిని మాన్పపందెమున్**
**గట్టిననైన బ్రహ్మకును గాదదియెట్టులటన్న రెండుగా**
**గొట్టిన ముష్టిపప్పొకటి కుండెడు తేనెనుముంచి నానగా**
**బెట్టిన దానిచేదు తెగబీల్చఁగజాలునె, వేంకటేశ్వరా! 6**

శ్రీ వేంకటేశ్వరా పుట్టుకతో ప్రాణికి దుర్గుణము పుట్టిన యెడల ఆ దుర్గుణము పోగొట్టగల శక్తి ఆప్రాణిని పుట్టించిన బ్రహ్మదేవునికి కూడ ఉండదు కదా

ప్రకృతిలో కటిక చేదైన ముష్టిపప్పు అనే పేరుగల చెట్టు పుట్టుకతోనే భయంకరమయిన కటిక చేదు కలిగి పుట్టింది. ఆ చేదును పోగొట్టాలని సాధకుడొకడు ఒక కుండ నిండా వున్న తేనెలో ఆ ముష్టిపప్పును వుంచి నానబెట్టి తీసి ఉపయోగించిన తేనెకున్న మాధుర్యం దానికి ఎట్టి పరిస్థితులలో రాదుకగా. చేదును వదలిపెట్టదుకదా. అట్లాగే దుష్టుడు కూడా తన పుట్టకతో వచ్చిన దుష్టభావాన్ని విడువలేడు. అందువలన ఆతనికి దూరంగా ఉండాలి.

* * *

**సత్కవుల కావ్యాలను గూర్చి ఈపద్యం వివరించింది**

**ఉ. ఉత్తమ కావ్యజాలముల నోపికఁగూర్ప కవీశ్వరాళికిన్**
**సొత్తుగ నుంటరాజకుల సోములు కొల్వునజేర్తురింపుగా**
**నుత్తమ హంస పాల జలముంచిన పాలనెగ్రోలు నేర్పు సం**
**పత్తినెతింగి బ్రహ్మతన పజ్జనె చేర్పఁడె వేంకటేశ్వరా! 7**

వేంకటేశ్వరా! మహారాజులు రాజకులశ్రేష్టులై కవులలో ఉత్తమ కవులను ఎన్నికజేసి వారిని తమ కొలువులలో సత్కరించి వుంచి వారిచే ఉత్తమ కావ్యసమూహములను వ్రాయించి వెలయించి తమ ఆస్థాన కవులుగా వారిని గౌరవిస్తారు. బ్రహ్మదేవుడు కూడా పాలను నీటిని వేరుచేయగల గొప్పగుణం హంసకు ఉన్నది, కాబట్టి ఆ గొప్పగుణం హంసకు మాత్రమే కలదు, కాబట్టి ఆ హంసను బ్రహ్మదేవుడు చేరదీసి తన వాహనంగా చేసి గౌరవించాడు. అలాగే ఉత్తమ కావ్యాలు వ్రాసే కవులు కూడా క్షీరనీరాన్ని వేరు చేయగల హంసలవంటివారు. అందుకే రాజకులచంద్రులు వారిని దగ్గరికి తీస్తారు. గౌరవ సత్కారాలు చేసి పూజిస్తారు.

* * *

**ఈ పద్యం అవివేకి విజయాన్ని వర్ణించి చెప్పింది**

**ఉ. న్యాయ విచారణైక గుణనాథునితో నవివేకియున్నచో**
**జేయఁగ నన్ని కార్యములు చెల్లును గాకది తాను నేర్పునే**
**కాయలు కూరలున్ బులుసు గడ్డలు లేహ్యములందునుండి నా**
**పాయసమందు నా యబక పక్వము దెల్పునె వేంకటేశ్వరా! 8**

న్యాయవిచారణానైపుణ్యం కల గుణవంతునితో అవివేకి కలిసి వుంటే ఆ సాహచర్య గుణమహిచే ఆ అవివేకిచేసే పనులన్నీ చెడిపోక ఆ పనులన్నీ సఫలమై అతను విజేత అవుతాడు. అయితే ఆ కార్యసాఫల్యతకు కారణం న్యాయవిచారణ పరుని దక్షతయే తప్ప అవివేకి నైపుణ్యమెంత మాత్రమూకాదు.

కూరలలో కలియతిరిగే అబక అంటే కొబ్బరి చిప్పతో తయారు చేయబడిన పెద్దకాడగల గరిటె. తాను ఎంతగా కాయకూరల్లో రకరకాల గడ్డల పులుసుల్లో పాయసంలో మునిగి వున్నా ఆ కూరల రుచి దానికి

తెలియునా ఉడికినవని అది చెప్పగలదా! పక్వమయినదో లేదో దానికి తెలియదు. కాని అన్నింటిలో కలియు తిరుగుతుంది. అలాగే అవివేకి కార్యవిజయంలో తెలియనివాడే తప్ప వేరుగాదు.

* * *

**మోసం చేసి సంపాదించే సంపాదన యెటువంటిదో ఈపద్యంలో చెప్పబడింది**

**ఉ. ఉత్తము లట్ల మోసముల కోడక యన్యుల సొమ్ములాగి తా**
**కుత్తుగ బంటిమెక్కఁగలకూళులు సంపదలంద రెప్పుడున్**
**మెత్తని చెత్తమేసి తనమేని నెఱుంగక క్రొవ్వుబట్టినన్**
**బెత్తెడె గొఱ్ఱెతోక యనిపెద్దలు పల్కరె వేంకటేశ్వరా! 9**

శ్రీ వేంకటేశ్వరా! సమాజంలో కొందరు ఉత్తముల మాదిరిగా నటిస్తూ మోసాలతో అన్యుల సొమ్మును కాజేసి, గొంతుదాకా మెక్కి తెగతినిబలిసి అన్యాయంగా బ్రతుకుతారు. వారు ఎంతగా ఈ రకంగా మోసం జేసి సంపాదించినా వారు ధనవంతులు మాత్రం కాలేరు. ఆ డబ్బు నిలువదు. దానికి దృష్టాంతముగా గొఱ్ఱెకు గల బెత్తెడు తోకయే.

గొఱ్ఱెకు తోకపెరగాలని ఎంతగానో మెత్తని చెత్త మేపితే అది తిని బాగా బలిసి కొవ్వుపట్టినప్పటికీ – దానికి తోక మాత్రం బెత్తకంటే పెరగక అంతగా మేసినప్పుడు కూడా అలాగే వుంటుంది. అందుకే "గొర్రెకు బెత్తెడు తోక" అని సామెత వచ్చింది. మోసంజేసి సంపాదించేవాడు కూడ గొఱ్ఱెతోకలాగా ఉంటాడు తప్ప శ్రీమంతుడు కాలేడు.

* * *

**ఈ పద్యంలో సంతాన ప్రాముఖ్యం ఎటువంటిదో చెప్పబడింది**

**ఉ. చక్కని భోగభాగ్యములు సర్వముగల్గి వినోదలీల పెం**
**పెక్కిన పుత్రహీను గృహమేని యదెట్టులనుండు నన్నచో**

**చుక్కలు వేనవేలుకడు శోభనమైయలరారు చుండి సొం**
**పెక్కువలేని పూర్ణశశిహీనపురాత్రియె వేంకటేశ్వరా!** **10**

శ్రీ వేంకటేశ్వరా! ఎన్ని సంపదలు, ఎన్ని వైభవాలు, ఎన్ని వినోదాలలో అలరారినా, పుత్రహీనుని గృహము శోభను పొందలేదు. ఎట్లనగా వేనవేలు చుక్కలలో ఆకాశము అలరారుతూ వున్నా, పున్నమినాటి చందమామ లేకపోతో ఆ రాత్రి శోభావిహీనంగానే వుంటుంది తప్ప అందంగా వుండదు. అలాగే సంతానహీనుని గృహము కూడా ఎన్ని భోగభాగ్యాలున్నా కళ తక్కువుగా వుంటుంది తప్ప వైభవంగా వుండదు.

* * *

**యాచకుడు దాత వద్దకు వచ్చినపుడు యెలా వుండాలో ఈ పద్యం వివరించింది**

**ఉ. దాతకు బీద లాత్మగల తాపము బుద్ధికి నెక్కునట్లు సం**
**ప్రీతిగఁ దెల్పుకున్న నిలబెట్టునె యాపదమాన్పి సత్కృపన్?**
**ఏతము ద్రొక్క కున్న తనకెట్టుల లోతుననుండు నీర మా**
**భాతిని చెట్లకన్నిఁటికిఁ బారిఫలంబిడు వేంకటేశ్వరా!** **11**

శ్రీవేంకటేశ్వరా! పేదలు దాతల వద్దకు వెళ్లినపుడు వారికి వచ్చిన బాధలు వివరంగా చెప్పి వారి మనసుకు వచ్చునట్లుగా వివరిస్తే అపుడు దాత యాచకుని ఆపదపోవు మార్గము ఆలోచించి అతనిని నిలబెట్ట గలడు.

ఏతము బాగా గట్టిగ త్రొక్కినపుడే లోపల వున్న నీరు బైటకు బాగా పారి చెట్ల పాదులు నిండి ఆ చెట్లు సఫల మగునట్లు చేయగలదు. ఏతము సరిగా తొక్కకపోతే లోతున వున్న నీరు రాదుకదా! అలాగే యాచకుడు కూడ దాత వద్దకు వచ్చినపుడు తన ఆపదను గూర్చి దాత మనసుకు వచ్చునట్లు వివరించాలి. అపుడతడు కృతార్థుడు కాగలడు.

* * *

**అసత్యం ఎటువంటిదో ఈ పద్యం వివరించింది**

**ఉ. కల్లల నాడువారు కలకాలముపెద్దలు సెప్పు నీతులం**
**దుల్లము జేర్చినట్లు సమయోచితులైనను టక్కుడాగునే**
**అల్లికసన్నబద్దలిడి యానcగcగూర్చి, బిగించికట్టినన్**
**జల్లెడ యందు నీరుదిగజారక యుండునె వేంకటేశ్వరా! 12**

శ్రీ వేంకటేశ్వరా! అబద్ధాలు చెప్పి బ్రతుకు వారు పెద్దలు చెప్పే నీతులు మనసారా నేర్చుకున్నట్లు సమయోచితులై నటిస్తూ ఆ సమయానికి టక్కు బయటపడకుండా దాచుకున్నా కొంత కాలానికి అసలు నిజం బయటపడి వారి అసత్య భాషణం అందరికీ బట్టబయలగును.

జల్లెడను ఎంతో నిపుణతతో అల్లిక బద్దలతో కట్టి బిగించి జాగ్రత్తచేసినా దాని సన్నని రంధ్రముల గుండా నీరు జారిపోకుండా ఉండగలదా– ఉండదు. అలాగే అసత్యవాదనతో బ్రతుకువాడి అసలు నిజము బయట పడక తప్పదు. అబద్ధం అబద్ధమే. నిజం నిజమే– అబద్ధం నిజంగాలేదు.

* * *

**పరమాత్మ దర్శనం ఎవరికి లభిస్తుందో ఈ పద్యం వివరించింది**

**ఉ. శాంతము సత్యముం బరమ సాధువిధేయత తత్త్వబుద్ధు లా**
**ద్యంత మెఱుంగువారు పరమాత్మను కన్నులజూతు రెప్పుడున్**
**అంతము లేనిలోతు గలదైనను గాలియు రచ్చలేని వి**
**శ్రాంతపయోధినిన్ రవియు చల్లగదోచడె వేంకటేశ్వరా! 13**

శ్రీ వేంకటేశ్వరా! పరతత్త్వము మీద మనసు కల బుద్ధిమంతుడు తత్త్వబుద్ధి కలిగి శాంతుడై సత్యభూషణుడై పరమ సాధు విధేయుడై జీవితాన్ని

గడపుతూ క్రమంగా ఆసద్గుణ వైభవంతో ప్రశాంతుడై పరమాత్మను కన్నులారా జూడగలడు.

ప్రశాంత చిత్తుడు కానిచో పరమాత్మను సాధకుడెల్లప్పుడూ చూడలేడు.

అంతకు లోతులో మహాగాంభీర్యంతో సముద్రం వున్నప్పటికీ ఏ హోరుగాలీ ఎటువంటి రచ్చలేని ప్రత్యూష కాలంలో ఆ సంద్రంలో సూర్య భగవానుడు మెల్లగ కనబడి ప్రత్యక్షమవుతాడు తప్ప అప్రశాంత సమయంలో రవి సంద్రంలో కుపించడు గదా! అలాగే ప్రశాంత చిత్తునికే పరమాత్మ నిరంతరం దర్శనమిస్తాడు.

* * *

**అవినీతిగా సంపాదించిన ధనమెటువంటిదో ఈ పద్యం వివరించింది**

**ఉ. దొంగిలితెచ్చుడబ్బు తనతోడిదురాత్ములకౌనుగాక రా**
**జ్యాంగవిశేషవైభవములంది యశంబును బెంచనౌనె స**
**ర్వాంగ వివృద్ధ కేశ పరిహారముజేయఁగనౌనుగాక యా**
**మంగలికత్తి మ్రాకులను మట్టముజేయునె వేంకటేశ్వరా! 14**

శ్రీ వేంకటేశ్వరా! దొంగతనంతో సంపాదించిన డబ్బు దుర్మాతుల పాలవుతుంది తప్ప, ఆ ధనం రాజ్యాంగ విశేష వైభవాన్ని పొందలేదు. అతనిని ధనవంతుని చేయలేదు. కీర్తిప్రతిష్ఠలను అది ఎంత మాత్రమూ కలిగించదు.

మంగలివానివద్ద గల కత్తి సర్వాంగాలలో బాగా పెరిగిన వెంట్రుకలనయితే గొఱగ గలదుకాని పెద్ద పెద్ద మ్రానులను నఱుకుటకు సమర్థత కలది కాదు కదా! అలాగే ఏదో దుర్మార్గులచేత మెప్పు పొందుతుంది

కాని, పెద్దల గౌరవాన్నీ ప్రభుత్వ గౌరవాన్నీ అక్రమంగా ధనం సంపాదించిన అవినీతిపరుడు పొందలేడు. కారాగార వాసము తప్పనిసరి కాగలదు.

* * *

**ఈ పద్యం దాంభికాలు పలికే వాని స్థితి ఎలాగుంటుందో వివరించింది**

**ఉ. విందుకు లేనినాడు పదివేలజనంబుల కన్నదాన మిం**
**పొందగ జేయనెంచ పరిపూరణమెట్లగు భార్యగన్న యా**
**ముందటి బిడ్డ ముంతగొని ముష్టికి బోవుచునుండ లంజ కిం**
**కెందరు బిడ్డలున్న నిక నేమియనందగు వేంకటేశ్వరా! 15**

శ్రీ వేంకటేశ్వరా! తన యింట్లో విందుభోజనం చేయడానికి టికానా లేనివాడు పదివేలజనాలకన్న దానం చేయాలని పూనుకోవడమూ ఎలా వుంటుందంటే –

పెండ్లాముకు పుట్టిన బిడ్డ తింటానికి లేక ముష్టి చెంబు పట్టుకొని అడుక్కొని తింటూవుంటే ఆయన లంజకు పుట్టిన బిడ్డలు ఎలా వున్నారని అడిగితే ఎంత సొగసుగా వుటుందో అలాగే వుటుంది. "వుట్టికి ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎగబాకినట్లు సామెత. ఆమాదిరిగా వుంటుంది.

* * *

**ఈ పద్యం సరసుని ప్రాముఖ్యతను వివరించింది**

**చ. సరసుడు కావ్యమందుగల సారమెఱుంగునుగాక శాస్త్రమే**
**యెరుగనిమూఢబుద్ధి మది నెట్టు లెఱుంగగ నౌను సత్యమున్?**
**నిరతము పద్మమాధురిని నేర్పున భృంగ మెఱుంగుగాక యం**
**దిరవుగనున్న కప్పయది యెట్టు లెఱుంగును వేంకటేశ్వరా! 16**

శ్రీ వేంకటేశ్వరా! శాస్త్ర జ్ఞానం లేని మూఢుడు సరసత్వమంటే తెలియని అజ్ఞుడు కావ్యమందుగల కవితాత్మను సరసతనూ ఎంత మాత్రమూ తెలియనివాడే. కావ్యపరమార్థము సరసుని ఆత్మకు ఎక్కునట్లు మూఢునకు తెలియదు. వికసించిన పద్మసుమ గంధము తుమ్మెదకు తెలియునుగాని ఆ నీళ్ళలోనే వున్ననూ కప్పకు దాని పరిమళం కొంతయినా తెలియదు కదా!

అందువలన కార్యసారము సరసునికే తెలియును. మూఢునకు తెలియదు.

* * *

**కర్షకులపై రాజు చూపవలసిన ప్రేమ యెటువంటిదో ఈ పద్యం వివరించింది**

**చ. సుగుణవిశాలరాజకులసుందరుఁడెచ్చట నున్న రైతులం**
**దగణితరక్తిజూపి పరమార్థశుభంబులొసంగు నెట్లనన్**
**గగనమునందు మేఘమదిగల్గియు దాన స్రవించు నీటిచే**
**జగమున సర్వసస్యములు సత్ఫలమందవె వేంకటేశ్వరా! 17**

శ్రీ వేంకటేశ్వరా! పరిపాలన తెలిసిన రాజనీతిజ్ఞుడైన రాజు, రైతులపై ముఖ్యమయిన అనురాగం కలిగి వ్యవసాయం వృద్ధి పొందు ప్రయత్నంచేసి అన్నదాతలను ఆదుకొనడమే గాక సస్య సమృద్ధి సాధించడానికి కారకుడై ఆ రాజచంద్రుడు కీర్తిని పొందుతాడు. ఆతని వలన జగము పరమార్థ శుభాలు సమగ్రంగా పొందుతుంది.

మేఘము ఎక్కడో దూరంగా గగనంలో వుండి కూడా, మూగనేలమీద మనసు జూపించి నీటిని వర్షించడం చేతనే భూమిలో సర్వసస్యములు పండి ఆకారణంతో అందరికీ భూమి శుభాన్ని యిస్తున్నదయింది. రాజు కూడా మేఘంలాఎక్కడో దూరతీరాలలో భోగాలతో తేలియాడుతన్నా కర్షకునిపై అనురక్తిచూపిస్తే – రాజచంద్రు డనిపించుకుంటాడు.

* * *

**అల్పుల వద్ద వున్న ధనం విలువ ఈ పద్యం వివరించింది**

**చ. కుమతులకన్నిసంపదలుగూడి మహావిభవాభిరాములై**
**యమరిన దానధర్మములయందునఁ జూపిడకుందు రెట్లనన్**
**నెమలికి పింఛమందు తుదనిల్చినమచ్చలు కన్నులంచు పే**
**రిమిడినమాత్రఁగన్నులనియెంచి భ్రమింతురె వేంకటేశ్వరా! 18**

శ్రీ వేంకటేశ్వరా! కుమతులకు అనగా మతి తక్కువగా కలవారు ఎన్ని వైభవాలతో, తుల తూగినా, ఎన్ని సంపదలు వారికి నిండుగా వున్నా ధర్మాతిశయమయిన దానధర్మాదులయందు వారు చూపు పెట్టకుండా వుంటారు. వారికి గల ధనసంపదకు తగిన ప్రఖ్యాతిని పొందలేని మతిహీనులవుతారు. అది అంతే మరి.

నెమలికి పింఛంలో గల అనేక మచ్చలను "కన్నులని పేర్కొని" నెమలి కన్నులని అందరూ పేర్కొంటారు. కాని ఆ కళ్ళు పేరుకు తగ్గట్లు చూసే గుణం మాత్రం కలిగి వుండవు. అలాగే అల్పమతుల వద్దగల ధనం నెమలి పింఛం కళ్ళవలె, పేరుగొప్ప కాని, దాని వలన ఫలితం మాత్రం ఏమీ వుండదు.

* * *

**చెడ్డవారితో స్నేహం ఎలా వుంటుందో ఈ పద్యం వివరించింది**

**చ. చెనటులతోడ నెయ్యమిలజేసిన సజ్జనగౌరవంబు జీ**
**వనము నశించి, కష్టములువాటిలకుందునె? యట్లుగాన పా**
**వనతఁదనర్చుహెూమముల భాసిలునట్టి హుతాగ్నిగూడ నా**
**యినుమునుగూడి సమ్మెటను నెంతగఁగ్రుంగదె వేంకటేశ్వరా!19**

శ్రీ వేంకటేశ్వరా! నీచులతో స్నేహము చాలా ప్రమాదకరము. దాని వలన సజ్జనులలో గౌరవము కరువగును. జీవనము కూడా కష్టసాధ్యమగును. అనేక ఇబ్బందుపాలు కావలసి వుంటుంది ఎట్లనగా ఇనుముతో కూడిన సమ్మెట దెబ్బలు తినే ఇనుముతో కూడిన పరమ పవిత్రుడగు హెూమాగ్ని దేవుడు కూడా ఆ బరువైన సమ్మెట దెబ్బలుతిని క్రుంగవలసిన స్థితి కలుగును కదా అదే విధంగా కుమతితో స్నేహం సర్వ అనర్థాలను కలిగిస్తుంది.

* * *

**ఈ పద్యం సమతి వివేక చాతుర్యం ఎటువంటిదో వివరించింది**

**చ॥ అమలవివేకపూర్ణ సుగుణాలయుతెల్విని మార్పఁ జేయగా**
**కుమతులనేకమంది గుమిగూడిన సాధ్యముగా దదెప్పుడున్**
**విమలమణింజనింపఁ గల వెల్గును నాసుడిగాలి పెల్లుగన్**
**శ్రమపడి యార్పగాఁదొడర జాలునె చప్పున వేంకటేశ్వరా! 20**

శ్రీ వేంకటేశ్వరా! చక్కని తెలివి తేటలు కల్గి, సుగుణాలలో సత్కర్మలు చేయు ప్రతిభావంతుని వివేకాన్ని ఎంతమంది కుమతులు కూడి ప్రయత్నంతో చెడగొట్టాలని? చూసినా అది సాధ్యము కానేకాదు. ఎట్లనగా –

'విమలమణి'లోని దీపపు కాంతిని సుడిగాలి ఎంతగా వీచి ఆర్పాలని చూసినా మామూలుగా వుండే నూనెదీపము మాదిరి అది సాధ్యము కాదుకదా – అలాగే, కుమతులు ఎంత ప్రయత్నించినా, సుమతి వివేకాన్ని చెడగొట్టలేరు.

* * *

**మంతి మంతుడు చేసే అల్పదోషం యెటువంటిదో ఈ పద్యం వివరించింది**

**ఉ. మూల మెఱింగి బ్రహ్మమును మోదమునం గను జ్ఞానయోగసం**
**శీలురు స్వల్పదోషములఁజేసిన వారికి నేమి యెగ్గగున్?**

**పాలనుగాచి చేమిరిడి పక్వముగాఁగ మథింప వెన్న పై**
**దేలునుగాని తక్రమునదించినమున్గునె వేంకటేశ్వరా! 21**

శ్రీ వేంకటేశ్వరా! జ్ఞానయోగులయిన పెద్దలు కొందరు స్వల్ప దోషములను జేసిననూ, ఆదోషఫలితం వలన వారు నష్టపోవుట జరుగదు. ఎందువలననగా, వారు తత్త్వసాధనను శోధనంతో చేసి మూల తత్త్వమెరింగిన విజ్ఞానులు. అందుచే అల్పదోషములు వారిని బాధించలేవు. ఎట్లనగా, బాగా కాగిన పాలలో తోడుగా 'మజ్జిగ' చుక్క వేసిన యెడల అది మీగడ పెరుగై, దానిని మథించిన చక్కని వెన్న పైతేలును గాని, మజ్జిగలో తోడు చుక్క వుంచితే దానివలన పెరుగు కావడం, వెన్న చిలకడం జరుగుతుందా, జరుగదు. నష్టమూ లేదు.

అంతేకదా, మఱచిపోయి మజ్జిగలో తోడు వేస్తే వచ్చేనష్టం ఏమీ లేదు. తక్రము తక్రంగానే వుంటాయి. ఏమార్పు వుండదు. అలాగే చిన్న తప్పులు చేసినందువలన మతిమంతులు నష్టపోయేది వుండదు. వారి శక్తి అలాగే వుంటుంది.

* * *

**మంచివారలను దుష్టులు దూషిస్తే వచ్చే నష్టం ఎటువంటిదో ఈ పద్యం వివరించింది.**

**ఉ. సారమెఱింగిబ్రహ్మఁగను సత్యవిచారము గల్గువారికిన్**
**క్రూరులు లేనినిందలను గూర్చిన వారలఁ జెంద వెందునన్**
**గారుడ మంత్రసిద్ధు నురగంబులు ముట్టిన నావిషంబు ని**
**స్సారమునందుగాని మఱి చంపగనేర్చునె వేంకటేశ్వరా! 22**

శ్రీ వేంకటేశ్వరా! జనసమూహంలో కొందరు దుర్బుద్ధులు క్రూరులై జ్ఞానులై బ్రహ్మతత్త్వ విచారులై సత్యమార్గంలో పయనించే మంచి వారలపై

నిందలు వేసి బాధించాలని చూస్తారు. కాని ఆ క్రూరులు వేసే నిందలు వారిని యేమీ బాధించ జాలవు. ఎలాగంటే గరుడమంత్ర సిద్ధుని పాముకాటు వేసి బాధించునా, దాని విషము ఆ సిద్ధుని యేమీ చేయలేదు. ప్రాణాపాయము కాక గరుడ మంత్ర సిద్ధుడు హాయిగా జీవించి వున్నట్లే, సత్పురుషులను క్రూరులు నిందలతో బాధించినా ఆ నిందలు గరుడ మంత్ర సిద్ధులకి పాముకాటు వలన యెక్కు విషము నిష్ఫలమయినట్లు వారి నిందలు వ్యర్థమగును. ఏ నష్టమునూ కల్గించవు.

* * *

**జ్ఞానుల సాంగత్య మహిమ ఎటువంటిదో ఈ పద్యం వివరించింది**

**ఉ. యోగులయొద్దమూఢమతులుండిన తత్త్వవిచారమార్గమున్**
**బాగుగజూపి బ్రహ్మపద భావవిమర్శన గూర్తు రెప్పుడున్**
**నాగసొరంబురీతి స్వరనాదములేర్పడ కొయ్యదీర్ప నం**
**దాగమవేద్యగీతము లవన్నియు బల్కవె వేంకటేశ్వరా! 23**

శ్రీ వేంకటేశ్వరా! జ్ఞానులయిన వారల వద్ద మూఢమతులు తమ అదృష్టము వలన ఉండగలిగినట్లయితే, ఆ యోగులు మూఢమతికి తత్త్వ విచారము నేర్పి మంచి మార్గము చూపి ఆ బ్రహ్మ పద భావ విచారణతో వారిని నిపుణమతులుగా పవిత్రులనుగా చేస్తారు. అది ఎలాగంటే–

కొయ్యను నాగస్వరం వచ్చే సొరంగంగా మార్చినట్లయితే ఆ కొయ్య నాగసొరంగమై. మనోజ్ఞ సుందరములయిన ఆగమ వేద్య గీతములన్నియు పల్కి ఆ మొద్దుకొయ్య పరమ పావనమగు చున్నదికదా. ఆ విధంగానే జ్ఞానుల సంగతి కల్గివుంటే తత్త్వ విచారంతో బ్రహ్మజ్ఞాని అవుతాడు.

* * *

**దొంగ యోగుల పద్ధతి ఈ పద్యం చెప్పింది**

**ఉ. కోమలు లన్యమార్గమునఁగూడి చరించుచునుండియుండియున్**
**నీమముతోడి నీతులనునేర్పున బల్కుచునుందు రెప్పుడున్**
**తామరక్రింద నీరుగతి తప్పకకామములంటియుండి పై**
**నేమియు నంటనట్లు వచియింత్రు కుయోగులు వేంకటేశ్వరా! 24**

శ్రీ వేంకటేశ్వరా! కోమలులయిన కుయోగులు కొందరు అన్యమార్గాలలో అధర్మప్రవర్తన కల్గియుండి తప్పులెన్నో చేసి కూడా నియమ నిష్ఠలు కల్గినట్లుగా నటిస్తూ ఎన్నో ధర్మపన్నాలూ, నీతులూ వల్లిస్తూ వుంటారు.

అది ఎలా వుంటుందంటే తామరాకు క్రింద నీరులాగా, వారు రకరకాల కామాలతో వ్యవహారం జరిపినా పైన తామరాకుకు నీరు అంటనట్లుగా వారు తప్పులు మాత్రం బయట పడకుండా జాగ్రత్త పడతూ చేతలలో అధర్మ ప్రవర్తనులై వుంటారు. వారిని గమనించడం తామరాకుక్రింద నీరులాగా కష్టమని తాత్పర్యం.

* * *

**ఎటువంటి శిష్యునికి గురువు బోధించాలో ఈ పద్యం వివరించింది**

**ఉ. తాను సమస్తధర్మవిబుధత్వవిచారత నందియుండి, య**
**జ్ఞానిని శిష్యుఁగా బడసి సత్యపుబోధయొనర్చుఁటెట్లనన్**
**ఈనిన పాడియా వొకరి కిచ్చి తృణంబునకీడుగాని యా**
**పీనుగువోలు దున్నఁ గొని పెంచిన యట్టులె వేంకటేశ్వరా! 25**

శ్రీ వేంకటేశ్వరా! సద్గురువు సుజ్ఞానియై, ధర్మవిచారణ తత్పరుడై వుండి ఒక మంచి శిష్యునికి సన్మార్గాన్ని బోధించకుండా, అజ్ఞానికి సత్యబోధ

చేయడం పూర్తిగా వ్యర్థమయిన పని యగును. ఎట్లనగా చక్కని పాలను ఇస్తూ వున్న పాడియావును ఇచ్చి గడ్డిపఱకలతో కూడా సమంగాని, ఒక బక్క చిక్కిన దున్నపోతును కొని తాను కొని పెంచితే అది ఎంత అనుచితమో అజ్ఞానిని దగ్గఱకు తీసి సత్యబోధ చేయడం కూడా అంతే అసత్యమవుతుంది.

* * *

**ఈ పద్యంలో భక్తిమార్గ ప్రాశస్త్యం వర్ణింపబడింది**

**ఉ. చక్కనిభక్తిమార్గసువిచార మెఱింగిన సాధుశీలుఁ డిం**
**కొక్కని నాశ్రయింప మది నొల్లడు ప్రాణముతోడ నెట్లనన్**
**చక్కెరలోని తీపుగలసార మెఱింగిన చీమ మూటలో**
**జిక్కియు దానికాయువటఁ జిక్కిన వీడునె వేంకటేశ్వరా! 26**

శ్రీ వేంకటేశ్వరా! భగవంతుని చేరే మార్గాలలో భక్తిమార్గం చాలా గొప్పదని వాఙ్మయ మంతా బోధించింది. అటువంటి భక్తి మార్గ సువిచార మెఱింగిన మంచి జ్ఞాని తత్త్వాన్వేషణకు మరొకనిని ఆశ్రయించడం ప్రాణాంతం వరకూ కూడ చేయడు. అది నిజమే కదా మరి దానికి దృష్టాంతమేమంటే, చక్కెర మూటలో చిక్కి చక్కెర సారమెరింగిన చీమ, దాని ప్రాణాంతక్రము వరకు కూడ ఆ చక్కెరను వీడి రాదు కదా.

ప్రాణాపాయమని తెలిసినా కూడా ఆ చక్కెర మూటను చీమ విడువనట్లు, భక్తిమార్గాన్ని అవలంబించిన జ్ఞాని కూడా ఎటువంటి పరిస్థితులలో కూడా అంటే ప్రాణాపాయ స్థితిలో కూడా ఆ మార్గాన్ని వదలలేదు.

* * *

**తప్పు చేస్తే వచ్చే నష్టం ఈ పద్యం వివరించింది**

**ఉ. హానికరంబునైన దనియైనగ్రహింపరు చెడ్డవాడుకన్**
**మానగలేరు కొంద రనుమానముగల్గియు పెద్దలైన నా**
**దానవు లెల్ల నా కచుని దగ్ధముజేసిన బూది కల్లునన్**
**మానుగ నింపి శుక్రు కిడ మత్తిలఁద్రావడె వేంకటేశ్వరా! 27**

శ్రీ వేంకటేశ్వరా! సమాజంలో పెద్దలయిన సుజ్ఞానులు కూడా, కొన్ని విషయాలు, హానికరమని తెలిసీ చెడు మార్గమని భావించి కూడా ఆ తప్పులను చేసి నష్టపోతుంటారు. తెలియక చేసినా, తెలిసి చేసినా, తప్పు తప్పే కదా. నష్టం తప్పక వస్తుంది కదా.

ఎట్లనగా– నీతిశాస్త్ర రచయిత అయిన శుక్రాచార్యులు వారు కూడ మద్యపానము దోషమని తెలిసీ మద్యపానలోలురై, తన ప్రియశిష్యుని చంపి బూడిదిగా చేసి, ఆ బూడిద కలిపిన మద్యాన్ని రాక్షసులివ్వగా త్రాగి శవబూడిదను త్రాగిన అల్లుడిగా పేరు పొందాడు కదా. మృత సంజీవని విద్యను మరొకరికి మాట తప్పి చెప్పిన వాడయ్యాడుకదా అందువలన దోషాల జోలికి పోకూడదు.

* * *

**ఈ పద్యం శౌర్యవంతుని గొప్పదనం ఎటువంటిదో వివరించింది**

**ఉ. ఎందఱుశౌర్యహీను లెదురేగిన విక్రమధుర్యు నాజిలో**
**మందగంజేయఁ జాలరు క్రమంబుగ గుంపులుగూడి మూగినన్**
**పొందుగ సర్వజాతిమృగపుంజ మరణ్యములోన సింహరా**
**జుందగదాకి యెట్టులిల సుస్థిరతంగను వేంకటేశ్వరా! 28**

శ్రీ వేంకటేశ్వరా! పరాక్రమవంతునిగా ప్రఖ్యాతి పొందిన ధైర్యవంతుని శౌర్యహీనులు ఎంతమంది గుంపులు గుంపులుగా సంఖ్యాబలంతో ఎక్కువగా

వుండి యెదుర్కొనినప్పటికిన్నీ యుద్ధంలో ఆతనిని గెలువలేరు. అపజయాన్నే వారు పొందుతారు.

అదెలాగంటే- అరణ్యంలో రాజయిన సింహాన్ని ఆ అరణ్యంలో మృగజాతి సర్వమూ కలసి గుంపుగా వచ్చి యుద్ధానికి తలపడి? ఎదుర్కొన్నప్పటికీ అవి ప్రాణాలు పోగొట్టుకుంటాయి తప్ప-

ఆ మృగరాజును గెల్వలేవుకదా. అలాగే శౌరవ్యవంతుని ఎందరు శౌర్యహీనులు లెక్కకు మిక్కిలిగా నెదుర్కొన్నా గెలవలేరు. అపజయాన్నే పొందుతారు.

* * *

**సాధువులయిన వారు చేసే పరోపకార ప్రాధాన్యం ఈ పద్యంలో వివరించింది.**

**ఉ. న్యాయ మెఱుఁగుసాధువుల కబ్బినసంపదలెన్నియున్న సు**
**శ్రేయమె ఆర్యకోటులకు జేయగఁ జూతురు ప్రీతి నెట్లనన్**
**కాయలుగాయుమ్రాను నుపకారముమై తలవంచి నమ్రతన్**
**మోయుచు నెల్లవారలకు మోదము గూర్చదె వేంకటేశ్వరా! 29**

శ్రీ వేంకటేశ్వరా! న్యాయమార్గమెఱుంగు సాధుజీవనులు తమకు మిక్కిలిగా సంపదలు కల్గి శ్రీమంతులై, తమ ధనాన్నీ, శక్తినీ, మంచి వారలకు హితం చేయడానికై ఎపుడూ శోధిస్తూ, ఉపకారం చేస్తూ ఉంటారు. అదివారలకు సహజమేకదా.

ఫలవృక్షాలు, తాము ఎంతగా మ్రానులై పొడవై ఎత్తుగా వున్నప్పటికీ, పరులకు ఉపకారం చేయాలనే తలంపు కల్గి ఫల భారంతో తమ కొమ్మలన్నీ వంచి సాధువుల కందరికీ తమ ఫలాలనిచ్చి పరోపకార పరాయణత్వాన్ని

విదితం చేస్తాయికదా. అలాగే సాధువులయిన శ్రీమంతులు కూడా తమ సర్వ సంపదలనూ, సర్వశక్తులనూ, పరోపకారంకై ఉపయోగించాలని చూస్తారు.

* * *

**పండితోత్తములనుగని అసూయపడితే ఎలా ఉంటుందో ఈపద్యం వివరించింది**

**ఉ. సంతత మాత్మబోధసువిచారణగల్గిన పండితోత్తముం**
**డెంతని యల్పవాది మది నీర్ష్యవహించిన నిల్వజాలునే?**
**కొంత శరీరరుగ్మతను గుందెడు సింహముతో సృగాలమున్**
**పంతముబూని పోర తన ప్రాణమునిల్పునె? వేంకటేశ్వరా! 30**

శ్రీ వేంకటేశ్వరా! పండితోత్తములూ, సుప్రతులూ, జ్ఞానులయిన ఆత్మతత్త్వవేత్తలను, అల్పులు కొందరు 'మీరంటే ఎంత' అని ఈర్ష్యతో నోటికొచ్చినట్లు నిదించి ఎదురుపడిపోరాటానికి నిల్చినట్లయితే వారు విజేతలు కావడం ఎప్పటికీ జరుగదు. ఎలాగంటే–

అరణ్యంలో మృగరాజయిన సింహాన్ని – అనారోగ్యంతో కొంత నలతగా వున్న ఆ సింహాన్ని నక్క సంతతము పూని ఎదుర్కొని యుద్ధానికి తలపడితే నక్క ప్రాణాలు పోగొట్టుకుంటుంది తప్ప ఏదో రోగం వచ్చి బాధ పడుతున్నప్పటికీ ఆ సింహాన్ని నక్కఏమిచేయలేదు సరికదా, దానిచేతిలో ప్రాణాలు పోగొట్టుకొనే దుస్థితిని అది పొందుతుందిగదా!

అలాగే పండితోత్తములను అన్యాయంగా అల్పుడెదుర్కొని శృంగభంగం పొందుతాడు తప్ప మరొకటి కాదు.

* * *

**ఈపద్యంలో జీవంలేని ధనం గురించి వివరించడం జరిగింది**

**ఉ. జీవములేని యా ధనముజేర్చినవారలపేరు పెద్దదై**
**భూవలయంబునందు జనపూజితమై విలసిల్లు నెట్లనన్**
**పావనమైన నాదముల బల్కుచు దుందుభి కొయ్యయయ్యు నా**
**దేవతలైనమెచ్చి తలద్రిప్పగఁజేయదె వేంకటేశ్వరా! 31**

శ్రీ వేంకటేశ్వరా! సమాజంలో కొందరు జీవములేని యా ధనము గొప్పగా కల్గివుండి మంచి పేరు ప్రతిష్ఠలు కల్గి భూవలయంలో అందరిచేత పూజలుపొంది గౌరవాన్ని పొందుతూ వుంటారు. అది నిజమే యనిపించును గదా.

దుందుభి కొయ్య అయినప్పటికీ పావనమయిన శబ్దాన్ని అది ధ్వనించుటచే ఆధ్వనులను విని దేవతలు కూడా ఆనందంతో తలలను ఊపి సంతోషిస్తూ ఆ దుందుభిని గౌరవిస్తారుకదా, అలాగే –

కొందరు ఏపసలేనివారయినా ధనసంపపద కల్గి ఆధనంతో సర్వపూజ్యులై గౌరవాన్ని నిండుగా పొందుతుంటారు. దుందుభిగా మారిన కొయ్యలా.

* * *

**పెద్దలను గౌరవించే పద్ధతి ఈ పద్యం వివరించింది.**

**ఉ. ఎవ్వరుగాని పెద్దలకు నింపుగసేవలు జేయకూర కే**
**క్రొవ్వన మాటలాడ నిలఁగూలకబోవ రదెట్టు లన్నచో**
**అ వ్వనమందు శృంగి తనయబ్బనుదూరు సుభద్రపౌత్రునిన్**
**కెవ్వనఁదిట్టి చంపి తన కీర్తిని నిల్పదె వేంకటేశ్వరా! 32**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో ఎవ్వరయినా పెద్దలకు ఎంతో యిష్టంగా సేవలు చేయవలసిందే. మంచిగా వారితో మాటలాడవలసిందే తప్ప అలాగ

కాకుండా క్రొవ్వుతో– నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ– మదంతో విర్రవీగితే వారు ప్రాణాలు పోగొట్టుకొంటారు. ఎలాగంటే–

ఆనాడు పరీక్షిన్మహారాజు– తన తండ్రిని నిందించి సర్ప శవాన్ని మెడలో వేసి అగౌరవం చేశాడనీ శమీక పుత్రుడయిన శృంగి అనువాడు ఆ రాజును ఘోరంగా తిట్టి ఏడురోజులలో పాము కరచి చనిపోవునట్లు శాపమిచ్చాడు కదా. ఆ రాజు కూడా అలాగే పాము కరచి చచ్చిపోయాడు కదా. కావున పెద్దలను అగౌరవపరిస్తే ప్రాణాలు పోగొట్టుకోక తప్పదు.

* * *

**తెలియని గురువు చదువు చెప్పడం ఎలా వుంటుందో ఈ పద్యం వివరించింది**

**ఉ. లోకమునందు మాయలకు లోబడుమూఢుడు వేదమార్గమే**
**జేకొనకుండి శిష్యులకు జేసెడుబోధయదెట్టు లన్నచో**
**మేకలనేలద్రోసి మెడమీదను వాలిడికోయుమ్లేచ్ఛులే**
**యేకమనంబుతోడ జపియించెడు మంత్రమె వేంకటేశ్వరా! 33**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో రకరకాల మాయలు జేస్తూ. అందరినీ వంచిస్తూ– మంచివయిన వేదాలకర్థం కొంతయినా తెలియకుండా శిష్యులకు బోధ చేయడానికి ఆచార్య పదవిని స్వీకరించడం ఎంత ఘోరంగా వుంటుందంటే.

కసాయినాడు మేకను క్రింద భయంకరంగా పడేసి దాని మెడపై కత్తిని పెట్టి నఱుకుతూ మ్లేచ్ఛుడై అపవిత్రుడై మంత్రం జపిస్తూ వుంటే ఎలా వుంటుందో అలాగ వుంటుంది.

అనగా క్రూరమయిన భయంకరమయిన హేయమయిన చర్య అవుతుంది.

* * *

**హీనులయినవారు భాగ్యవంతుయితే ఎలా వుంటారో ఈపద్యం వివరించింది.**

**ఉ. హీనుఁడు భాగ్యవంతుఁడని యెంతముదంబునగోరి చేరినన్**
**హానియె గాని వానికది యబ్బఁగనేర దదెట్టు లన్నచో**
**భానునిభాంశమైన మణిపాపశిరంబున నున్నదానికై**
**మానిసి యాశబూని యమమందిరమేగడె వేంకటేశ్వరా! 34**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో హీనులు కూడా మహాభాగ్యవంతు లవుతారు. ఆ సమయంలో హీనుడయినా వాడు భాగ్యవంతుడు కదా. అడిగితే ఏదయినా ఇవ్వకపోదుకదా! అని యాచకులు అతనిని అడగటానికి వచ్చి ఆశాభంగం జరిగి మోదాన్ని పొందకుండా దుఃఖాన్ని పొందుతారు. ఎలాగంటే–

విలువయిన మణి కలిగి వుంది కదా అని మనిషి ఆశపడి పాము వద్దకు వెళితే అది కసిదీరా కాటువేసి బాధిస్తుంది తప్ప మణి ఇవ్వదుకదా. అలాగే భాగ్యవంతుడయిన హీనుడు కూడ మణిని ధరించిన పాము వంటి వాడే.

* * *

**యోగ్యులయినవారికి కష్టాలు ఎటువంటివో ఈపద్యంలో చెప్పబడింది**

**ఉ. యోగ్యులకైన కష్టదశ లుండక శీఘ్రముగా నశించి యా**
**రోగ్యము సర్వసంపదలు రూఢిగ గూడు నదెట్టులన్న వై**
**రాగ్యము బూని రాహువట రాజునుబట్టియు చంపలేక దౌ**
**ర్భాగ్యయశంబునంది యెడఁబాఁయడె యోర్వక వేంకటేశ్వరా!35**

శ్రీ వేంకటేశ్వరా! యోగ్యులయిన వారికి కాలం కలసిరాక కష్టాలు వచ్చి బాధించినా, అవి యెంతోకాలము నిల్వకుండా అల్పకాలంలోనే

కనుమరుగై పోతాయి. ఆ తరువాతవారు సర్వ సంపదలతో తులతూగుతూ ఆనందంగా జీవిస్తారు.

మరి ఆది అంతేకదా! రాహువు చల్లనయిన చందమామను పట్టుకొని కూడ అతనిని చంపకుండా వైరాగ్యం పొంది కొలది కాలం మాత్రమే బాధించి అటుపై బాధించలేక ఆప యశస్సును పొంది చంద్రున్ని విడిచి పెడుతున్నాడు. అపుడు చందమామ రాహు గ్రహవిముక్తుడై మునుపటికంటె గొప్ప కాంతిని పొంది అందాలతో విరాజిల్లుతున్నాడు. అలాగే యోగ్యులయిన వారికి కష్టాలు క్షణంలోనే తొలగి పోయి సౌఖ్యం స్థిరంగా కల్గి ఆనందిస్తారు.

* * *

**పేదవాని దురాశ ఎలా వుంటుందో ఈ పద్యం వివరించింది**

**ఉ. విశ్వమునేలు వాని కడుపేద యెదుర్పగగోరి రాజ రా**
**జేశ్వరునట్లు రాజ్యమును నేలదలంపు వహింప సాగునే**
**అశ్వమువెంట గార్ధభము నంటగద్రోల ప్రతిజ్ఞ జేసి తా**
**శాశ్వతమైన దిగ్విజయ సంపదనోడడె వేంకటేశ్వరా! 36**

శ్రీ వేంకటేశ్వరా! కడుపేదవాడు, ప్రపంచాన్ని మొత్తం పరిపాలించే విశ్వపరిపాలకుని మాదిరిగా సామ్రాజ్య పరిపాలన చేయాలని ఆశపడితే అది సాధ్యము కాగలదా! అతని కోరిక యెంత మాత్రమూ నెఱవేరదు.

దిగ్విజయ సంపద పొందాలని ఆశ్వమేథయాగం చేసి అశ్వాన్ని పంపించిన ఆయశ్వంతో పేదవాడు ఒక గాడిదను కలిపి పంపితే నేను కూడ విశ్వసామ్రాజ్య అధిపతిని కావాలని గాడిదను పంపించానంటే అతడుదిగ్విజయ సంపదను పొందక వుండడం అటుంచి అందరితో చివరకు ఆ గాడిద చేతనే తన్నులు తన్నించి అవమానం పొందేట్లు అందరూ చేస్తారు. అది తగని కోరిక.

ఎవరయినా తగిన కోరిక కోరితే నెఱవేరుతుంది తప్ప దురాశ దుఃఖాన్ని తప్పక తెస్తుంది.

* * *

**ఈపద్యం ఆకలిలో వున్నవానికి పని చెబితే ఎలా వుంటుందో వివరించి చెప్పింది.**

**ఉ. తిండికి లేక బెండువడి దీనతనుండెడు వాని కన్నమున్**
**దండిగఁబెట్టి పంప కతిదర్పముతో పనిజెప్ప జేయునే?**
**యెండి పగుళ్లువారు భువి కెక్కువనీటిని గట్టలేక తా**
**కుండెడు జల్లి దున్ననెడ కోపెటునిల్చును వేంకటేశ్వరా! 37**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు వికృత స్వభావులు, ఆకలితో అల్లాడుతూ దీనాతి దీనంగా అన్నం పెట్టించండి అని అడగటానికి వస్తే వారికి అన్నం పెట్టకుండా మరీక్రూరంగా గర్వంతో వారికి ఆపని చేయీా ఈ పనిచేయీా అని పనులు చెబితే ఆకలితో వున్న వారు ఆపనులు చేస్తారా చేయలేరు.

వారికి పనులు చెప్పడం ఎలాగ వుటుందంటే ఎండి పగుళ్ళు వారి వున్న భూమిలో ఎక్కువగా నీరు పెట్టకుండా ఒక కుండెడు మాత్రం నీళ్ళు ఆ భూమిపై జల్లి ఆ భూమి మెత్తగా దున్నాలని ప్రయత్నిస్తే నాగలి కోపు దున్నడానికి నిలుస్తుందా నిలువదు కదా. పగుళ్ళు వారిన భూమిని దున్నాలంటే మంచి పదునైన వానకురవాలి. అపుడు కోపు నిలిచి భూమిని మెత్తగా దున్నడం జరుగుతుది. అలాగే ఆకలికొన్నవారికి అన్నంపెట్టకుండా పనులు చేయిస్తే అతను ఎంత మాత్రము చేయలేడు. అంతేగాక అతడు పనిచెప్పిన వానికి అపకీర్తిని కలిగిస్తాడు.

* * *

**వ్యామోహాలు ఎలా ఎలా పతనం చేస్తాయో ఈ పద్యం వర్ణించి చెప్పింది**

**ఉ. మానవు డాశచేత నవమానపుకార్యము లెన్నొ చేయగా**
**బూని సమస్తకష్టములు బొంది దరిద్రతనందు నెట్లనన్**
**జ్ఞానవిచారమార్గమును గల్గిన, యోగివరేణ్యుడైన నా**
**సానికి జిక్కెనేని తనసర్వముగోల్పడు, వేంకటేశ్వరా! 38**

శ్రీ వేంకటేశ్వరా! మానవుడు ఆశలకు లొంగిపోయి అనేక అవమానాలు పొందే కార్యాలు చేస్తూ దాని వలన మిక్కిలి కష్టాలు పొంది చివరకు ఎంతో దరిద్రుడయి దుఃఖాన్ని పొందుతాడు.

అదంతేకదా. ఎట్లనగా– విషయజ్ఞాన ధనులైన యోగులు కూడా కామసంరంభానికి ఆశపడి సానుల వద్దకు వెళ్ళి ఆవేశ్యాలోలత్వంలో సర్వం చెడిన వారై చివరకు అపకీర్తినిపొంది భ్రష్టులవుతారుకదా. ప్రపచంలో ఇటువంటి సంఘటనలు ఎన్నో కలవుకదా. సాహిత్యంలో విప్రనారాయణ చరిత్ర కూడా ఇటువంటిదేకదా. కావున మానవుడు వ్యామోహాలకు గురి కాకుండా జాగ్రత్త పడాలి.

* * *

**లేనివానిని అడిగితే వచ్చే ప్రయోజనం ఈపద్యం వివరించింది**

**ఉ. మంటిది ముంతలేక బ్రతిమాలుచు కొంగులుగట్టిముష్టి కిం**
**టింటికి బోవువానినొక యిత్తడిపాత్రనుఁ గోర దెచ్చునే**
**వంటయెచేయలేదనిన వానిని భోజనమొక్కముద్దయే**
**వెంటనె బెట్టిపంపుమని వేడినయట్టులె వేంకటేశ్వరా! 39**

శ్రీ వేంకటేశ్వరా! అతను ఏమీలేని ముష్టివాడు. వానికి యాచించుటకు చివరకు మట్టిముంత కూడ లేక కట్టుకున్న కొంగు గుడ్డలో ముష్టిని పెట్టుకుంటున్న అభాగ్యుడతడు. అతనిని యిత్తడి పాత్రను ఇవ్వమని యాచిస్తే

అతడు దానిని యివ్వగలడా. ఎటువంటి పరిస్థితులలో వాడిచ్చుట జరుగదు. అతనిని ఆలా కోరడం ఎలా వుంటుందంటే.

నేను అసలు ఈ రోజు వంట చేయలేదయ్యా అని అనేవాడి వద్దకు వెళ్ళి ఒక ముద్ద భోజనం వెంటనే పెట్టి పంపుమని వేడుకొంటే ఎలావుంటుందో అలాగ వుంటుంది. కాబట్టి లేనివానిని అడిగితే ప్రయోజనం శూన్యం.

* * *

**భువిలో కొందరు ధనవంతులు ఏ పరిస్థితిలో దానం చేస్తారో**
**ఈ పద్యం వర్ణించి చెప్పింది.**

**ఉ. మేడలు గల్గియున్ననయమే గని యెవ్వఁడొసంగఁ డెప్పుడున్**
**వీడక పట్టికొట్టు నవివేకుల కోడక యిత్తు రీయిలన్**
**దూడలు పాలుద్రాపునెడ దూటుచు మూతుల గ్రుమ్మకున్న చే**
**పీడవు గోవులంచు జగమెల్ల నెఱుంగదె వేంకటేశ్వరా! 40**

శ్రీ వేంకటేశ్వరా! మేడలు మిద్దెలు కల్గి బాగా సంపాదించిన కొందరు ధనవంతులు ధర్మమార్గాన్ని అనుసరించి దానం చేయడం ముఖ్యమని తెలియదు. అడిగితే లేదని యంటారు. కాని వారిని పట్టుకొని కొట్టి హింసించి బాధించిన వారికి అడిగిన వెంటనే అన్నీ ఇవ్వడం చేస్తారు.

అది అంతేకదా– ఆవుల పొదుగులో చేపు వచ్చి పాలనివ్వాలంటే వాని దూడలు ముందుగా దానిని మూతులతో తన్ని నోటితో దూటుచు పొదుగును బాధించవలసిందేకదా. అపుడే కద ఆవులు పాలనిస్తాయి. అలాగే కొందరు ధనవంతులు హింసిస్తేనే వారి వద్ద వున్నవి ఇవ్వడం చేస్తారు. లోకంలో కొందరి ధనవంతుల స్వభావమిది. ఆవులను దూడలు గ్రుమ్మినట్లు క్రుమ్మితేనే దానం చేయాడనికి ఇష్టపడతారు.

* * *

**సజ్జన సాంగత్య మహిమ ఈ పద్యంలో చెప్పబడింది**

**ఉ. తుంటరియైన సాధువులతో గడుమైత్రి వహింప ధర్మముల్**
**వెంటనె లభ్యమంది గుణవేద్యతబొంది చరింపకుండునే**
**అంటిడ పుల్పు మాన్చి రుచి నంది రసాలము తత్ఫలంబులన్**
**బంటకు దెచ్చి నిల్పి గుణవంతము జేయదె, వేంకటేశ్వరా! 41**

శ్రీ వేంకటేశ్వరా! తుంటరివాడయినా, ఎంతఅల్లరివాడయినా, సాధువులతో కలసి తిరిగి వారితో సాంగత్యము కల్గి వుండినట్లయితే వాని తుంటరితనం తొలగిపోయి, ధర్మాలన్నింటిని యెఱింగిన వాడవుతాడు. ఇంకనూ గుణవంతుడయి, జీవితంలో మంచి పేరు పొందుతాడు.

అది అంతే మరి. మామిడి అంటును పుల్లగా వున్నదానిని తీసుకొనివచ్చి తీయమామిడి అంటుతో కలిపి అంటుకట్టినట్లయితే ఆ మామిడి అంటుకు పూర్వమున్న పులుపంతా సమసిపోయి మంచి తీయందనము కల్గిన రసాల ఫలాలను ఆ మామిడి అంటు ఇస్తుంది కదా, అలాగే మంచివారలతో కలసి మెలసి తిరిగితే చెడ్డవాడు కూడ మంచివాడుగా మారి పేరు ప్రఖ్యాతులు పొందగలడు.

సజ్జన సాంగత్యం అంత మహిమ కలిగి వుంటుంది.

* * *

**తెలివి తక్కువవాడు చేసే పని యెలా వుంటుందో ఈ పద్యం వివరించింది**

**ఉ. వీడును కూడులేక పలవించు దరిద్రునిజేరి యప్పుగా**
**మాడలనిమ్మటంచు బతిమాలిన నాతడు నీయనేర్చునే**
**వాడినగడ్డికేమొగము వాచిన యావెటొ యీనబడ్డ పా**
**ల్దాడకె యీయకున్న నొక దుత్తెడుగోరుటె వేంకటేశ్వరా! 42**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో ఒకడు వీడు, గూడు, కూడు– ఈ మూడు లేక చిరునామా అసలు లేక బాధపడుతుంటే, దరిద్రుడై పలవిస్తుంటే, వాడి వద్దకు వెళ్ళి కొన్ని రూపాయలు అప్పుగా యివ్వమని ప్రాధేయపడి అడగడం ఎలా వుంటుందంటే–

వాడిన గడ్డికే మొగము వాచి, తింటానికి లేక బక్కచిక్కిన యావు ఏదోరకంగా బాధపడి కన్న చిన్న దూడకు కొన్నిపాలు ఇవ్వడానికే లేక నానా అవస్థలు పడుతుంటే దానివద్దకు దుత్తనొకటి తీసుకొనివెళ్ళి దాని నిండా పాలనివ్వమని కోరితే ఎలా వుంటుందో అలా వుంటుంది.

అది "ఉపయోగం లేని పని ప్రయోజనం శూన్యం" అవుతుంది తెలివిలేనివానిపని అవుతుంది.

* * *

**దురాశపరుని స్థితి ఎటువంటిదో ఈ పద్యంలో చెప్పడం జరిగింది**

**ఉ. రూకలుగల్గువానివలె లోకములోన గృశించు బీద తా**
**శ్రీకరవైభవంబులను జెందఁదలంపు వహింప సాగునే?**
**కాకము గ్రద్దతోడ జన గర్వముబూని ప్రతిజ్ఞ జేయగా**
**నాకసమందు దానిసరియై విహరించునె వేంకటేశ్వరా! 43**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో నిరుపేదయియన వాడు తగని కోరికలు కల్గి ధనవంతునివలె శ్రీకరవైభవంబులతో జీవించాలని ఆశపడడం ఎలా వుంటుందంటే–

కాకి మహాగర్వంతో కూడని ప్రతిజ్ఞలు చేసి గ్రద్దతో కలిసి ఆకసంలో ఎగిరి దానివేగాన్ని మించి వేగంతో వెళ్ళగలవని పందెం కట్టి ఎంతగా ఎగిరినా గ్రద్ద వేగంతో దానివేగం సరిపోక ఓడిపోయి కాకికి

శృంగభంగమయినట్లు నిరుపేద తగని దురాశతో సిరిగలవానితో పోటీపడి ఆ మాదిరిగ వుండాలని ప్రయత్నించడం కాకి పందెంలాగా వుంటుంది.

* * *

**అజ్ఞాని యయిన రాజు పరిస్థితి ఎటువంటిదో ఈ పద్యం వివరించింది**

**ఉ. పాడి యొకింతలేని నరపాలుడు పౌరులగోడు మాన్పగా**
**జూడక క్రోధబుద్ధిఁగొని స్రుక్కగజేయదలంచుటెట్లనన్**
**వీడినకోడె యావుగని వెన్కొని వట్టిదియైనగాని గో**
**రాడుచు నెక్కి త్రొక్కి శ్రమనందఁగఁజేయుటె, వేంకటేశ్వరా! 44**

శ్రీ వేంకటేశ్వరా! న్యాయమెఱుంగని మహారాజు అధర్మపరుడై ప్రజల కష్టాలను తీర్చడానికి ఏమాత్రం ప్రయత్నం చేయకుండా అసలే కష్టాలతో కుమిలిపోతున్న జనాలను నిష్కారణ కోపంతో వారిని మరింతగా బాధించడం ఎలా వుంటుందంటే –

వట్టి పోయి నీరసమయిన ఆవు వద్దకు ఎదతో పోటెత్తిన కోడె వెళ్ళి దానిని గోరాడుచు నానా విధాలుగా ఎక్కి తొక్కి వట్టిపోయిన ఆవును శ్రమపెట్టడం ఎటువంటిదో అటువంటిదవుతుంది. కోడెకు ఆ నీరసపు వట్టిపోయిన ఆవు వల్ల ప్రయోజనం ఏమాత్రం లేక శ్రమ మిగిలినట్లు న్యాయమెఱుంగక నరపాలుడు ప్రజలను క్రోధబుద్ధితో పీడించడం కూడ అలాగే వుంటుంది. పనికిమాలిన పనివంటి దవుతుంది.

* * *

***పుణ్యులను దూషించడం ఎలా వుంటుందో ఈ పద్యం వివరించింది.***

**ఉ. సర్వజనోపకారములు సల్పెదు పుణ్యులనైన నూరకే**
**యుర్విని దూరుమూఢమతులుందురు కొందరు దుష్టచిత్తులై**

**పర్వము గూర్చి రాత్రిపరిపాలనజేయుచునుండు చంద్రునిన్**
**దుర్విధి జారచోరు లతిదూషణ జేయరె? వేంకటేశ్వరా! 45**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు మూఢమతి కల్గి మంచివారలను, పరోపకారంచేసే మాన్యులను, పుణ్యాత్ములను, నోటికొచ్చినట్లు తిట్టి దూషిస్తూ వుంటారు. అది తగని పద్ధతి. అది యెలా వుంటుందంటే–

మంచి వెన్నెలతో చందమామ రాత్రి శోభాయమానంగా పరిపాలన చేస్తూ వుంటే, ఆచందమామను తప్పుడు పనులు చేసే జారులూ, చోరులూ, అతి దూషణ చేయడం ఎటువంటిదో అటువంటిదవుతుంది.

తిరుగుబోతులకూ, దొంగతనాలు చేసే వాళ్ళకూ, వెన్నెల రాత్రుల వెలుగులు అటంకాన్ని కల్గిస్తాయి. అందుచే చందమామను వారు భయంకరంగా తిడతారు. అది మంచిది కాదుకదా. పుణ్యాత్ములను దుర్మార్గులు దూషించడం కూడ అలాగే వుంటుంది.

* * *

**మహనీయుల శక్తి ఎటువంటిదో ఈ పద్యంలో వివరించడం జరిగింది.**

**ఉ. సన్నుతమూర్తులైన గుణశాలురు పెద్దలజేరకున్న స**
**ర్వోన్నతతత్త్వమున్ యశము నుర్విఁబ్రసిద్ధినిఁబొంద రెప్పుడున్**
**కన్నుల కెంతతేజమది గల్గియు నద్దములేక బింబమం**
**దున్నవిలాసమే దెలియ కుండెడి యట్టులె, వేంకటేశ్వరా! 46**

శ్రీ వేంకటేశ్వరా! ఎంత సన్నుత మూర్తులయినా, ఎంత గుణవంతులైనా, ఎంత స్ఫురద్రూపులయినా, వారెంత గొప్పవారయినా సరే పెద్దల వద్దకు వెళ్ళి వారిని గౌరవించి, పూజించి సేవలు చేయకపోతే వారు సర్వోన్నతినీ, కీర్తిప్రతిష్ఠలను పొందలేరు. యశఃకాముకత్వాన్నీ నెఱవేర్చుకోవాలని తపన పడేవారు గురువుల నాశ్రయించాలి. వారిని పూజించాలి.

తానెంత అందంగా వున్నాడో, తన కన్నుల్లో కాంతి ఎంత తేజస్సుతో వెలిగి పోతుందో, తెలుసుకోవాలంటే అద్దం కావాలసిందే కదా. అద్దం వద్దకు వెళ్ళి తన ప్రతిబింబాన్ని ఆ అద్దంలో చూస్తే అపుడతని తేజం స్పష్టంగా తెలుస్తుంది. మహాత్ములయిన వ్యక్తులు అద్దం వలె నీకుపకరించి నీవంటే ఏమిటో తెల్పి, నీ గొప్పతనానికి వారు కారణమవుతారు.

* * *

**అజ్ఞానికి చేసిన దానం ఎటువంటిదో ఈ పద్యంలో వివరించడం జరిగింది.**

**ఉ. జ్ఞానుల కెంతయిచ్చినను సంతసమందుదురాత్మలోన న**
**జ్ఞానుల కెంతయిచ్చిన బ్రకాశితచిత్తులుగా రదెట్లనన్**
**పూనికకొంత నీరిడిన భూరుహముల్ చిగురించు రాలకున్**
**బానలతోడబోయనవిపండ్లనొసంగునె వేంకటేశ్వరా! 47**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో జ్ఞానులయివారికి ఎంత ఇచ్చినా, దానితో వారు సంతోషపడి ఎక్కువగా ఇచ్చినా, తక్కువగా ఇచ్చినా సరే, ఏ విధంగా ఇచ్చినా ఆత్మతృప్తి చెంది చల్లని దీవెనలు దాతలకు ఇస్తారు. అయితే అదేసమయంలో అజ్ఞానులకు ఎంత పెద్దమొత్తంగానైనా సరే ఇచ్చినా, వారు ఆత్మసంతోషాన్ని పొందరు సరికదా, ప్రకాశిత చిత్తులు కూడా కాలేరు. అది అంతే కదా మరి.

మంచినీరు పాదిలో నిపింతే భూరుహమయిన వృక్షము చక్కగా చిగురించి, పూలు, పండ్లు, కాయలు, ఎన్నో ఇస్తుంది. కాని అదే ఒక నల్లని రాతి గుండు మీద ఎన్ని బానలతో నీరు పోసి నింపినా, అదిఏమయినా పండ్లను యివ్వగలదా. ఆనందాన్ని పొందలగదా. అవిధంగానే అజ్ఞాని కెంత యిచ్చినా ఆత్మానందం పొందడు.

* * *

*ఉత్తముని పరోపకార శీలం ఈ పద్యం వివరించింది*

**ఉ. ఉత్తముఁ డెన్నికష్టముల కోర్చియు నన్యుల నాదరించు నా**
**చిత్తమె జూపివారలకు జేయునుమేలు పరోపకారియై**
**యొత్తుగ గాన్గలో నలుగు చుండియు నించుగడంబుకీర్తిసం**
**పత్తిని గూర్చి తీయనగు పాల నొసంగదె వేంకటేశ్వరా! 48**

శ్రీ వేంకటేశ్వరా! ఉత్తమమయిన వాడు తాను ఎన్ని కష్టాల్లో వున్నా, ఆ కష్టాలను తానే భరించి నిరంతరం పరులకు ఉపకారం చేయాలనే చిత్తం కల్గి, జీవనం కొనసాగిస్తుంటాడు. అది అంతే కదా మరి.

చెరకుగడ తాను యంత్రంలో భయంకరంగా నలిగిపోతూ కూడా తన కీర్తి సంపదలాగా తీయని తెల్లని పాలనొసంగి తన చెరకురసంతో పానం చేసే వారికి శక్తిని యిస్తుంది. ఆ విధంగానే ఉత్తముడయిన వాడు తమ కష్టాలు తనే భరిస్తూ.ఆ కష్టాలను మరొకరికి కలుగకుండా తన వంతు శక్తిని చూపిస్తూ అందరికీ మేలుచేయాలనే సంకల్పం కల్గి వుంటాడు. దాని వలన చెరకు గడ మాదిరిగా కీర్తి ప్రతిష్ఠలు అతను పొందుతున్నాడు.

* * *

*సత్పురుషుల మహిమను ఈ పద్యం వివరించింది.*

**ఉ. తక్కువవారు గర్వమున ధర్మగుణజ్ఞుల జ్ఞానపూర్ణులన్**
**స్రుక్కఁగఁజేసి హీనముగ జూచిన తన్మహిమంబుతగ్గునే?**
**కుక్కుటజాతి రత్నములఁ గొన్నిటిఁ గోళ్లను జిమ్మి పేడలో**
**ద్రొక్కిన వానికాంతి కొకదోషము గల్గునె వేంకటేశ్వరా! 49**

శ్రీ వేంకటేశ్వరా! అల్పులు కొందరు మహాగర్వంతో ధర్మజ్ఞులు, జ్ఞానపూర్ణులూ అయిన సుజనులను హింసిస్తూ, తక్కువుగా జూచి బాధిస్తూ

వుంటారు. అందువలన జ్ఞానులు తమ విలువను ఎంతమాత్రమూ కోలుపోరుసరికదా, వారికి తక్కువ దనం కూడా దాని వలన రాదు కదా.

కోళ్ళ గుంపు విలువయిన రత్నాలను తమ గోళ్ళతో చిమ్మిన దుమ్ముతో, కప్పివేసినంత మాత్రాన ఆ రత్నాల కాంతిని ఏమాత్రమూ భంగం జేయలేవుకదా. ఆలాగే జ్ఞానుల విలువ రతనాల కాంతివంటిదే తప్ప వేరుగాదు.

కోళ్ళగుంపులాగా దుర్మార్గులు కానిపనులతో బాధించినా, వారి విలువ ఎంత మాత్రమూ తగ్గదు.

* * *

**జ్ఞానులను దూషిస్తే వచ్చే నష్టం యెటువంటిదో ఈ పద్యం వివరించింది**

**ఉ. జ్ఞానవిశాలశోభితునిగాంచి దురాత్ములు వెఱ్ఱిమొఱ్ఱిగా**
**హీనపుమాటలాడ తమ కేమిఫలంబులభించునో గదా!**
**యేనుగుబోవుచుండ గని నేగుచు కుక్కలు వేనవేలుగా**
**దానిని గాంచి లొళ్లు మన దానికి కష్టమె వేంకటేశ్వరా! 50**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు దురాత్ములు అల్పబుద్ధులై జ్ఞానులను జూచి తమ నోటికి వచ్చినట్లు పాడు మాటలు మాట్లాడుతూ గోల గోల చేస్తుంటారు. వారి గోల వలన ఆ జ్ఞానికి వచ్చిన నష్టమేమీ లేదు.

రాజవీధిలో మదపుటేనుగు ఠీవిగా నడచివెళ్తుంటే సంఖ్యాబలంగా ఎక్కువుగా వున్న కుక్కల గుంపు లొళ్ళు, లొళ్ళుమని మొఱిగితే ఆ గొడవ వలన ఏనుగు ఠీవికి వచ్చే నష్టమేమున్నది.

ఆవిధంగానే గజశ్రేష్టుడయిన వ్యక్తిని గూర్చి కుక్కల్లాంటి వ్యక్తులు ఎంత గోల గోల చేసినా ఆ జ్ఞానికి నష్టమేమాత్రమూ కల్గదు. కుక్కలు కుక్కలే, ఏనుగు ఏనుగే.

* * *

**పెద్దలు చేసే ఉపకారం ఎలా వుంటుందో ఈ పద్యంలో వివరించడం జరిగింది.**

**ఉ. అల్లరివారి శాంతమతి నాపుచు పెద్దలు నీతివాక్యముల్**
**జల్లగనాడి వారలను సాధులుగా నొనరింతు రెప్పుడున్**
**పల్లమునందుబండి దిగఁబారఁగ పగ్గము లొత్తి వెన్కకున్**
**మెల్లగ నెడ్లదించి మరిమెట్టకు జేర్పరె వేంకటేశ్వరా! 51**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో శాంతమతులైన కొందరు పెద్దలు అల్లరి చిల్లరిగా తిరుగుతూ, పాడు పనులు చేసే ఆకతాయి గాళ్ళను కూడా మంచి మాటలు చెప్పి, నీతిమంతులుగా మార్చి మేలు చేస్తుంటారు.

ఎడ్లబండి పల్లానికి పరగుదీస్తుంటే నిపుణతకల సారథి ఎద్దుల పగ్గాలను గట్టిగా పట్టి లాగి ఎద్దు గుంటలో పడి పోకుండా కాపాడి, బండిని మెట్టమీదకు మెల్లగా చేరుస్తాడు. బండి పడిపోకుండా కాపాడుతాడు. ఆ విధంగానే శోధకులయిన, జ్ఞానులయిన పెద్దలు కొందరు ఎంతో నేర్పుతో ఆకతాయి అల్లరిగాళ్ళను మంచి మాటలు చెప్పి వారి మనసు మార్చి మంచి మార్గంలో వారిని నడిపించి వారికి యెంతో మేలుచేస్తారు.

* * *

**దొంగ సొమ్ముదానం చేయడం ఎటువంటిదో ఈపద్యం వివరించి చెప్పింది**

**ఉ. దేవునిసొమ్ము నేమరచి దెచ్చిముదంబున గూడబెట్టి ల**
**క్ష్మీ విభవాభిరాములను మించినదానము లిచ్చుటెట్లనన్**

**భూవలయంబునందు జనపూజనమంది యశంబు బొందు నా**
**గోవులజంపి చెప్పు లొక కొందరి కిచ్చుటె వేంకటేశ్వరా!** **52**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు దుష్టులు దేవుని సొమ్మును అపహరించి తెచ్చి, ఆ ధనాన్ని కూడబెట్టి పెంచి మహాశ్రీమంతులై ఆ ధనాన్ని ఏమిచేయాలో తెలియక చివరకు మహాదాతల్లా వారు కూడ మారి దానధర్మాలు చేయడానికి అక్రమంగా వచ్చిన ఆ ధనాన్ని దానంచేస్తుంటారు. దాని వలన వారు పొందే పుణ్యం మాత్రం ఏముండదు.

అది యెటువంటిదంటే– మాహాపూజనీయమగు గోవులను భయంకరంగా జంపి, మహాపాపం చేసి ఆ గోవుల చర్మంతో చేసిన కొన్ని చెప్పులను దానం చేస్తే వాడు ఏ ఫలితం పొందగలడో వీడు కూడా అంతే ఫలం పొందగలడు. పాపపు ధనం దానం చేయడం వలన పాపం పెరుగుతుందే తప్ప పాపం మాత్రం పోదు.

* * *

**శూరున్ని ఎదుర్కోవడం ఎలా వుంటుందో ఈపద్యం వివరించింది.**

**ఉ. ఎంతబలాఢ్యులైన నెదురేగిన శూరునిగెల్వజాల కా**
**వంతయు కీర్తినందక మహాదురవస్థను గాంతు రెట్లనన్**
**వింతగు పర్వతంబులవి వేలుగనుండిన వజ్రరాజమా**
**వంతగ వానితెక్కలను వ్రయ్యలుజేయదె వేంకటేశ్వరా!** **53**

శ్రీ వేంకటేశ్వరా! ఎంత బలాఢ్యులయినా, తమ వద్ద ఎంత శక్తి వున్నా శూరుడయిన వానిని ఎదుర్కొని గెలుచుట, విజేతలగుట, చాలా కష్టముకదా! ఆపనికి పూనుకొన్నవారు చెప్పరాని దురవస్థలను పొందుతారుకదా!

ఎట్లనగా– కొండల సమూహం ఎంత గొప్పదనం కలిగి వున్నా, బలమయిన వజ్రాయుధానికి ఎదురుగా వెళ్ళి గర్వప్రదర్శన చేస్తే, తమ

రెక్కలను కోల్పోయి తునిగిన రెక్కలను జూచి బాధపడుతూ ఎంతో దురవస్థను పొందుతాయి.

ఆ విధంగానే శూరుని ఎదుర్కొనుట చాలా కష్టమయిన పని అని తెలియాలి.

* * *

**బొమ్మను సృజించి శక్తియని పేరుపెడితే ఎలా వుంటుందో**
**ఈ పద్యం వివరించి చెప్పింది**

**ఉ. శత్రువినాశనంబునకు శక్తిని సృష్టియొనర్చినంత నీ**
**ధాత్రిని మంటిబొమ్మలవి దైత్యసమూహము గూల్పనేర్చునే**
**మైత్రి యొకింతలేక యజమానుని దూరెడు దానిపేరు సా**
**విత్రి యటన్నభర్త నటవిం బ్రతికించునె వేంకటేశ్వరా! 54**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు వికృతస్వభావులు, అల్పబుద్ధులై, శత్రువినాశనానికి ఇదిగో మేము గొప్పగా శ్రమించి ఒక ఆదిశక్తి బొమ్మను తయారుచేశాం. ఆ బొమ్మ వెళ్ళి శత్రువుల నందరినీ సంహరించి వేస్తుంది అని చెప్పినంతమాత్రాన ఆ శక్తి బొమ్మ వెళుతుందా. యుద్ధం చేసి శత్రుసంహారం చేస్తుందా. అది ఎలా వుంటుందంటే, భర్త మీద ఎటువంటి ప్రేమ కాని, స్నేహహం కాని లేక భర్తను ఎపుడూ తిట్టిపోసే స్త్రీకి సావిత్రి యని పేరు పెట్టినంత మాత్రాన అడవిలో కష్టం కల్గి చనిపోయిన పతి ప్రాణాలను అలనాటి పతివ్రత సావిత్రి యముణ్ణిపూజించి గెలిచి పతి ప్రాణాలు సంపాదించినట్లు ఈ పేరుమాత్రంగల సావిత్రి భర్త ప్రాణాలను రక్షించగలదా. లేదు ఆవిధంగానే బొమ్మ శక్తి వలన దైత్య సంహారం జరుగదు. యే ప్రయోజనమూ బొమ్మ శక్తి సృజన వలన కలుగదు.

* * *

**రాజశాసనం ప్రజారంజకం కావాలంటే ఎలా వుండాలో ఈ పద్యం వివరించింది.**

**ఉ. క్రమమగు ధర్మకర్మములు గానని నీచుడు పూర్వరాజ వం**
**శమున జనించియున్న తమశాసన పద్ధతి నిల్పజూచునే**
**రమణుని జూచినంత పెనురాక్షసుఁ డంచు వచించుదానికే**
**సుమతి యటంచుబేరిడిన సూర్యునినాపునె వేంకటేశ్వరా! 55**

శ్రీ వేంకటేశ్వరా! ధర్మ కర్మముల క్రమము తెలియని పరిపాలకుడు పేరుగల రాజవంశంలో పుట్టి ప్రసిద్ధు డయినప్పటికీ అతని పరిపాలన అధర్మంగా, అనుచిత క్రమంగా ఉన్నట్లయితే ప్రజలలో అతని శాసనం కలకాలముండదు. ప్రజలు తిరుగుబాటుచేసి ఆ శాసనాన్ని కూలదోస్తారు.

అక్రమంగా అతను చేసిన శాసనాలు ఎలా అస్థిర మవుతాయంటే, భర్తను నోటికి వచ్చినట్లు తిడుతూ పెద్దరాక్షసుడని మాటిమాటికి నిందిస్తూ, పతి భక్తికొంచెం కూడా లేని స్త్రీకి, 'సుమతి' అని పేరు పెట్టినంత మాత్రాన అలనాటి సుమతి భర్త ప్రాణరక్షణకై సూర్యోదాయన్నే ఆపినట్లు పతి ప్రేమ ఏ మాత్రము లేని ఈ సావిత్రి సూర్యుణ్ణి ఆపగలదా! అలాగే ప్రజారంజకమయిన శాసనాలు చేయని రాజశాసనం కూడా అస్థిరమవుతుంది.

* * *

**రాజులు ఎలా వుండాలో ఈపద్యంలో చెప్పడం జరిగింది.**

**ఉ. భూతల మేలురాజు పెనుభూతమువోలె విశంకవృత్తిమై**
**ఘాతుకచర్యలందు పరికల్పితరాజ్యము నెట్లు నిల్పెదున్?**
**మాత జనించుబిడ్డలను మాయముజేయుచు మ్రింగుచున్న నే**
**రీతిని వృద్ధిగాంచును ధరిత్రిని వంశము వేంకటేశ్వరా! 56**

శ్రీ వేంకటేశ్వరా! భూతలాన్ని పరిపాలించే రాజు పెద్ద దయ్యంలాగా మారి అధర్మంగా స్వేచ్ఛాప్రవర్తుడై పోషించవలసిన ప్రజలను రక్షించకుండా తనే పీడించి భక్షించినట్లయితే అతని రాజ్యము నాలుగు కాలాలు నిల్వ గలదా! నిల్వలేదు.

కన్నతల్లే దయ్యంలాగా మారి పుట్టిన బిడ్డలందర్నీ తనే చంపి వేస్తుంటే ఇక వంశవృద్ధి అనేది ఎలా జరుగగలదు.

ఆ విధంగానే కన్నతండ్రిలా పోషించి రక్షింపవలసిన రాజే తన ప్రజలను చంపివేస్తే ఇక ఆరాజ్యం బ్రతికిబట్ట ఎలా కడుతుంది. ఆ రాజ్యం అంతరిస్తుంది. కావున రాజనేవాడు ప్రజలను రక్షించాలేతప్ప అధర్మ శాసనాలతో భక్షించకూడదు.

* * *

*మంచివాడు చేసే చిన్నతప్పులు ఎలా వుంటాయో ఈ పద్యంలో చెప్పబడింది*

**ఉ. దోస మొకింతయుండి యొకదొడ్డగుణంబును గల్గియున్నచో**
**నా సరసాత్ము పూజ్యుఁడని అందరు మన్ననచేతురెట్లనన్**
**వాసనఁగల్గియున్నఁగనువారలు కంటకయుక్తమైనఁ బే**
**రాసను కేతకీకుసుమ మందరు దాల్పరె వేంకటేశ్వరా! 57**

శ్రీ వేంకటేశ్వరా! సరసుడయినవాడు కొన్ని దోషాలు కల్గియున్నప్పటికీ అతను చాలా గొప్ప గుణాలు ఉపకార బుద్ధి కల్గి వున్నట్లయితే అతన్ని జనాలు బాగా పూజిస్తారే తప్ప చిన్న తప్పులున్నాయని అతణ్ణి నిరసించరు.

మొగలిపూవు, చూడటానికి ముళ్ళతో కూడి మొరటుగా వున్నా, దాని గొప్పదయిన పరిమళగుణం దొడ్డ వారినందరినీ మైమఱపించు నట్లుచేయడమే కాదు! అందరిచేత ధరింపబడి ఆ మొగలి పూవు

పూజలందుకుంటున్నది కదా. అలాగే మంచివాడు చిన్నతప్పులు చేసినా, అతడు మొగలి పువ్వులా గౌరవాన్నే పొందువాడు తప్ప నిరసనకు గురికతాడు.

* * *

**కాలం కలసివస్తే ఎంత బాగా వుంటుందో ఈ పద్యం వివరించింది**

**ఉ. ఖ్యాతివహింపఁగల్గ గలకాలము వచ్చిన దుర్బలాఢ్యులే**
**చేతలఁబూని గొప్పపనిచేసి యశంబును గాంచకుందురే?**
**కోతులు గుంపుగూడి పెనుగొండల నబ్ధినిఁ దెచ్చివైచి యా**
**సేతువుగట్టి రామునకు జేయవె మేలిమి వేంకటేశ్వరా! 58**

శ్రీ వేంకటేశ్వరా! కాలం ఈశ్వర స్వరూపం. ఆ కాలం కలసివస్తే, కీర్తి ప్రతిష్ఠలు ప్రాప్తమయ్యే సమయం వస్తే దుర్బలులు కూడా మహాబలవంతులై గొప్ప గొప్ప కార్యాలు సాధించి యశస్సును సంపాదిస్తారు.

మరి వానర సమూహానికి మంచి రోజులు వచ్చాయి కాబట్టే రామాయణంలో శ్రీరామచంద్రునికి సేతు నిర్మాణంలో సాయపడి పెనుగొండలను కూడ అవలీలగా మోసుకొనివచ్చి సముద్రానికి ఆనకట్ట కట్టి భగవంతుడైన రామునితో చెలిమిని సంపాదించి గొప్ప పేరు ప్రఖ్యాతులు ఆ కోతులు పొందాయి. అలాగే దుర్బలులు కూడా కాలం కలసివస్తే మంచి కీర్తిప్రతిష్ఠలు సంపాదించగలరు.

* * *

**ఈపద్యం మూర్ఖుని స్థితి ఎటువంటిదో వివరించింది.**

**ఉ. కొంటెతనంబు మానుమని కూళుని కెంతయు బోధ నాత్మలో**
**నంటఁగజెప్పిన న్విదువ దాతని దుర్గుణవృత్తి యెట్లనన్**
**పెంటకుఁబోవనీక తినఁబెట్టుచు పందిని బెంచినంతనే**
**తొంటిగుణంబు మానగలదో మరి వెంటనె వేంకటేశ్వరా! 59**

శ్రీ వేంకటేశ్వరా! కూళుడయిన మార్క శిఖామణికి కొంటెతనం మాని మంచిగా బ్రతకమని యెంత బోధ చేసినా, వాని మనసు మెచ్చుకొనునట్లుగా తెలియ చెప్పినా అతడు తన స్వభావసిద్ధమయిన అజ్ఞానాన్ని విడిచిపెట్టలేడు. మంచిగా మారలేడు.

పందిని అసహ్య పదార్థాలు తినకుండా కట్టడి జేసి జాగ్రత్తగా పెంచినా, అది తన తొంటిగుణమయిన మురికిలో పొరలాడి అసహ్యాన్ని తినే పూర్వగుణం మానలేదు కదా!

అలాగే దుష్టుడు కూడ మంచిని ఎంత బోధించినా తెలియలేడు. మారలేడు. తన దుష్టత్వాన్ని విడిచిపెట్టడు. వాడు అసహ్యాన్ని తినడానికి అలవాటు పడిన వరాహము వంటివాడే.

* * *

**గొప్పవారు చేసే పాడు పనులు ఎలా వుంటాయో**
**ఈ పద్యంలో చెప్పడం జరిగింది.**

**ఉ. ఊడిగ మాచరింప తనకున్న బలంబు నొసంగువానికిన్**
**కూడును కోకనిచ్చుటకుఁ గుందుదు రల్పులు సర్వకాలమం**
**దోడక యెన్ని మూట లనువొందగమోసియు గడ్డియన్నచో**
**గాడిదకేటి మేతయని గర్జనజేయరె వేంకటేశ్వరా! 60**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొంతమంది దురాత్ములు, వారికి పరిచర్యలు చేసే సేవకులను మంచిగా చూడరు. చూడకపోగా వారి శక్తి అణగారిపోయేంత వరకూ అన్ని ఊడిగాలు బాగా చేయించుకొని, చివరకు వారికి అన్నవస్త్రాలిచ్చి పోషించాడనికి వెనకడుగు వేస్తారు. వారి శ్రమ శక్తని దోపిడీ దొంగలుగా మారి హరించి బయటకు నెట్టివేస్తారు.

గాడిద చేత యెన్నో మూటలు మోయించి ఆ గాడిదతో పనులెన్నో పూర్తిచేసుకున్న వారు ఆ గాడిదకు గడ్డివేయడానికి లోభించి 'గాడిదకు గడ్డేమిటని" వితండవాదం చేస్తారు. తిండి కూడా పెట్టకుండా గాడిద చేత బరువులు మోయిస్తారు.

అలాగే కొందరు దుర్మార్గులు. కొందరిచేత గాడిద చాకిరి చేయించుకొని కనీసం అన్నవస్త్రాలయినా యివ్వకుండా వారి శ్రమను దోపిడీ చేస్తారు. అది మంచి పద్ధతి కాదు.

* * *

**ధనసంపాదనకు పెట్టుబడి ఎలా వుండాలో ఈపద్యం వివరించింది**

**ఉ. ఉన్నధనంబుకొల్లలిడి యోపికతోడ నుపార్జనంబు జే**
**యన్నరు దాత్మలో దలచుటయ్యది నిష్ఫల మెట్టు లన్నచో**
**మిన్నుననున్న మబ్బుఁగని మిట్టకుఁబారెడు చెర్వునీళ్లతో**
**నిన్నఁటినేటికాలువకు నింటగద్రెంపుటె వేంకటేశ్వరా! 61**

శ్రీ వేంకటేశ్వరా! సమాజంలో కొందరు తన వద్ద వున్న ధనాన్ని మొత్తాన్ని కొల్లలు కొల్లలుగా పెట్టుబడులు పెట్టి బాగా సంపాదించాలని ఉన్న ధనం మొత్తం ఖర్చు చేస్తారు.

ఏదో సంపాదించి పెద్దమొత్తం లాభంగా పొందుదామని ఆశించిన వారంతా పెట్టిన పెట్టుబడి కూడా నష్టపోయి, అసలు ఏమీలేని నిరుపేదలుగా మారి వ్యధ పొందుతారు. అది అంతేకదా మరి.

మబ్బులు బాగా పట్టాయని చూసి నల్ల మబ్బులను నమ్ముకొని మిట్టకు కూడా ప్రవహించే నీరు సమృద్ధిగా గల చెర్వుకు,కట్టతెంచితే ఆ చెరువులోని నీరంతా కాసేటికే పారిపోయి చెరువు జలశూన్య మవుతుంది. మబ్బులు

కురవకుండా తెల్లగా మారి పారిపోతాయి. మబ్బును నమ్ముకొని ముంతలో నీరు పారబోసుకున్న వాని మాదిరిగా– దురాశకు పోయి ఉన్న డబ్బు మొత్తం పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేస్తే నష్టాలు వస్తే సర్వమూ హరించి పోయి దుఃఖాన్ని పొందుతారు. కాబట్టి మితమయిన పెట్టుబడితోనే ధనం సంపాదించాలి.

* * *

**జ్ఞానుల మహిమ ఎటువటిదో ఈపద్యం వివరించింది**

**ఉ. నీతివిహీను లెన్నటికి నిర్మలతత్త్వ విచారయోగ సం**
**జాతుల జ్ఞానహీనులని చాటిన తన్మహిమంబు తగ్గునే**
**కోతులు వేనవేలుకొనకొమ్మలఁజేరి యహంకరించినన్**
**జాతురి మీరుసింగముల శౌర్యము దగ్గునె వేంకటేశ్వరా! 62**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు నీతిలేనివారై, తమ ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ, విజ్ఞానధనులైన, నిర్మల తత్త్వ విచారపరులయిన యోగులను జూచి వారిని జ్ఞాన హీనులని ప్రచారము చేసినంత మాత్రాన ఆజ్ఞానుల గొప్పదనానికీ వారి మహిమకూ ఏలోటూ వుండదు కదా!

కోతులు వేలకు వేలు గొప్పసంఖ్యలో గుంపుగా నుండిచెట్టు కొమ్మలపైకి ప్రాకి క్రింద నున్న సింహాన్ని గూర్చి ఎంతగానో అహంకరించి కిచ కిచ శబ్దాలతో అల్లరి చేసినప్పటికీ, మృగరాజుకూ ఆ మృగరాజు శౌర్యానికీ కొంతయినా నష్టం వస్తుందా, ఆ కోతుల వలన ఇబ్బంది కలుగుతుందా! కాబట్టి జ్ఞానులను గని జ్ఞాన హీనులు ఎంతగా తప్పుడు ప్రచారం చేసినా అది కోతుల గోల సింహాన్ని దాని శౌర్యాన్నీ ఏమీ చేయలేనట్లుగా మహాత్ములకు ఏ నష్టాన్ని వారు కలిగించలేని వారవుతారు.

* * *

**పరకాంతాసక్తి ఎటువంటిదో ఈ పద్యం వివరించింది.**

**ఉ. ధారుణిపుణ్యమానవుల దారలగోరిన వారివంశమున్**
**బేరు నశించునంచు ముని పెద్దలు దెల్పుట కల్ల లెట్లగున్**
**శూరుఁడు రావణాసురుఁడు సుందరి రామునిభార్యగోరి వి**
**స్తారసుతాప్తమంత్రులను తప్పకనోడడె వేంకటేశ్వరా! 63**

శ్రీ వేంకటేశ్వరా! భువిలో కొందరు దుర్మార్గులై పుణ్యమానవుల కాంతలపై వ్యామోహం కల్గి పరకాంతాసక్తి అనే వ్యసనంతో తన సర్వస్వాన్నీ, చివరకు తన వంశాన్నంతటినీ కోలుపోతున్నారు. సర్వభ్రష్టులై చరిత్ర హీనులుగా మిగిలి పోతున్నారు.

రామాయణంలో రావణాసురుడు కూడ పరకాంతాసక్తి అనే దుర్గుణం వల్ల బంగారు మయమయిన తన లంకానగరాన్నేకాక తన జాతి సర్వస్వాన్నీ, తన వంశ సమున్నతినంతటినీ కోలుపోయి శ్రీరామచంద్రుని చేతిలో యుద్ధంలో మరణించాడు. తన ఆప్తులయిన మంత్రులందరినీ కూడ కోలుపోయి దుఃఖాన్ని పొందాడు. కావున పరదారాసక్తి ఎవరికయినా కూడనిదని తెలియాలి.

* * *

**కొందరి విచిత్ర మానసిక స్థితి ఎటువంటిదో ఈ పద్యం వివరించింది.**

**ఉ. ఈడును జోడులేని సుకవీశ్వరపాళినిగూడి మాడిపో**
**నాడుచు నెల్లవారలను నల్పముగా గన పేరు గాంతురే?**
**గాడిదయోంద్రపెట్టునటు గానముసల్పెడువారు నేర్పుతో**
**బాడిన యట్టిపాటలవి భావ్యము లెట్లగు వేంకటేశ్వరా! 64**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు వింత వింత కోరికలు కలవారై విచిత్ర మనఃస్థితి కలిగి వుంటారు. వారిలో కవులు కానివారు కవులుగా

పేరుపొందాలని ఎత్తులు వేసి గమ్మత్తుగా పేరు ప్రఖ్యాతులున్న కవులతో చెలిమిజేసి, వారి సాంగత్యం వలన పేరుపొంది, ఆపై గర్వంతో మిగిలిన కవులను గూర్చి అల్పంగా అవాకులు, చవాకులు పేలితే వారికేమయినా పెద్దపేరు వస్తుందా రాదు.

గాడిద ఓంద్రపెట్టినట్లుగా పెద్దగా గాడిద గొంతుతో గాన కచేరి చేస్తే ఆ గాన మాధుర్యం సభను రంజింప జేస్తుందా! సభ మెప్పును గాడిద గాత్రంతో పాడిన గాయకుడు పొందగలడా! ఆ విధంగానే మంచిగాత్ర సౌందర్యంతో పాడిన వాడే అందరి మెప్పును పొందలడు తప్ప గాడిద గొంతుతో పాడి అందరినీ బాధించిన వాడుదూషణ పాత్రుడవుతాడు.

అలాగే ఉత్తమ కవులతో కలిసి పేరుపొంది అహంకరించి అందరినీ అల్పంగా మాట్లాడిన కవి కూడా దూషణకు అర్హుడవుతాడు.

* * *

*శ్రీకైవల్య సుఖం ఎవరికయినా ఎంత ముఖ్యమో ఈపద్యంలో వివరించడం జరిగింది.*

**ఉ. చక్కగ వేదయుక్తమగు శాస్త్ర మెఱింగియు తత్త్వమార్గమున్**
**ద్రొక్కక జన్మకంతమగు త్రోవ కనుంగొన గల్గరీయిలన్**
**మిక్కిలిరూపవైభవము మించియు నక్షులులేనివారు దా**
**మెక్కడికైన నొంటరిగ నేగి సుఖింతురె వేంకటేశ్వరా! 65**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు జ్ఞానసారమయిన వేదశాస్త్రాలు ఎన్నో చదివి విజ్ఞానాన్ని పొంది కూడ తత్త్వాన్వేషకులు కాకుండా, జన్మరాహిత్యానికై ప్రయత్నం చేయకుండా, ఆ మార్గాన్వేషణలో విఫలురై నష్టజీవనం కలవారవుతున్నారు. శ్రీకైవల్యసుఖం ఎరుగని వారవుతున్నారు.

కన్నులు లేనివాడు ఎంత అందగాడయినా తాను ఒక్కడే ఒంటరిగా ఎక్కడికయినా వెళ్ళి సుఖించగలడా లేడు. ఆ మాదిరిగానే, శాస్త్ర విజ్ఞానం కల్గకుండా, జన్మరాహిత్యానికై ప్రయత్నం చేయని శాస్త్ర పండితుడు, కళ్ళులేని రూపసివలె ఒంటరిగా పయనించి ఏ సుఖాన్ని పొందలేని వాడవుతాడు.

రూపంతోపాటుగా కళ్ళు కూడా వుంటే అంధుడు అదృష్టవంతుడై గొప్పసుఖాన్ని పొందినట్లు శాస్త్ర జ్ఞానం కలపండితుడు శ్రీకైవల్యంచేరడానికై తన జ్ఞానంతో ప్రయత్నం చేస్తే త్రికాల సత్యమయిన కైవల్య సుఖాన్ని పొందగలడు.

* * *

**పురాణాలను బోధించాలంటే పండితులెంత అవసరమో ఈ పద్యం వివరించి చెప్పింది**

**ఉ. సారపురాణశబ్దముల సభ్యులు మెచ్చగ పండితుండు వి**
**స్తారముగా వచింపగను జాలు నపండితుఁడెట్లు సెప్పెడున్?**
**నీరము పాలునేర్పరచు నేర్పు మరాళ మెఱుంగు గాని యా**
**తీరుననుండు బాతు కటు తెల్వి జనించునె? వేంకటేశ్వరా! 66**

శ్రీ వేంకటేశ్వరా! విజ్ఞాన సమగ్రాలయిన పురాణాలలోని శబ్దార్థములను పండితుడయిన వాడుచక్కగా వివరించి బోధించగలడు గాని, అ పండితుడు దాని సారాన్ని తెలియగలడా! మరొకరికి తెలియునట్లుగా బోధింపగలడా. లేడు. పండితుడు మాత్రమే ఆ నైపుణ్యం కలిగి వుంటాడు. ఆ విషయంలో అ పండితుడు అనర్హుడవుతాడు.

పాలు నీరు వేరు చేయగల శక్తి మహాప్రఖ్యాతి గల హంసకు సాధ్యమవుతుంది కాని ఆ మాదిరిగానే వున్న బాతుకు ఆ తెలివికాని, ఆ నేర్పు గాని ఎక్కడిది. కావున పురాణ శబ్దార్థ సౌందర్యం పండితుడే

వివరించగలడు. ఆ విషయంలో అ పండితుడు బాతు తెల్వి వంటివాడవుతాడు.

* * *

**సుగుణ మహిమను గూర్చి ఈ పద్యం వివరించింది**

**చ. కులమభివృద్ధిజేయు గుణకోవిదునందరు మెత్తు రెప్పుడున్**
**తలపగ వానివల్ల కడు ధన్యత గాంచును వంశమంతయున్**
**బలమగు బండికుండ కడు భద్రముగాను జెలంగ నాకులన్**
**చలనము నందునే విరుగజారునె యెప్పుడు వేంకటేశ్వరా! 67**

శ్రీ వేంకటేశ్వరా! తనవారినీ, తన కులాన్నీ నిరంతరం అభివృద్ధి పథంలో నడిపించే గుణ కోవిదుని ప్రజలంతా మెచ్చుకొంటారు. వారి వలన ఆయా వంశాలు కూడా పేరు ప్రఖ్యాతులు కల్గి ఉద్ధరింప బడతాయి. ధన్యతను పొందుతాయి.

అది నిజమేకదా! బండికి 'కుండ' మంచి బలంగా భద్రంగా చక్రం మధ్యలో వుంటే అందులో బిగించిన చక్రాల ఆకులు కూడా చలనము లేక గట్టిగా వుండి ఆ బండి వేగంగా పయనించడానికి తోడ్పడతాయి. అది గట్టిగా లేకపోతే ఆకులు అటు ఇటు కదలి విరిగిపోయి, గమనానికి సహకరించకుండా వుంటాయి. ఆ విధంగానే బండికి కుండలాగా కులంలోన ఒకడు గుణవంతుడుంటే కులము వెలయువాని గుణంచేత. కాబట్టి సుగుణం మేలు చేస్తుంది.

* * *

**శూరుని ధర్మపద్ధతి యెటువంటిదో ఈ పద్యంలో వర్ణించడం జరిగింది**

**ఉ. శూరుడు హీనమానవులసొమ్ముగణింపక న్యాయమార్గమా**
**ధారముగాక గష్టపడి తద్దయు వేడ్కను జెందునెప్పుడున్**

**పారెడుచిన్న జంతువుల ప్రాణముదీయక సింహరాజు యా**
**వారణమున్ వధించి గుణవర్ధనమందదె వేంకటేశ్వరా!** **68**

శ్రీ వేంకటేశ్వరా! పరాక్రమవంతుడయిన శూరుడు, హీనమానవుల సొమ్ముపై ఆశపడకుండా, తన స్వయం శక్తితో న్యాయమార్గంలో కష్టపడి సంపాదించిన ధనంతో వేడుకలన్నీ వైభవంగా చేస్తూ ఆనందాన్ని పొందుతాడు. హీనులయిన ఇతరుల సొమ్మును అతడు ఎంత మాత్రమూ కోరడు. అది నిజమేకదా. సింహము దాని స్వభావ సుందరంగా మద వారణ కుంభస్థలము పగులకొట్టి ఆ కవోష్ణ రక్తమును సాదరంగా స్వీకరిస్తుంది. కాని ఆరణ్యంలోని ఇతర మృగాల జోలికి అదిపోదుకదా! వాని రక్తాన్ని స్వీకరించదు కదా!

అలాగే సింహపరాక్రమ శోభితుడైన శూరుడు కూడా అల్పుల ధనాన్ని ఆశించడు. తను సంపాదించిన ధనంతోనే ఆనందాన్ని పొందుతాడు.

* * *

**వాస్తుకళతో కూడిన గృహవాము యొక్క ఆవశ్యకతను ఈ పద్యం వివరించింది**

**ఉ. ఆయములేనియిల్లు భువనాఢ్యునికేని శుభంబుగల్గగా**
**జేయఁగజాలునే? విమలచింతనజేసిననైన నెన్నడున్**
**వాయువులేనిగేహమున వర్తిలుదీపము కొంత తైలమే**
**వేయక దివ్యకాంతులను వెల్గునె యెన్నడు వేంకటేశ్వరా!** **69**

శ్రీ వేంకటేశ్వరా! ఇలలో ఎంతగా ప్రసిద్ధి పొందిన మాననీయుడయినా అతని జన్మ నక్షత్రాది గ్రహ యోగముల ననుసరించి తగిన ఆయములతో నిర్మించిన వాస్తుకళతో శోభించే యిల్లు లేక పోతే అతడున్నతిని సాధించలేడు. గొప్పగా ప్రఖ్యాతి పొందలేడు.

దీపము వాయువు తగలనిచేట గృహంలో లోపలిభాగంలో వున్నప్పటికీ దానిలో తైలము కొంత లేకపోతే ఆ దీపం కాంతులను వెదజల్లలేదుకదా!

దీపం ప్రకాశంగా వెలగాలంటే నిర్వాతమయిన గృహంలోపలి భాగమే కాకుండా, అందులో నూనె కూడా ముఖ్యంగా అవసరమే. అందుచే వ్యక్తి ప్రఖ్యాతిని పొందాలంటే తగిన ఆయములతో నిర్మించిన వాస్తుకళతో శోభించే గృహం కూడా తప్పనిసరని తెలియాలి.

* * *

**'సంసార బంధవిముక్తి' జీవికి ఎంత అవసరమో ఈ పద్యం చెప్పింది**

**ఉ. సార మెఱింగినట్టి సువిచారుఁడు దేలగవచ్చు ఘోర సం**
**సారములోన నయ్యది విషాదమునందిన కష్టమేగదా**
**నీరముపైన నావ లవి నిల్చి చరించును గాని భద్రమై**
**ఆరయ రంధ్రమేర్పడిన నద్ది మునుంగదె వేంకటేశ్వరా! 70**

శ్రీ వేంకటేశ్వరా! సువిచారుడు, జీవన సారమెఱిగినట్టి సుజ్ఞాని, ఘోరమయిన సంసార సముద్రంలో మునిగి తన ప్రజ్ఞాపాటవాలతో ఒకప్పుడు పైకి తేలిన తేలవచ్చుగాని, అది విషాదమునందిన కష్టమే కాని అన్యము కాదు.

లోతైన నీటిలో నావ నిలిచి చరించవచ్చును గాని ఆ నావకు రంధ్రం పడితే నిల్చి వున్న ఆనావే మునిగి పోవునుగదా! అలాగే జ్ఞాని సంసార సంద్రంలో మునిగినా ఏదో ఒక సమయంలో అవిద్యా చీకట్లు ఆవరిస్తే ఆ సంద్రంలో పైన చెప్పిన నావరీతిగా మునిగి పోయి విషాదాన్ని పొందును. కాబట్టి అడసుతొక్కనేల-కాలు కడగనేల? సంసార బంధం నుండి జ్ఞాని బయటపడాలి.

* * *

**లోకధర్మం ఎలా వుంటుందో ఈ పద్యం వర్ణించబడింది**

**ఉ. నీతిపరుండు కష్టములు నెగ్గక స్రుక్కుచునున్న హీన దు**
**ర్జాతి అశేషసౌఖ్యముల సంతసమందుచునుండు నెట్లనన్**
**కూతల నింపుసొంపుగను గూసెడు కీరము పంజరంబులో**
**వేతనలంద కాకులు ప్రవీణత నేగవె వేంకటేశ్వరా! 71**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో నీతిమంతులయిన కొందరు కష్టాల కడలిలో మునిగి తేలి నానా అవస్థలు పడుతుంటే అవినీతిపరులయిన కొందరు మాత్రము అశేష సౌఖ్యాలతో తేలియాడుతుంటారు. మరి ధర్మం ఎక్కడుంది అనే ప్రశ్న అందరికీ కల్గుతుంది. అది నిజమే.

లోకంలో కూడ ఇంపు సొంపుగా చక్కగా పలికే చిలుక పంజరాలలో చిక్కి వ్యధల పాలవుతుంటే, భయంకరంగా అరచే కాకులు మాత్రం స్వేచ్ఛాప్రవృత్తి కల్గి ప్రవీణతతో విహరిస్తుంటాయి.

లోకంలో కొన్నిచోట్ల ఈ ధర్మం తప్పదు. అలాగే వుంటుంది.

* * *

**క్రూరకర్మ చేయడం ఎంత హానికరమో ఈపద్యం వివరించింది.**

**ఉ. మిక్కిలి కీర్తిగాంచెడు నమేయ గుణాఢ్యునిపేరు తుంగలో**
**ద్రొక్కెడు క్రూరుఁడున్ సుజన దూరుఁడు నుద్భవ మందుటెట్లనన్**
**అక్కరతోడ దేవునకు నర్పణజేయగ నుంచినట్టి యా**
**చిక్కని పాయసంబు చెడ చేదును గల్పుటె వేంకటేశ్వరా! 72**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన గుణాఢ్యుని పేరు తుంగలో త్రొక్కినట్లుగా అధోస్థితికి త్రొక్కి అతనికి హాని కల్గించాలని చూసేవాడు సుజన దూరుడవుతాడు. క్రూర కర్మ చేసిన వాడవుతాడు.

అతని వునికి యెటువంటిదంటే దేవునకు అర్పణ చేసే పాయసంలో ఆపాయసం మాధుర్యం చెడిపోవునట్లు చేదు కల్పినవాడు ఎటువంటి అకృత్యం చేసినవాడో క్రూరుడో- అలాగే మంచి వాడికి వచ్చిన పేరును తుంగలో త్రొక్కడానికి ప్రయత్నించువాడు కూడ అటువంటి దుర్మార్గుడే.

* * *

**మంచివారి గొప్పదనాన్ని యీ పద్యం వివరించింది.**

**ఉ. మాన్యున కెగ్గుసేయుటకు మార్కొను దుర్మతికై నసత్కృపం**
**ధన్యతనొందు వాక్యములె తప్పకచెప్పుదు రార్యు లెట్లనన్**
**అన్యులు వంటకట్టియలకై మొదలంటఁగ గొట్టుచున్న స**
**త్పుణ్యమటంచు మేలొసగు భూరుహ మెప్పుడు వేంకటేశ్వరా!73**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో ఆర్యులయిన పూజ్యులు కొందరు తమను ఎదుర్కొని ఎగ్గులు జేయుదుర్మాతులకు కూడ దయాగుణం పరిపూర్ణంగా కల ఆ సజ్జనులు మంచి మాటలు వారికి చెప్పి దుర్మార్గులను సన్మార్గులను జేయుటకు మిక్కిలిగా ప్రయత్నిస్తారు.

చెట్లు తమను వంటకట్టెయలకై పరాయివారు అనేక పర్యాయాలు గొడ్డలితో నఱికి మొదలంటగా నాశనము చేయుచున్నా కూడ, ఆ చెట్లు వారు చేసిన ద్రోహాన్ని యెంత మాత్రమూ గణన చేయక వంట కట్టెల కోసమే కదా. అది పుణ్యమే కద అని భూరుహములు మరలా చిగురించి మేలు మాటి మాటికి చేస్తుంటాయి కదా! అలాగే సజ్జనులు కూడ తమ కెగ్గులు చేసే దుర్మార్గులకు కూడ నిరంతరం (మంచిని) లగ్గు చేయాలనే భావంతో ఎప్పుడు తపన పడుతుంటారు.

* * *

**ఒకే రూపాలున్నా శక్తులు మాత్రం వేరుగా వుంటాయి.**

**ఉ. ఒక్కరిబోలురూపము మరొక్కరికుండునుగాని శక్తి నిం**
**కొక్కవిధంబు మార్పుగొనుచుండును లోకమునం దదెట్లనన్**
**చక్కదనంబు నల్పునొక చందము కాకులవోలె కోకిలల్**
**చక్కని కంఠనాదమున చాలవిభేదము వేంకటేశ్వరా! 74**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో రూపాన్ని పోలిన మరొకరూపం ఉంటుంది గాని శక్తి మాత్రం ఆరెంటికి ఒకేరకంగా వుండక వేరు వేరుగా వుంటుంది.

కాకులు కోకిలలు రూపంలో రెండు నల్లగానే వుంటాయి. కాని వసంతం రాగానే కాకులు కావు కావు అని అరుస్తాయి. కోయిలలు కుహూ-కుహూ అని చక్కగా పంచమస్వరాన్ని ఆలపిస్తాయి. రెండు ఒకేరకమయిన రంగు కల పక్షులయినప్పటికీ గొంతుతో- కూసే కూతలో ఎంతగానో ప్రత్యేకత కల్గి కోయిల రాణిస్తుంది. కాకి తృణీకారం పొందుతుంది.

అలాగే వ్యక్తులు కూడ ఒకేరూపం కల్గి వున్నప్పటికీ వారి శక్తి, సామర్థ్యాలు ఒక్కటిగా వుండక వేరు వేరుగా వుంటాయి. కాకి, కోయిలల మాదిరగా.

* * *

**దుష్టుల ఆగడాలను సజ్జనులు ఎలా తట్టుకుంటారో ఈపద్యం వివరించింది.**

**ఉ. న్యాయగుణైకసత్యవచనంబున కాలముబుచ్చువారినే**
**మాయలమారి వ్యాజ్యములు మార్కొనేర వదెట్టు లన్నచో**
**బాయక మంచియన్నమును భక్షణజేసెడివారు రుగ్మతల్**
**దాయక సర్వసౌఖ్యములడంబు వహింపరె వేంకటేశ్వరా! 75**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో న్యాయపరులై, ధర్మాత్ములై సత్యవచనంతో శోభిల్లుతూ, జీవనయాత్ర చేయు సన్మార్గులను మాయల మారులయిన కొందరు తమ టక్కుటమారాలతో వ్యాజ్యాలతో ఇరికించి బాధించాలని ప్రయత్నించినా వారు ఆపనిలో కృతకృత్యులుగాలేక పరాజయాన్నే పొందుతారు. పూజ్యలయిన వారి ధర్మ ప్రవర్తన ఆ సజ్జనుల కెపుడూ శ్రీరామరక్షయై నిలుస్తుంది.

మంచి షడ్రసోపేత మయిన భోజనాన్ని స్వీకరించువాడు ఏరోగాలను పొందక మంచి ఆరోగ్య సౌఖ్యవంతుడయి శోభిల్లును కదా. 'అన్నాను రూపం తను రూప వృద్ధిః' అనే ప్రాచీన సూక్తి ననుసరించి అతడు మిక్కిలి భాగ్యవంతుడవుతాడు. మంచి భోజనం రోగాలను దగ్గరకు రాకుండా కాపాడినట్లు సజ్జనులు వారి సత్య ధర్మ పరాక్రమశోభితమయిన జీవన సరళిచే దుష్టుల ఆగడాలను దూరంగా నెట్టివేస్తారు. వారిని జయించి వినీతులవుతారు.

* * *

**దుర్మార్గుని మాటకరుకదనం ఎలా ఉంటుందో ఈ పద్యం చెప్పింది**

**ఉ. అన్నములేక గోడుపడు నాతనిడబ్బుగడించువాడు మీ**
**యన్నలు నాకు బాకి యిదు మంచుప్రగల్భము లాడుటెట్లనన్**
**గన్నకుమారు జావు తనగర్భము గాల్పగ కాటి మాడలే**
**కున్నదహింపగూడదని యుగ్రతజూపుటె వేంకటేశ్వరా! 76**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో తినడానికి తిండిలేక ఒకడు ఆకలితో అల్లాడుతుంటే, ధన సంపాదనే లక్ష్యంగా పెట్టుకొన్న దురాత్ముడొకడు బాధపడేవానిని పట్టుకొని, ఒరే, నీయన్నలు నాకు బాకీ వున్నారు. ఆ డబ్బు

ఇపుడిస్తావా లేదా, ఆ బాకి మరీ ఇపుడే కట్టు అని ప్రగల్భాలాడుట ఎలా వుంటుందందే–

కన్నకుమారుని చావుతో తల్లడిల్లుతున్న గర్భశోకంతో బాధపడుతున్న ఆ కన్నతల్లితో– కాటికాపరి వచ్చి నీ బిడ్డడి శవం గాల్చడానికి వీల్లేదు, ముందు కాటి సుంకం కట్టి తరువాత మాట్లాడు అంటే ఎంత కఠినంగా, రాక్షసత్వంగా వుంటుందో అలాగే వుంటుంది. పైవాడు బాకీ ఇపుడే కట్టు అని అడగడం.

* * *

**యోగిముఖంలో బ్రహ్మ తేజస్సు ఎలా వెలుగులు వెదజల్లుతుందో**
**ఈ పద్యం చెబుతూ వుంది**

**ఉ. దైవమదెల్ల లోకముల తప్పకవెల్గెడు నట్లు జ్ఞాన సం**
**భావితు నాత్మయందు బహుభంగుల వెల్గుచునుండు నెట్లనన్**
**పావనమైన సూర్యుడు ప్రపంచమునంతయు వెల్గుచున్న ల**
**క్ష్మీ విభవంపుటద్దమున మించివెలుంగడె వేంకటేశ్వరా! 77**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో జ్ఞానులయిన వారి హృదయం భగవన్నిలయంగా వుటుంది. అంతేగాక పరమాత్మ తేజస్సు వారిలో బహుభంగులుగా మిక్కిలిగా– లోకముల నన్నిటా వ్యాపించియున్న తేజస్సుకంటే మించి వానిలో భగవంతుని తేజం వెలుగు లీనుతుంటుంది.

అది అంతేకదా మరి– సూర్యుడు ప్రపంచమంతా వెలుగులు పంచి కాంతులు వెదజల్లుతున్నా లక్ష్మీవైభవంతో ప్రకాశించే నిగ్గుటద్దంలో మిన్మిక్కిలిగా మించి వెలుంగులతో ప్రకాశిస్తాడు కదా! అలాగే జ్ఞానుల అంతరంగం భగవంతునికి మించుటద్దంలా సుందరనివాసమై

అలరారుతుంది. అందుకే వారు లోకంలో అందరికంటే ఎక్కువగా భగవంతుని తేజః పుంజములతో నిండి ప్రకాశిస్తుంటారు.

* * *

*సంతానం మంచిగా ఉండకపోతే పరిస్థితి ఎలా వుంటుందో ఈ పద్యం వివరించింది*

**ఉ. ఎక్కువపుత్రులున్న ఫలమేమి యయోగ్యులు తల్లిదండ్రికిన్**
**మక్కువదీర్పకుండు నభిమానవిహీనులు నుర్విలోపలన్**
**తక్కువలేనికాన్పుగని తాండవమాడెడు గార్దభంబు పెం**
**పెక్కినచాకిమూటలను వీడి సుఖించునె వేంకటేశ్వరా! 78**

శ్రీ వేంకటేశ్వరా! తల్లిదండ్రులకు గుణవంతుడయిన బిడ్డడు ఒక బిడ్డడయినా కలిగిన చాలు. అట్లుగాక! అభిమాన హీనులు, గుణ విహీనులు, అయోగ్యులయిన పుత్రులు ఎక్కువ సంఖ్యలో పుట్టినా వారి వలన తల్లిదండ్రులు పొందే లాభమేమియు లేదు. పేరు ప్రతిష్ఠలు వారి వలన కన్నవారు పొందలేరు. అది గాడిద సంతానము వంటిదవుతుంది.

మిక్కిలి సంతానంతో తక్కువలేని కాన్పులు గని తాండవ నృత్యం చేస్తూ ఆనందించే ఆ గాడిద తన సంతాన కారణంగా చాకి మూటల బరువు విడిచి సుఖించుటన్నది ఏనాడయినా వుందా. అలాగే దుర్మార్గులయిన సంతు వలన తల్లిదండ్రులు సుఖించుటన్నది కూడా వుండదు. బహుసంతతికల గాడిదకు మోతబరువు తప్పదు. అలాగే నీచులను గన్న తల్లి దండ్రులకు అపకీర్తి దుఃఖము కూడా తప్పదు.

* * *

*గురువుగా అర్హతలు లేనివాడు గురవయితే ఎలా ఉంటుందో ఈ పద్యం వివరించింది.*

**ఉ. నోరొకయింతయెత్తి పదినూర్లజనంబులు మెచ్చఁబాడఁగా**
**నేరనివాడు శిష్యులకు నేర్పఁగఁ గంకణ మూనుటెట్లనన్**

**చేరెడు వేడినీళ్లుగల చెంబును ముట్టగలేని దగ్ని సం**
**స్కారముజేసి తా మగనిజంటకుబోవుటె వేంకటేశ్వరా! 79**

శ్రీ వేంకటేశ్వరా! సంగీతం నేర్వనివాడు, నోరు కాస్త విప్పి పదినూర్లు జనంబులు మెచ్చ బాడగా నేర్వనివాడు తగుదునమ్మా యని సంగీతం నేర్పేగురువుగా మారి శిష్యులకు సంగీతం నేర్పుతానని కంకణం కట్టుకోవడం ఎలా వుంటుందందే–

వేడినీళ్ళు రెండు దోపిళ్ళు నింపిన వేడిచెంబును ముట్టుకోలేని భామామణి అగ్ని సంస్కారమందుచున్న భర్తతో కలసి నిప్పులో కాలిపోతానని మగనిజంటకు పోవుట యెటువంటిదో సంగీత గురువు కంకణం కట్టుకోవడం కూడ అటువంటిదే.

ఆమె చితిమంటలో దూకడం వుండదు. ఈ గురువు సంగీతం నేర్పడం కూడా అబద్ధమే.

* * *

**'దుష్టుని స్వభావం' ఎలా వుంటుందో ఈ పద్యం చెప్పింది**

**చ. పొడమినదాదిగా కపట బుద్ధియు మోసముగల్గువారికిన్**
**చెడుపనిజేయరాదనుచు జెప్పిన మానగజాల రెట్లనన్**
**నడుమ హరించునే మనము నాటినవేపకు చేదుమాపగా**
**గడవలమోసి పాలిడిన గల్గునె మాధురి? వేంకటేశ్వరా! 80**

శ్రీ వేంకటేశ్వరా! పుట్టినది మొదలుగా కపటబుద్ధి మోసపు స్వభావము కల ధూర్తులకు చెడుపని చేయరాదని చెప్పిన ఆ మాటలు విని వారు పుట్టుకతో వచ్చిన ధూర్తత్వాన్ని మానగలరా? మానలేరు. అది యెటువంటిదంటే–

నాటి పెంచే వేపచెట్టుకు మధ్యలో మాధుర్యం రావాలని కడవల కొలది నీళ్ళను కాకుండా పాలను బోసి పెంచినా కూడ వేపలోని చేదు పోయి మాధుర్యం రావడం ఎంత అబద్ధమో దుష్టుడు తన స్వభావాన్ని మార్చుకోవడం కూడ అంతే నిజం.

వేపలో చేదు పోదు, దుష్టుని దుష్టత్వం కూడా పోదు. అతని బుద్ధి పుడకలతోనే పోగలదు.

* * *

***కుమతికి మంచి బోధించడం ఎలా వుంటుందో ఈ పద్యం వివరించింది***

**చ. విమల మనోవికాసగుణవేత్తలు నిర్మలధర్మమర్మముల్**
**కుమతికి బోధసేయ నయకోవిదుడై చరియింప డెప్పుడున్**
**క్రమముగ విశ్వకర్మవలె కల్పనజేయు ప్రవీణుడైన గొ**
**డ్డెముకను సానబెట్ట మణికీడుగవెల్గునె వేంకటేశ్వరా! 81**

శ్రీ వేంకటేశ్వరా! సుమతిలేని కుమతికి, ఆర్యులయిన మనోవికాస వ్యక్తిత్వ వికాస విద్యావిశారదులయిన విద్యావేత్తలు నిర్మల ధర్మమర్మములు మిక్కిలి నేర్పుతో బోధించనా, ఆకుమతి నీతి శాస్త్ర పారగుడు గాడు. సుమతియై మంచిపనులు కూడ చేయడు. అతని మార్చుడానికి చేసే ప్రయత్నం కూడ వ్యర్థవేం ఆప్రయత్నం కూడా వ్యర్థవేం. ఆ ప్రయత్నం ఎటువంటిదవుతుందంటే–

దేవశిల్పియయిన విశ్వకర్మవలె కల్పన జేయు ప్రవీణుడయిన శిల్పి కూడ గొడ్డు ఎముకను తెచ్చి దానిని సానబెడితే మణితో సమానంగా అది కాంతులీనగలదా! మణికి ఈడు గొడ్డెముకవుతుందా – కాదు.

అలాగే కుమతికి ఎంతబోధించినా నయకోవిందుడు కాడు. గొడ్డెముకను సానబడితే అది మణికీడుకానేకాదు.

* * *

**ఎంతటి వానినైనా ఉపాయంతో గెలువవచ్చు**

**ఉ. వీరపరాక్రమవ్రతు ప్రవీణుని గెల్వగలేక యున్న నా
శూరు నుపాయసాధనల సూక్ష్మముగాను జయింతురెట్లనన్
ధీరత నింద్రుడే గెలువనేరని యల్లబలీంద్రు వామనా
చారుడు యాచకాకృతిని సర్వము లాగడె వేంకటేశ్వరా! 82**

శ్రీ వేంకటేశ్వరా! వీరపరాక్రమవ్రతుని, ధైర్యప్రవీణుడయిన శూరుని ఎదుర్కొని యుద్ధములో గెలుచుట కష్టమయినను సూక్ష్మాతి సూక్ష్మ విచారణలు చేసి – యుద్ధముగాకుండా, అన్య ఉపాయాలను పన్ని ఆ శూరుని జయించుట. కార్యసాఫల్యం పొందుట జరుగును.

ఎలాగంటే– దేవేంద్రుడు కూడా జయింపలేని బలిచక్రవర్తిని శ్రీమహావిష్ణువు వామన మూర్తియై యాచకాకృతిని దాల్చి వెళ్లి అన్యోపాయాలతో జయించుట జరిగినద కదా. అలాగే ఉపాయాంతరాలతో ఎంతటి వానినైనా జయింపవచ్చును.

* * *

**మంచివారి స్నేహం ఎలా వుంటుందో ఈ పద్యం చెప్పింది**

**ఉ. క్రూరుడు మంచి వారలను గూడినవారల వల్ల వానికిన్
బేరును గౌరవంబును గభీరత గల్గు నదెట్టులన్న శృం
గార విలాససంపదలు గల్గినకాంతలు గన్నులందునం
దీరుగ దీర్చు కాటుకకు తేజముగల్గదె వేంకటేశ్వరా! 83**

శ్రీ వేంకటేశ్వరా! క్రూరుడయిన మానవుడు కూడ మంచివారలతో స్నేహం చేసిన యెడల ఆ మంచి వారల స్నేహ నిపుణతతో అతనికి మంచిపేరు, గౌరవం, గాంభీర్యం, కల్గి రాణించును. అది యెలాగంటే–

శృంగార విలాస సంపదలు గలకాంతలు, కన్నులకు అందంగా కాటుక రేఖలను తీర్చి సొగసుగా కాటుకను అలంకరించగా ఆ కాటుకకు క్రూరత పోయి నీలాలనిగనిగలు, సౌందర్యాలు, కాంతల వలన వచ్చాయికదా! అలాగే ఆశ్రయాధిక్యతనుబట్టి క్రూరులు కూడా ఒకోసారి మంచి గౌరవాన్ని పొందగలరు.

* * *

*కవుల కావ్యాలు గొప్పదనం ఈపద్యం చెప్పింది*

**చ. కవులు దరిద్రపూరితులుగా నటియించిన వారికావ్యముల్**
**భువిని యశోవిశాలతను పూజ్యత నందకయుండ వెప్పుడున్**
**బ్రవిమలమైన యిక్షుగడ భాగ్యవిహీనుని చేతనున్న త**
**ద్భవత వహించు మాధురియు తగ్గి నశించునె వేంకటేశ్వరా! 84**

శ్రీ వేంకటేశ్వరా! కవులు కొందరు దరిద్రపూరితులుగా నటించినా, వారి కావ్యములు భువిలో యశస్సంపదను నింపి పూజ్య గౌరవాన్ని ఆ కవులకు నిండుగా యిచ్చుట జరుగును.

భాగ్య విహీనుని చేతిలో వున్న ఇక్షుగడ కూడా ఆశ్రయాన్ని బట్టి మాధుర్య దౌర్భాగ్యంతో వుండకుండా, తనదైన మాధుర్యంతోనే నిండి వుండి తనకు గల ప్రఖ్యాతిని నిలబెట్టుకుంటుంది.

అలాగే కవులు దరిద్రులయినా– వారి కావ్యాలు చెరుకు గడల వంటివి కావున ఆ కావ్యాలు వ్రాసిన కవులకు మాధుర్యం వంటి యశస్సంపదనూ, పూజ్యగౌరవాన్ని నిరంతరం కల్గిస్తూనే వుంటాయి.

కవులు దరిద్రులేకాని వారి కావ్య కన్యలు మాత్రం ఎప్పుడూ శ్రీమంతురాండ్రే దారిద్ర్యం వారికి లేదు.

* * *

బ్రహ్మలుగా పేరుపొందిన వారి బ్రహ్మత్వాన్ని గూర్చి వివరించిన పద్యం

**ఉ. కమ్మరి విశ్వకర్మనని కల్పనజేసిన బొమ్మకైన ప్రా**
**ణమ్ము నొసంగి లోకనటనం బొనరింపగ నేరకున్నచో**
**కుమ్మరి జీవనంబునకు కుండలుజేసిన బ్రహ్మయంచు బే**
**రిమ్మహినంది లోకముల నెట్లు సృజించును వేంకటేశ్వరా! 85**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో బంగారపు పనిచేసే కమ్మరిని విశ్వబ్రహ్మ–అని విశ్వకర్మ అని ప్రజలు పొగడ్తలతో అనేక ప్రశంసలు చేస్తారు. అటువంటి కమ్మరి తన శిల్పనైపుణ్యంతో మంచి బొమ్మను తయారు చేస్తాడు తప్ప బ్రహ్మ దేవునిలాగా బొమ్మకు ప్రాణంపోసే నైపుణ్యం లోక నటనా వైభవం నేర్ప కల్గి వుంటాడా? విశ్వబ్రహ్మ అన్నంత మాత్రాన అతడు విశ్వాన్ని సృజించే బ్రహ్మదేవుడు కాలేడు.

అలాగే కుమ్మరిని కూడ తన జీవనానికై అతడు రకరకాల కుండలు చక్కగా చేసి ఆ కుండలను నిర్మించిన నైపుణ్యంతో బ్రహ్మయని లోకంలో పేరు పొందిన మాత్రాన ఆ కుమ్మరి బ్రహ్మదేవుని వలె విశ్వసృజన చేయలేడుకదా! అలాగే విశ్వకర్మకూడ బ్రహ్మ అని ప్రశంసలు పొందినా తను నిర్మించిన బొమ్మతో లోక నటనం చేయించలేడు.

అందువలన కమ్మరిగాని, కుమ్మరికాని, తమ విద్యానైపుణ్యాలతో బ్రహ్మదేవునితో సమాన గౌరవం కల్గించాలని బ్రహ్మలుగా ప్రశంసలు పొందారు తప్ప, వారు బ్రహ్మ దేవుని వలె ప్రాణులను సృజించలేరు. సృజించిన బొమ్మలకు లోకనటనం నేర్పలేరు. అవి కేవలం ప్రశంసా పదాలు తప్ప వేరు కాదు.

కావున విశ్వకర్మ విశ్వబ్రహ్మగా తను సృజించిన బొమ్మకు ప్రాణంపోసి లోకనటనం నేర్పినపుడు ఆ పేరు సార్థకం కాగలదు‘ అలాగాక, కుమ్మరి

తన జీవనానికి కుండలు రకరకాలుగా జేసి కులాల బ్రహ్మ యని పేరు పొందినా లోకాలను సృజించకలేక పోవడమనేది ఏలాగ కలదో అలాగే విశ్వబ్రహ్మకూడా తను సృజించిన బొమ్మకు లోకనటన మనేది కల్పించని వాడవుతున్నాడు. కావున వారు పేరుకు బ్రహ్మపదంతో పిలువబడుతారు తప్ప నిజమయిన బ్రహ్మ దేవులు కానేకారు.

* * *

బ్రహ్మానుభవం ఎటువంటిదో ఈపద్యం చెప్పింది

**చ. పరమ వివేకమార్గములు బ్రహ్మ మెరింగిన యట్లు చెప్పి యం**
**దఱకుని నింపుగూర్చుదురు తాము నెఱింగి నటింపరెట్లనన్**
**దరిమెనయైన దారువున దాల్చిన తోలునబుట్టు శబ్ద మం**
**దఱకును నింపుగూర్చి యది తాను నెరుంగునె వేంకటేశ్వరా! 86**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కొందరు బ్రహ్మజ్ఞానులై పరమ వివేకమార్గములు మాకు కరతలామలకములని జిజ్ఞాసువులకు ఇంపు కలుగునట్లుగా వివరించి చెప్పగలరుగాని, తాము ఆచరణలో మాత్రం వానిని పాటించక లోకవ్యవహార యథాప్రకారం కల్గి వుంటారు. ఆ బ్రహ్మ జ్ఞానాన్ని తమ అనుభూతికి తెచ్చుకొని అనుభవించడం మాత్రం వుండదు.

అది యెలా గుంటుందంటే– తోలునుధరించి డోలుగా మారిన దరిమెన తన శబ్ద మాధుర్యంతో అందరికీ ఇంపు కల్గించ గలదు కాని తను మాత్రం ఆ శబ్దమాధుర్య రసాస్వాదనం ఏమీ తెలియనదవుతున్నది కదా!

అలాగే బ్రహ్మ తత్త్వాన్ని బాగా వివరించి చెప్పే బ్రహ్మ జ్ఞానికి కూడా ఆ యనుభవం మాత్రం తనకు లేనివాడై డోలులాగా వుంటాడు.

* * *

**కవులు దరిద్రులగుటకు కారణం ఈ పద్యం వివరిస్తున్నది**

**ఉ. సారరసప్రణీతకవిసత్తము డద్భుతకీర్తిగాంచినన్**
**కూరలు కూడుగుడ్డలకు గుందు దరిద్రత నందునెట్లనన్**
**శారద వారిలోనునికి సాధ్విరమామణి కొప్పుజాలమిన్**
**జేరదు కోడలన్ విసుగుచేత కవీశ్వరు వేంకటేశ్వరా! 87**

శ్రీ వేంకటేశ్వరా! రస కవితలు వెలయించగల కవిసత్తముడు అద్భుత కీర్తిప్రతిష్ఠలు సంపాదించినా, నిజజీవితంలో కూడు గుడ్డలకు లేనివాడై దారిద్ర్యంతో క్రుంగిపోతుంటాడు. అదియంతే కదా మరి.

సరస్వతి వున్నచోట శ్రీమహాలక్ష్మి ఉండదు. లోకంలో ఒక నానుడి వున్నది. కవులలో శారదాదేవి కొలువై వుందని సాధ్వీయగు శ్రీరమణి సరస్వతి యంటే తనకు కోడలు కాబట్టి తను పెత్తనం చలాయించే అత్తగారు కాబట్టి సహజంగా అత్తా కోడళ్ళకు వుండే వైమనస్యంచేత విసుగు పొంది కోడలున్నచోట అత్త ఉండకుండా వుండి కవులను శ్రీమంతులను కాకుండా చేస్తుంది. వారు దారిద్ర్యంతో బాదపడవలసిందే తప్ప ధనవంతులు కాలేరు.

* * *

**దానగుణవైభవ మహిమ ఈ పద్యంలో చెప్పారు**

**ఉ. దొడ్డగు సర్వసంపదలతో దులతూగు ధనాఢ్యుడయ్యు పే**
**ర్వడ్డ పరోపకారముల పాల్గొనలేమికి దూలకుందురే**
**బిడ్డకు కొంచెమిచ్చి కడుబీదకు బాలిడుధేనువౌటచే**
**గడ్డిని దిన్నపూజలిడి కాళ్లకు మ్రొక్కరె వేంకటేశ్వరా! 88**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో ధనవంతు లెందరో వున్నారు. అయితే ఏ ధనవంతుడైతే పరోపకారబుద్ధి లేక స్వార్థ జీవనుడై ధనం దానం జేయకుండా

వుంటాడో వానిని జనం పూజించరు సరికదా! మిన్నిక్కిలిగా దూషిస్తుంటారు. అది నిజమేకదా!

గడ్డిని దిని బ్రతుకుతూ, తనబిడ్డకు మాత్రం గొంచెంగా పాలను స్రవించి యిచ్చి బీదకు కుండనిండా పాలిస్తున్నదని లోకమంతా ధేనువు యొక్క పపరోకరాబుద్ధిని ప్రశంసిస్తూ ఆ గోమాత కాళ్ళను పూజించి నమస్కరించి సర్వదేవతల సమంగా గోవును గౌరవించి సత్కరిస్తారు. అలాగే ధనవంతుడు కూడ తన వద్దవున్న ధనాన్ని తాను కొంత అనుభవిస్తూ మిగిలిన ధనాన్ని నిరుపేదలకు ఉపకారబుద్ధితో ఖర్చు చేసే దానగుణం కలిగి వుంటే అతనిని గోమాతను పూజించినట్లు పూజిస్తారు. అలాగ కాకపోతే లోకం చేత అతడు దూషింపబడతాడు.

* * *

**లోభివాని లోభత్వం ఎంత ప్రమాదకరమయినదో ఈ పద్యంలో విచారించడం జరిగింది.**

**చ. పరమ పతివ్రతామణికి బంగరుముక్కరలేమి జూచియున్**
**ఇరువుగ గోపురాగ్రమున కెత్తినకాంచన కుంభమట్టులే**
**కరువున నందరుంగడుపుగాలుచునుండగ ధాన్యరాసులన్**
**నిరతము లుబ్ధమానవుడు నిల్పగజేయుట వేంకటేశ్వరా! 89**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కరువుకాలంవచ్చి అందరూ కడుపు మంటతో కాలి దురవస్థలు పడుతూ వుంటే చూసి కూడ కొందరు లోభబుద్ధిగల పిసినారులు ధాన్యరాశులను నిల్వజేసి, పేదలకందకుండా దాచి లాభించాలని లోభిస్తారు. అది యెటువంటిదంటే పరమ పతివ్రతామణికి ముక్కుకు బంగరు ముక్కెర ఇవ్వలేనివాడు పుణ్యం కావాలని కోరి ఆలయ గోపురాగ్రాలపై కాంచన కుంభాల లంకరించాలని ప్రయిత్నంచడం ఎటువంటిదో ఎంత అవివేకమో అటువంటి అనౌచిత్యమే

కురువులో ధాన్యరాశులు దాచి తగిన సమయంలో అమ్మి ధనరాశులు సంపాదించాలనే లోభ బుద్ధి కలవాడు కూడ అటువంటి అనౌచిత్యమే చేస్తున్నాడు.

పుణ్యం సంపాదించాలంటే పరమ పతివ్రతామణికి ముక్కుకు ముక్కెర చేయిస్తే సరిపోతుంది. గోపురాగ్రాలపై సువర్ణ కలశాలు ఆపైన ఉంచితే మరీపుణ్యం వస్తుంది. అంతేగాని ముక్కెర ఇవ్వలేనివాడు సువర్ణకలశం పెట్టాలని ఆత్యాశ పడడం ఎలా ఉంటుందో కరువులలో ధాన్యం దాచి పేదలను బాధించడం కూడ అలాగా వుంటుంది. ఇద్దరూ నిందార్హులు తప్ప పూజార్హులు కానేకారు.

* * *

**"అన్నం - వస్త్రం ఈ రెండింటి" మేలు తెలిపే పద్యం**

**ఉ. గాలికి బోవుదూది పురిగల్పిన తంతువులన్ని నేయగా**
**చేలములై ప్రజావళికి సిగ్గుదొలంచుచు నుండునట్టులే**
**ధూళియు దూసరాకలుము దున్నినపంటలతోడ భూమి తా**
**మేలుగ బండి మానవుల మేలుకు నియ్యదె వేంకటేశ్వరా! 90**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో భూమిని చక్కగా దున్ని ధూళి-దూసర లేకుండా కలుము బాగా దున్ని నీరు పారించి గింజలు చల్లితే చక్కని పంటలు పండి ఆ భూమి అందరకూ మేలు జేసినట్లుగా-

గాలికి పారిపోవు దూదిని కూడ ఒకచోటచేర్చి తంతువులుగా దానిని మెలివేసి పేని పడుగు పేకలుగా కూర్చి వస్త్రాన్ని నేతగా నేస్తే, అది ప్రజావళికి సిగ్గు తొలగిపోకుండా మానాన్ని కాపాడే సుందర వస్త్రంగా ఆదూదిమారి మేలుచేస్తుంది. పంటలు పండే భూమి మేలు ఎటువంటిదో. దూది వలన తయారగు వస్త్రం మేలు కూడా అటువంటిదే.

భూమి ఆకలి తీర్చి ప్రాణాలు కాపాడిమేలుచేస్తే- దూది మానాన్ని కాపాడి అభిమానధనులుగా అందరికీ మేలు చేస్తుంది. ప్రాణం కంటెకూడ మానం గొప్పదని ప్రాణాలు సంద్రంలోని అలలవలె చపలములనీ- మానం మాత్రం చంద్రసూర్యులున్నంతగాలం స్థిరంగావుంటుందని- ప్రాచీనార్యుల సూక్తి.

* * *

**క్రూరునకు చేసిన మేలు ఎటువంటిదో ఈ పద్యం వివరించింది.**

**ఉ. క్రూరున కెంతమేలు నొనగూర్చిన తత్సమయంబుదాటగా**
**వారినె ధిక్కరించి పెదవాదములాడక పోవదెట్లనన్**
**కూరిమి పాముపిల్లనొక కొన్నిదినంబులుబెంప పాలు నే**
**మారక బోసినన్ గరవమార్కొనకుండునె వేంకటేశ్వరా! 91**

శ్రీ వేంకటేశ్వరా! క్రూరునకు ఎంతగా మేలు చేసినా వాడు ఆ సమయం దాటగానే చేసిన మేలును మఱచిపోయి యథాప్రకారంగా క్రూరాత్ముడై మేలుచేసిన వారిని ధిక్కరించి పల్కి పెడవాదం చేసి 'నాకేమి మేలు' జేసావని గొడవపడతాడు. అది అంతేమరి-

ఒకడు ప్రేమతోపాము పిల్లను తెచ్చి పాలుపోసి పెంచి ఎంత జాగ్రత్తగానో దానిని కాపాడుతున్నా ఆ పాము పెరిగిపెద్దదై పాలుపోసి పెంచినాడని. వానిని కఱవ కుండా వుండదు కదా. తప్పక దాని స్వభావం కఱవడం కనుక అది కఱచి కాటువేస్తుంది తప్ప, వాడ తనకు పూర్వం జేసిన మేలును తలచదు. అలాగే దుష్టుడు కూడు పాపపు పాములాంటివాడే. అన్యుడు కాడు. అందుకే వాడు చేసిన మేలు ఎన్నటికీ తలచడు.

* * *

*స్నేహం మరువలేనిది*

**ఉ. భారపు మూటలీడ్వగల బండి నొకప్పుడు నిల్పి దింప నా**
**దారిని బోవునెద్దులట తప్పకగుర్తిడి నిల్చునెట్లనన్**
**కూరిమిజూపు మిత్రుడొక కొన్నిదినాలు విదేశవాస సం**
**చారము సల్పివచ్చినను సఖ్యతనిల్పడె వేంకటేశ్వరా! 92**

శ్రీ వేంకటేశ్వరా! భారగమనంతో కూడిన ఎడ్ల బండికి గూర్చిన యెద్దులు. ఎక్కడయితే బండిని నిల్పి–తమభారాన్ని తొలగించి సరుకులు దించారో ఆ స్థలాన్ని ఎన్నాళ్ళయినా గుర్తుపెట్టుకొని తరువాత కాలాంతరంలో బండి అటుగా వచ్చినపుడు పూర్వం తమ భారం తొలగిన ఆ చోటును చూసి గుర్తించి సఖ్యతతో ప్రేమతో అక్కడ కొంత సమయం ఆగి తరువాత బండిని యథా తథంగా లాగినట్లు–

కూరిమి కల మిత్రుడు ఒకానొకప్పుడుబాగా స్నేహము జేసి తరువాత కాలంలో విదేశాలకు వెళ్ళి అక్కడ నివాసం చేస్తున్నా తనుస్నేహం జేసిన సఖ్యతను ఏనాడు మఱచిపోడు కదా!

అలాగే ఎద్లు కూడా తమ భారాన్ని తొలగించి ఆనందాన్ని కలిగించిన భూమిని మరువలేవు. అక్కడ భూమిపైగల స్నేహాన్ని ఎడ్లుకూడా మఱచిపోకుండా వుంటాయంటే విచక్షణా జ్ఞానం కలమానవుడు విదేశాలకు వెళ్ళినా తన సఖ్యతను ఏనాడు మరువలేడు.

* * *

*ఈ పద్యంలో స్నేహవైభవం వివరింపబడింది*

**ఉ. దూరమునందు నిల్చి కృపతో బొదచూపిన సూర్యగాంచుచో**
**సారసపత్రముల్ విరువజాలక యుండవదెట్టులన్నచో**

**సారరసజ్ఞు స్నేహమును సల్పిన సజ్జను డెన్నినాళ్ల కా**
**దారిని వచ్చినన్ మది ముదంబును జూపడె వేంకటేశ్వరా! 93**

శ్రీ వేంకటేశ్వరా! పద్మములు సుదూరములోవున్న తమ ఆత్మబంధువయిన సూర్యభగవానుని చూచి అతని దయాగుణానికి స్నేహవైభవానికి ఆనందించి వికసించుట చేయును. అది యెటువంటిదంటే

రసజ్ఞుడయిన స్నేహితుని స్నేహమును సజ్జనుడెన్నాళ్ళకు నైనా మరువలేడు. కాలం గడిచి ఏదో ఒక సమయంలో కొన్నాళ్ళకు ఆ స్నేహితుడు కనబడినపుడు తన మనస్సులో ఎంతో ఆనందాన్ని పొంది వికిసించిన కన్నులతో అతనిని చూసి ఆనందిస్తాడు కదా. అలాగే పద్మాలు కూడా దూరంగా వున్న తమ స్నేహపాత్రమయిన సూర్యున్ని జూచి వికసనంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తాయి. స్నేహ సౌందర్యం అటువంటిది.

ఇందు స్నేహ వైభవం వివరింపబడింది.

* * *

**శాస్త్ర చర్చ అవివేకి చేస్తే ఎలా వుంటుందో ఈపద్యం చెప్పింది**

**ఉ. ఏమి యెఱుంగనట్టి యవివేకిని శాస్త్రవిచార పూర్ణ వి**
**ద్యా మహిమంబు పేర్కొనగ నాతడు సభ్యులమెప్పుగూర్చునే**
**ఆముదవృక్షమెంతపొడవై విలసిల్లిన మిద్దెదూలముల్**
**బ్రేమను వేయజూడ నిలబెట్టునె భారము వేంకటేశ్వరా! 94**

శ్రీ వేంకటేశ్వరా! ఏమీ తెలతియని అవివేకి. శాస్త్ర చర్చ మొదలు పెట్టి వివరించడానికి ఉపన్యాసం చేయమొదలిడితే అది సభాపూజ్య మవుతుందా, సభ్యుల మెప్పుపొందుతుందా – అదియెలా ఉంటుందంటే

ఆముదపు చెట్లు పొడవైనవి కదా అని వానిపై ప్రేమతో మిద్దెలకు దూలాలుగా ఉపయోగిస్తే అని మిద్దె భారాన్ని మోస్తాయా మోయలేవు. ఆ మిద్దె త్వరగానే కూలిపోతుంది.

అలాగే ఏమీ తెలియని వాడు శాస్త్ర చర్చ చేయ మొదలు పెడితే మొదట్లోనే అతడు ఆముదపు దూలాలుంచిన మేడ ఎలా మొదలంటా కూలిపోతుందో అలా పతనం చెంది సభచే అవమానం పొందగలడు.

* * *

**గ్రామాధికార పదవి ఎవరికివ్వాలో ఈపద్యంలో చెప్పబడింది**

**ఉ. కల్లలునాడుదుర్మతిని గ్రామవిచారణకై విధింపగా**
**నెల్లరు వానిరూపు గని యెన్నిన సత్యము నెన్నుకొందురే**
**కొల్లగ నీరుసత్తువిడి కూరిమి బెంచిన బెండుకొయ్యలన్**
**ఇల్లుకు ముందుకంబముల కేసిన నిల్చునె వేంకటేశ్వరా! 95**

శ్రీ వేంకటేశ్వరా! ఎపుడూ అసత్యాలు మాట్లాడే దుర్మతికి గ్రామవిచారణ పదవినిచ్చి గ్రామంలోని సమస్యలను నివారంచమని అధికారమిస్తే, అందరూ వాని రూపం చూసి వీడికా ఈ పదవి అని మనసులో వాని నిజస్వభావం గుర్తుకు తెచ్చుకొని వీడి విచారణ బాగున్నట్లేయని చులకన చేయకుండా వుండరు. అదియెటువంటిదంటే

బెండు కొయ్య గల చెట్లను దొడ్లో నీరు, సత్తువ బాగా పోసి వేసి పెంచామని, అవి గట్టిగా వుండక పోతాయా అని భావించి ఇంటికి ముందు స్తంభాలుగా ఆ బెండు కొయ్యల నుంచితే యింటి ముందరి భారానికి ఆ బెండు కొయ్యలు మధ్యకు పుట్టక్కున విరిగిపోయినట్లు అసత్యాలు పలికే వ్యక్తికి గ్రామసమస్యల పరిష్కార పదవినిస్తే ఆ సమస్యలు ఎక్కడికక్కడే

పరిష్కారం కాక ఇంకా పెద్దవై కూర్చొంటాయి. గ్రామ విచారణధికారికారము సత్యం పలికే మంచి వాడికివ్వాలి.

* * *

**అందగాడు కాకపోయినా శాస్త్రం చదవుకున్న పండితుడు ఎంత ప్రయోజనం సమాజనికి కలిగిస్తాడో ఈపద్యం వివరించింది**

**ఉ. కోమల హీనుడైన ననుకూల విచారణ శాస్త్రవాద వి**
**ద్యామహిమాదులున్న నత దందరి జ్ఞానుల జేయకూడునే**
**ధూమముబోలెకన్నులకు దోచెదు మేఘుదు సస్యవృద్ధికై**
**భూమిని వర్షరీతి నిలబోయడె నీరము వేంకటేశ్వరా! 96**

శ్రీ వేంకటేశ్వరా! కోమలత్వం కరువై ఏ సౌందర్యం లేనివాడయి నాసరే-వాడు శాస్త్ర కోవిదుడయినట్లయిన- వాడు విద్యామహిమలచే అలరారుచుంటే అతడందరిని జ్ఞానులుగా మార్చగలడుకదా.

నల్లని పొగలాగా చూడటానికి మొరటుగా కనబడే నీలాల మబ్బుగా వున్న మేఘుడు భూమిలో సస్యసమృద్ధి వృద్ధిపొంది అందరికీ మేలు జరగాలని వర్షాలతో వర్షించి భూమిని సస్య శ్యామలం చేస్తున్నాడుకదా!

అలాగే అందం లేక పోయినా విద్యామహిమలు గల చదువరి తన చుట్టూ వున్న వారినందరినీ విజ్ఞాన ధనులుగ చేసి మేలు చేస్తాడు. చదువుంటే అందము లేకపోయినా వానిని అందరూ గౌరవించి సత్కరిస్తారు. మేఘాన్ని పూజించినట్లు పూజిస్తారు.

* * *

***ఈ పద్యంలో ఆత్మయోగి పొందే ఆనందాన్ని గూర్చి వివరించుట జరిగింది***

**ఉ. శ్రీమదనంతయోగపరిశీలన తత్త్వవిచార పూర్ణులున్**
**వేమరకాత్మబ్రహ్మమను వెల్గునతన్మయ మందకందురే**

**గీమున నెందుజూచినను కిల్బిషవారణ చంద్రఖండముల్**
**ప్రేమను నిల్చియున్న తమబింబము జూపవె వేంకటేశ్వరా! 97**

శ్రీ వేంకటేశ్వరా! శ్రీమదనంత యోగపరిశీలన తత్త్వవిచార పూర్ణులయిన మహానుభావులు ఆత్మ తత్త్వమెఱిగి–ఆత్మసాక్షాత్కారాను భూతిని హృదయం నిండా పొందుతూ మహావెలుగులో ప్రకాశిస్తుంటారు. కదా. అది అటువంటిదే కదా.

పాపాలు పోగొట్టే చంద్రరేఖలను అనురాగంతో ఆరాధించి ప్రణయ తత్త్వంతో ప్రేమగా జూచినపుడు ఆ చంద్రరేఖల్లో తమ ప్రతిబింబము దోచి యెనలేని ఆత్మానంద తేజస్సులో ప్రణయారాధకులు వెలిగి పోతారు కదా.

అలాగే యోగి ఆత్మానంద అనుభూతులు పరిపూర్ణంగా పొందుతూ–చంద్రరేఖలోని ప్రతిబింబం చూసి ప్రణయారాధి వెలిగి పోయినట్లుగా ప్రకాశనము పొందగలడు.

* * *

**ఈ పద్యంలో దుర్జనులయినా మహాత్ములదరి**
**ఎంతస్నేహంగా వుంటారో వివరించడం జరిగింది.**

**ఉ. భేదములేక దుర్జనులు పెద్దలు గుంపులు జేరియుందు రా**
**హ్లాదముగా మహాత్ములకు నంజలిజేయుచు సర్వకాలమున్**
**సాదృశమొప్ప శంభుతలఁ జంద్రుదు సర్పము వహ్ని నీరమున్**
**మోదముతోడజేరి కడుముద్దులుజూపవె వేంకటేశ్వరా! 98**

శ్రీ వేంకటేశ్వరా! మహాత్ములయిన వారల వద్దకు దుర్జనులు గుంపులు గుంపులుగా వెళ్ళినా– అక్కడవారు తమ దుర్జన స్వభావాన్ని వీడి సుజనత్వంలో ప్రకాశిస్తూ మహాత్ములకు అంజలి ఘటిస్తూ భేదభావంలేక ఒకటిగా కలసి వుంటారుకదా. యెట్లనగా–

పరమేశ్వరుడయిన శివుని శిరస్సులో ఒకచోట చంద్రుడు, మరొకచోట సర్పము, ఇంకొక చోట నిప్పు-నీరు ఇవన్నీ భేదభావాలు మఱిచి శివ సన్నిధానంలో ముద్దులొలుకుచూ అందాలతో కలసి వున్నాయికదా!

మరిమహాత్ముల సాంగత్యం అంతమహిమ కలిగి వుంటుంది.

* * *

**నమ్మిన స్నేహితుడు మోసం చేస్తే ఎలా వుంటుందో ఈపద్యం వివరించింది**

**ఉ. జీవసమానమిత్రుడనిజేరిన నాతనిమోసబుద్ధితో**
**భావమునందుకష్టముల పాలొనరింపదలంచు టెట్లనన్**
**సేవయొనర్ప శ్రేయమును శ్రీయును నాయువు నిచ్చునంచు నా**
**దేవుని మ్రొక్కు వేళ గుడి దెబ్బున గూలుటె వేంకటేశ్వరా! 99**

శ్రీ వేంకటేశ్వరా! ప్రాణసమాన మిత్రుడని స్నేహితుని నమ్మి యొకడు తన స్నేహితుని వద్దకురాగా-ఆతడుమోసబుద్ధితో వీడిని నానాకష్టాలు పెట్టాలని యనుకోవడం ఎటువంటిదంటే-

దేవునికి సేవచేస్తే ఆ పూజవలన ఆయువు. పెరుగుతుంది. శ్రేయస్సు లభిస్తుంది. అని యెన్నో ఆశలతో వచ్చి దేవునికి నమస్కరిస్తున్న సమయంలోనే ఆదేవాలయం కూలిపోయి వాడి నెత్తిపై కూలితే ఎలా వుంటుందో అలాగ వుంటుంది. ప్రాణాలుగాలిలో తేలిపోతాయి.

* * *

**ఈ పద్యంలో కాలం కలసిరాక పోతే ఎంతటివాడయినా దురవస్థ ఎలా పొందుతాడో వివరింపబడింది.**

**ఉ. శ్రీలలరారుచున్న గ్రహచేష్టలు వక్రములైన నాతనిన్**
**హేళనపాలొనర్చి కృశియింపగజేతురు లోకులెట్లనన్**

**జాలనికాలమందున నిశాచర వల్లభుడైన రావణుం**
**దేలెడు లంక కొక్క కపియేగి దహింపడె వేంకటేశ్వరా! 100**

శ్రీ వేంకటేశ్వరా! సంపదలతో మహావైభవాన్ని పొందుతున్నప్పటికీ ఒకప్పుడు గ్రహగతులు సరిగా లేక వక్రించి విధి వైపరీత్యంతో అవస్థలు పడేవారిని జూచి లోకం హేళన చేస్తుంది. వీనిని యెలా నాశనం చేయాలా అని భావిస్తుంది. అలాగే కదా.

కాలం కలసిరాకపోతే కర్రే పామై కఱచినట్లు నిశాచర వల్లభుడయిన రావణాసురుని బంగారు లంకకు ఒక కోతిపిల్ల వచ్చి పట్టణాన్ని మొత్తం తగులబెట్టి రావణున్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించింది కదా!

ఆవిధంగా కాలం గ్రహగతులు, సక్రమంగా ఉన్నంతకాలమే ఎవడయినా లోక పూజ్యుడవుతాడు. గ్రహగతులు వక్రిస్తే వానిగతి అధోగతే.

* * *

**ఈపద్యంలో ఎంత పండితుడయినా తానే ముందుగా వాదానికి దిగితే ఎలా వుంటుందో చెప్పబడింది?**

**ఉ. వేదపురాణశాస్త్రముల వేలకొలంది నెఱింగియున్న నా**
**హ్లాదముగాను వాదమున కాతడు జూపిన కీడె యెట్లనన్**
**జూదమె కూడుగాను యమసూనుడుగాంచిన రాజ్య మాదిగా**
**వాదికి నోడి తాను వనవాసము జేయడె వేంకటేశ్వరా! 101**

శ్రీ వేంకటేశ్వరా! పండితుడొకడు విద్యామదంతో శాస్త్ర విజ్ఞానమంతా నాకు కైవసమైవుంది. నాకెదురెవరు అనిభావించి తనేముందుగా వాదానికి దిగి వాదించడం మొదలు పెడితే వాడు వాదంలో ఓడిపోక తప్పదు.

యెలాగంటే యమసూనుడయిన ధర్మరాజు జూదంలో నేర్పరినని తలచి ఆ జూదమే కూడుగా భావించి ధర్మరాజు జూదమాడగా తాను సర్వస్వమూ జూదంలో కోల్పోయి వనవాసానికి వెళ్లాడు కదా!

ఆ విధంగా ఎవరయినా– ఎంతటి పండితుడయినా తమకు తాముగా వాదానికి ముందుగా వుంటే ఓడిపోవడం తప్పదు.

* * *

**ఈ పద్యంలో హీనుడియనా విజ్ఞానధనం వాని వద్ద వుంటే పొందే స్థితి ఏమిటో విరించడం జరిగింది.**

**ఉ. జ్ఞాననిదానధర్మములు గల్గిన హీనకులస్థుడైన స**
**న్మానము నంది లోకమున మాన్యతబొందు నదెట్టులన్నచో**
**ఏనుగుమోము గల్గు పరమేశుని పుత్రకు డెక్కు మూషకం**
**బేని విహారకీర్తి వహియించి వెలుంగదె వేంకటేశ్వరా! 102**

శ్రీ వేంకటేశ్వరా! మానవుడు హీనకులజుడయినా! అతడు విజ్ఞాన ధనుడై చదవులన్నీ చదివిన వాడు కాగా. అతడు సన్మానాల నందు కొని లోకం చేత పూజింపబడతాడు. చదువుంటే హీనకులం సంగతి అందరూ మఱచి పోతారు. పూజిస్తారు. అది యెట్లనగా–

పరమేశ్వరుని పుత్రుడైన వినాయక స్వామికి వాహన మయిన ఎలుక హీనమయిన ఆ అల్పప్రాణి కూడా వాహన విద్యాసామర్థ్యంతో వాహనంగా మారి లోకముచేత పూజలందుకుంటున్నది కదా!

విద్యామహిమ అటువంటిది.

* * *

**గర్వాత్ముడు ఒకప్పుడు చావును తప్పించుకొన్నా వేరొక చోట తప్పించుకోలేడనే స్థితిని యీ పద్యం వివరించింది**

**ఉ. కన్నుల గర్వసంపదలుగప్పిన దుర్మతికొక్క కొందఱున్**
**జన్నగజారుకొన్న నొకశౌర్యధురీణుఁడు పట్టి జంపడే**
**పన్నగభీతికొందరటు బారిన కృష్ణునిగాంచి యార్భటిన్**
**దన్నొకనాడు బట్టతలదన్నుచు నాడడె వేంకటేశ్వరా! 103**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో గర్వాంధులైన కొందరు దుర్మతులు వారు చేసే చెడ్డ పనుల వలన ఆ యా సందర్భాలలో తగిన వారి దెబ్బలు తగులకుండా జాగ్రత్త పడి అచట నుండి జారుకున్నా- ఒకానొకప్పుడు మంచి శౌర్యధైర్య పరాక్రమునికి వారు జిక్కితే అపుడు వారి ప్రాణాలు అపాయాన్ని పొందుతాయికదా!

కాళీయమడుగులోని సర్పరాజయిన కాళీయుడు ఎన్నో సార్లు తన దుష్టత్వముతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి తప్పించుకున్నా తగిన శౌర్యధైర్య పరాక్రమ శోభితుడైన కృష్ణ పరమాత్మ సన్నిధిలో ఓడిపోయి, బోడితలనిండా తన్నులు తింటూ దురవస్థ చెందాడుకదా!

* * *

**గారడీ విద్యల వాని గొప్పదనం ఈ పద్యంలో చెబుతున్నాడు కవి.**

**ఉ. కూటికి లేకయున్ననొక కొంద రథర్వణ విద్యగారడీ**
**లాటలు నాడి చిత్రముల నన్నియు జూపుచు నుందు రీయిలన్**
**మేటివి నీవు మన్నుదిన మేలగునే యన కృష్ణుఁ దమ్మకున్**
**నోట సమస్తలోకములు నూల్కొన జూపడె వేంకటేశ్వరా! 104**

శ్రీ వేంకటేశ్వరా! లోకంలో కూటికి లేక కొందరు తిండి సంపాదించాలనే ఆశతో అధర్వణ వేదంలో చెప్పబడిన గారడీ విద్యలు

నేర్చుకొని టక్కు టమారములు - మాయలు జూపించి విచిత్రాలు ప్రదర్శిస్తారు.

శ్రీకృష్ణుడు కూడ చిన్నప్పుడు యశోదమ్మ మన్నుతింటున్నావట గదరా కన్నా! అని దండించడానికి పూనుకుంటే అపుడు తన చిన్ననోటిలో లోకాలన్నింటినీ జూపించి యశోదమ్మను మాయజేశాడట. ఇలాగ గారడీ విద్యలు ఆకాలంలో కూడ ఉన్నాయని గ్రహించాలి.

* * *

**ఈ పద్యం చదువంటే తెలియనివాడు పండితులతో తలపడితే యెలా వుంటుందో వివరించి చెప్పడం జరిగింది**

**చ. చదువనుమాటయే యెఱుఁగజాలనిమూర్ఖుడు వేదశాస్త్రముల్**
**మొదలిడి నేర్పనేర్చుకొని మూర్ఖులు గెల్తురె పండితాళినిన్**
**ముదిసిన మాచకమ్మ యొకముద్దులకుఱ్ఱని గన్నగొడ్డు రా**
**లెదబడి వానిఁగూడ జనియింతురె బిడ్డలు వేంకటేశ్వరా! 105**

శ్రీ వేంకటేశ్వరా! చదువను మాటయే యేఱుగని మూర్ఖుడు వేదశాస్త్రాలు మొదలుపెట్టి నేర్చుకోవడం- మహాచదువులు చదువుకున్నాం అనే గర్వంతో పండితులతో వాదానికి పూనుకోవడం. వాదానికి దిగి వారితో మూర్ఖులు వాదించి గెలవడం ఎట్లా వుంటుందంటే-

ముసలదయిన మాచకమ్మ ముద్దుల కొడుకును గనడం- గొడ్డు వోయిన స్త్రీ వాడిని కూడి సంగమం జేసి బిడ్డలను గనడం ఎంత నిజమో అలాగ వుంటుంది. అసలు మాచకమ్మకు స్త్రీత్వ వికసన ముండదు. దానికి బిడ్డలు అసలు పుట్టరు. మరి ముదుసలి యియిన మాచకమ్మ సంగతి యిక చెప్పనవసరంలేదు. ఈ విషయమే ఇంతగా అవాస్తవమయితే గొడ్డాలు

వాడితో కలబడి కూడి బిడ్డలను కనాలనుకోవడం ఇంకా విడ్డూరం. ఆ రకంగా వుంటుంది మూర్ఖుడు చదివి పండితులనుగెలవడం.

* * *

'దైవనామ మహిమ' ఈపద్యంలో వివరింప బడింది

**ఉ. మూడిన కర్మసంతతుల మూలము ద్రుంపను దైవనామముల్**
**బాడక గ్రామశక్తులకు భక్తిని గావులొసంగఁ బోవునే**
**కూడినమట్టుకౌషధము కొన్నిదినాలు భుజింప కూరకే**
**బూడిదె జల్లగా దురదబోవునె మేనున? వేంకటేశ్వరా! 106**

శ్రీ వేంకటేశ్వరా! కర్మతతుల మూలాన్ని సమూలంగా త్రుంచాలనుకున్న భక్తులు పరమ పవిత్రమైన దైవనామాన్ని చక్కగా పలకాలిగాని. గ్రామ దేవతలను గొలిచి వారికి చీరలు కానుకలుగా యిస్తే కర్మబంధాలు సమసిపోవుకదా–

చర్మానికి యంటుకున్న దురదసమూలంగా పోవాలంటే కొన్ని రోజులు ఓషధీసేవనం చేయకుండా కేవలం పైన బూడిద చల్లితే ఆదురద మూలం. పూర్తిగా పోదుకదా! అలాగే కర్మబంధాలు సమసిపోవాలంటే కొన్నాళ్ళు పరమ పవిత్రమైన భగవన్నామాన్ని వోరారాపలికి స్మరించి జపించాలి.

* * *

మంచిముహూర్తంలో చేయనిపని ఎలా వుంటుందో ఈ పద్యం వివరించింది

**ఉ. మానయుతుండుసేయుపని మంచిముహూర్తమునందుజేయగా**
**బూనక కార్యమున్ గడచి వోయిన వెన్కది యెంచుటెట్లనన్**
**తానె ప్రియంబుతో శిరముతప్పక గొర్గగ బల్కిమంగలిన్**
**దేనికొ వారదోషమని తిట్టుచు మున్గుట వేంకటేశ్వరా! 107**

శ్రీ వేంకటేశ్వరా! మానయుతుడు మంచికార్యాన్ని చేసేటపుడు మంచి ముహూర్తము నిర్ణయించి ఆ కార్యాన్ని పూర్తిచేయకుండా పనిచెడిపోయిన తరువాత సమయలగ్నం బాగాలేదని దిగులుపడడం ఎలా వుంటుందంటే.

మంగలిని తలపని చేయడటానికి తానే స్వయంగా పిలిచి మంగలి ఆపని పూర్తిచేస్తుంటే వారదోషం వున్నపుడు వచ్చావేమిటి' ఇపుడీ దోషం పోవాడనికి ఎన్ని తీర్థాలలో మునగాలోకదా! అని మంగలిని తిట్టడం ఎలా వుంటుందో అలా వుంటుంది.

* * *

**ఈ పద్యంతో కవి శతకాన్ని పూర్తిచేస్తూ శారదకృప వలన ఈ కృతి మాననీయ మౌతుందని తన అక్షాంక్ష చెబుతున్నాడు.**

**ఉ. నేరని నాకవిత్వమున నీతులు రీతులు జాలకున్న శ్రీ**
**శారద సత్కృపామహిమ సర్వులు మెచ్చక యుండ రెట్లనన్**
**భూరిసుగంధపూర్ణమగు పుష్పము లద్భుతమాలికాకృతిన్**
**నారనొనర్ప దేవమునినాథులు మెచ్చరె వేంకటేశ్వరా! 108**

శ్రీ వేంకటేశ్వరా! నాకవిత్వంలో నీతులు, రీతులు సమలంకృతంగా నిండుగా లేకున్నా, లేక చాలకపోయినా, నన్ను దయతో కాపాడే శారదాదేవి కృపామహిమ వలన అందరూ నా కవిత్వాన్ని మెచ్చక యుండలేరుకదా! తప్పక మెచ్చుకుంటారు.

పరిమళ భరితమయిన పుష్పాలు అందంగా ఒకచోట నారతో పూలమాలగా కూర్చితే ఆ రమణీయపూలహారాన్ని దేవతలు, మునులూ అందరూ కూడ హారసౌందర్యాన్ని మెచ్చుకొని ఆనందిస్తారుకదా!

ఈ నా కవిత్వం శారదా దేవికృప వలన లభించిందే తప్ప నా పాండితీ ప్రకర్ష వలన వచ్చింది కాదు. అందుచే దివ్యమయిన సరస్వతీ అమ్మవారి మాటలు తప్ప ఇవి అన్యములు కావు.

అందుచే దివ్యపుష్పాలను నారతో గూర్చి అందమయిన పూలదండగా కూర్చినపుడు ఆనారతో గూర్చిన పూలమాల సౌందర్యానికి అందరూ ముగ్ధులగునట్లు నీతులూ – రీతులూ నేర్పని నాకవిత్వము శారదాదేవి కృపావర్షంతో అమృతాయమానమైనది కనుక అందరూ ఆహ్లాదాన్ని పొందుతారని ఆశిస్తాను. అని కవి తన చివర పద్యంలో మంగళాశాసనం శుభాకాంక్షలు ఈ రెండూ విశ్వానికి కలగాని ఒక శుభకామన తన అభిప్రాయంగా వివరించాడు.

– 'సురాపగధార' తాత్పర్యం వివరణం సమాప్తం. తాత్పర్య వివరణం కూడ మాధవార్పితం. మాధవాంకితం.

స్వస్తి.

ఈ 108 పద్యాలను, తాత్పర్యాన్ని వివరించిన 'సురాపగధార' రచయిత డా. వొలుకుల శివశంకరరావు 5 గంటల సమయం పూర్తిగా విశ్లేషణతో గానంచేసి, ప్రవచనం చేసి సి.డి.గా మలిచారు. ఆ సి.డి.ని 2012లో తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో “అప్పటి మంత్రివర్యులు శ్రీమతి గల్లా అరుణ గారిచే ఆవిష్కరించి పాఠకులందరికీ అందుబాటులోకి తెచ్చారు.

ఆలిండియా రేడియో, తిరుపతివారు నెలరోజులు ఆ కార్యక్రమం ప్రసారంచేశారు. పాఠకలోకం ఈ విషయాన్ని గూడ గమనించి ఆ సి.డి.ని ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడు చేసుకొని గ్రహించవచ్చును. ఇంటర్నెట్ వెబ్‌సైట్ ఇది.

http://sn.im/satakaminfo.site4
sites.co.in/2012/09/srivenkateswara.satakam.html

# గోవిందదాసుగారి కృతులు

శా. శ్రీ వాణీ హిమగోత్రజాధవుల సుశ్రేయోక్తులన్వేడి నా
భావంబందు గణేశ్వరాది సురలన్ బ్రార్థించి విద్యాయశో
ధీవర్ధిష్ణుల పూర్వసత్కవుల బ్రీతిన్ గొల్చి శేషోరగ
గ్రావాధీశ్వర! నీకృపన్ గృతులు నే గల్పింపగా నెంచితిన్.

**1 రాగం-నాట తాళం-ఆది.**

**పల్లవి.**

భజరే గణనాథం భవనందనం ॥భజరే॥

**అనుపల్లవి.**

గజరాజా వదనం ఘనగుణగణ సదనం ॥భజరే॥

**చరణం**

నిజసుజనా వినుతం త్రిజగాది వందితం

**మిశ్రం.**

భజె అజసురసేవిత పదయుగళం
భవసాగర తరణం నీచరణం ॥భజరే॥
పాశాంకుశ కరధరం దోషాచర హరణం
నీ సమానమెవరు వాస వార్చిత
గాసిమాన్పు మీశ నీవు సతతం ॥భజరే॥
బృందారక వందితం బుధజన శుభచరితం
దెందమందమొంద పాడిపుర గో
విందదాస వందితయానందం ॥భజరే॥

**2 రాగం-పూరికల్యాణి తాళం-ఆది.**

**పల్లవి.**

ఓ గణపతిదేవా బ్రోవ ఆగమనుతరావా మహానుభావ ॥ఓ॥

**అనుపల్లవి.**

సాగిలిపడి సాష్టాంగ దండమిడి
నా గతి నీవని నమ్మి భజించితి ॥ఓగ॥

**చరణం.**

కదళి ఫలంబులు ఖర్జూరంబులు
ముదురు నారికేళములు నీకిచ్చెద ॥ఓగ॥
లడ్డు జిలేబి మేలగు పాయసమును
యిద్దెన లాదిగ నిచ్చి భజించెద ॥ఓగ॥
పెరుగు ఘృతంబును పేలపిండుంటలు
కరువుదీర నీకర్పణజేసెద ॥ఓగ॥
తేనె పానకము తియ్యనిఫలములు
నానబియ్యము నీకర్పణజేసెద ॥ఓగ॥
సుందరపాడి గోవింద దాసార్చిత
వందనములు నే ముందిడివేడెద ॥ఓగ॥

**3 రాగం-భైరవి. తాళం-రూపకం.**

**పల్లవి.**

వాణీగీర్వాణి అజుప్రియరాణీ శర్వాణి బ్రోవుము ॥వా॥

**అనుపల్లవి.**

మాణిక్యాద్భుత మణి భూషణి
మంజుల మృదుమధుర సుభాషిణి ॥వా॥

**చరణం.**

వీణాలంకృత పల్లవపాణీ బంభర సమవేణి
రాణాంచిత వేదపురాణి రాజితసామ్రాజ్యకల్యాణి ॥వా॥
శ్రుతులితిహాసములు వేదోన్నత శాస్త్ర పురాణంబులు
చతురసాహితగీతంబులు నుతప్రబంధ ప్రవీణమృదోక్తులు

**మిశ్రం.**

అతులితముగ నాకు కృపామతిజేయగ నుతిజేసితి
హితమతి నన్నేలుము గోవిందదాస వందిత మృదు ॥వా॥

**4 రాగం-కల్యాణి. తాళం-ఆది.**

**పల్లవి.**

సకలలోకమాతా భూజాతా సన్నుతగుణపూతా శ్రీసీతా ॥సకల॥

**అనుపల్లవి.**

ప్రకటితసురపూజిత మునిసేవిత పావన సంపద్విదిత ప్రభూత

**మిశ్రం.**

అకలంకమనోంబుజ సంజాత
ఆర్యానందాద్భుత నిర్ణేత
మకరధ్వజుగన్నమాత శ్రీయుత
మైన కరుణ నేలు సౌఖ్యశోభిత ॥సకల॥

**పల్లవి.**

కుందరదన పూర్ణేందువదన ఆనందసదన నతచందన శ్రీధన

**అనుపల్లవి.**

ఇందీవరలోచన సురజీవన వేడు వాడనమ్మ నన్నుకృపగన

**మిశ్రం.**

వందనంబులిడుదు నీదుమృదుపద
ద్వంద్వములకు నందుకొమ్మ నీప్రియ
నందనుండనమ్మ పాడిపుర
గోవిందదాస వందితశుభమిమ్మ ॥సకల॥

**5 రాగం-మోహన తాళం-ఆది.**

మనమాశ్రీహరి యనుమా
నీదరి గను మార్యుల సరిగా మనుమామరి ॥మన॥

**అనుపల్లవి.**

వినుమా సౌఖ్యము గొనుమా సంశయ
మును మానుమా నీఅనుమానము మాని

**చరణం.**

సతమా నీజన్మమానితమా యైశ్వర్య మాగతమా
నీకర్మ సంగతమా యజ్ఞానమా
మతమా నీపూర్వసంచితమా యీపాపమా
ర్జితమా సత్సేవ్యసమ్మతమా నీవు శాశ్వతమా

**మిశ్రం.**

జనవందిత మానిత విభవమునత
మనుకొని సుతహిత వనితలతో వెత
లనుభవించి గత జననంబుల హత
మనుజెందక వ్రతమును బూనియు ఓ ॥మన॥
అతులితధన సంహిత శ్రీయుతనత
మతిగలజన స్నేహిత మొనరించక

క్షితినిపాడి గోవిందదాస మదితుని
గతియంచు నుతిజేయవె ఓ ॥మన॥

**6 రాగం ముఖారి తాళం-ఆట**

**పల్లవి.**

ఒకతూరి రామ నామోచ్చారణముజేయ
సకలార్థ సిద్ధిగదా ప్రకటముగాదా ॥ఒక॥

**అనుపల్లవి.**

అకలంకముగనూ నిత్యానందమయులై
మానకసేవించినవారి కిక నేమబ్బునొగాదా ॥ఒక॥

**మిత్రం.**

శుకముఖామర నికరసుత జానకిమనోహరు డొకడె శుభదా
యకుడటనుకొని యోగజ్ఞానాధిక సమాధి గరిష్ఠయుతమతి ॥ఒక॥

**చరణం.**

ఆరూఢజ్ఞాన సంపూరణముగను విచారణ మొనరించియు
దైవముఇంక వేరే లేదని యెంచియు
కారణకారుడీ ధీరుడేననియు
బృందారకాధిపులు నింపూరధ్యానించియు

**మిత్రం.**

సారలోకాధార దురితవిదార శరధిగభీర పాడి
విహార శ్రీగోవిందదాసోద్ధార
సవమణి హారయనిగని ॥ఒక॥

**7 రాగం నాథనామక్రియ తాళం-త్రిపుట**

**పల్లవి.**

భూమిజా మనోభిరామ కోమలాంగ సార్వభౌమా ॥భూ॥

**అనుపల్లవి.**

ప్రేమ నేలుమా ససూత్రామా కామితా కల్యాణధామా
॥భూ॥

**చరణం.**

మారకోటి సుందరాంగ మౌనిమానసాబ్జభృంగా
క్రూరఘోరపాపభంగ ధీర శ్రీకరణాంతరంగ ॥భూ॥
నన్నుబ్రోవరావదేమి నిన్ను నమ్మినానుస్వామి
విన్నపం బాలింపవేమి సన్నుతామర శ్రీగామి ॥భూ॥
పరమపావనా నాడెంత మరయరావేరా? యింపొందా
ధరను శ్రీపాడిగోవింద దాస వందితాయానంద ॥భూ॥

**8. రాగం పూరికల్యాణి తాళం-రూపకం**

**పల్లవి.**

ఈ మానవజన్మమింక నెటు లభించునో తెలియదు ॥ఈ॥

**అనుపల్లవి.**

సామాన్యుడనై జ్ఞానము నామదిగన కిటులనైతి ॥ఈ॥

**చరణం.**

పరదారాధనములపై మరులుగలిగి యంధుడనై
హరినామామృతసారము నెరుగక దురితాత్ముడనై

**మిత్రం.**

నిరతంబును సంసారపు శరనిధిలో మునిగి మునిగి

దరిగానక నా యాయువు ధారబోసితిని యూరకె ॥ఈ॥

ధర్మాధర్మము లెరుగక దైవమాత్మలో గానక
కర్మములకు మదినోడక కాలముగడపితి నూరక
మర్మము లారసి దెల్పెడు మహనీయులకడ జేరక
నిర్మలగోవిందదాసు నెరుగక చెడిపోతిని యిక ॥ఈ॥

**9. రాగము కావిడిసింధు తాళం–ఆది**

**పల్లవి.**

శ్రీరామమూర్తికీ జే సీతాపిరాట్టుకు జే కారుణ్యాలక్ష్మణునకు జే
భరత శత్రుఘ్నవీరాధివీరులకు జే ॥శ్రీ॥

దశరథేశ్వరునకు జే తరుణికౌసల్యకు జే వసుధపుణ్యాత్ములకు జే
కైకాసుమిత్ర వివిధ కీర్తులకు జే ॥శ్రీ॥

ఊర్మిళాదేవికీ జే యువిదమాండవికీ జే ధర్మశ్రుతకీర్తులకు జే
దైవానుకూల తత్త్వవేత్తలకెల్ల జే ॥శ్రీ॥

విశ్వామిత్రాదులకు జే వినుతవసిష్ఠునకు జే శాశ్వతమంత్రులకు జే
జనకాదియోగ సార్వభౌముల కెల్ల జే ॥శ్రీ॥

సుగ్రీవాంగదులకు శూరవానరులకు జే యుగ్రాంజనేయునకు జే
భల్లూకనాథ యువధకోటుల కెల్ల జే ॥శ్రీ॥

రామభక్తాదులకు జే రారాజవరులకు జే స్వామివిభీషణునకు జే
సుమంత్రుడాది సత్యజీవనులకెల్ల జే ॥శ్రీ॥

వందితార్యాళికి జే వాసవాధిపులకు జే సుందరానందులకు జే
గోవిందదాస బృందపుణ్యాత్ములకు జే ॥శ్రీ॥

### 10. రాగం బిల్హరి తాళం-రూవకం

**పల్లవి.**

మరువనులేరా నన్ను మరువ మేర మాచిత్తచోరా ॥మరు॥

**అనుపల్లవి.**

పరాత్పర నేదురాత్ముండని
ధరావరులునన్ కరకరాదునిమిరి ॥మరు॥

**చరణం.**

మాతపిత సుభ్రాతహిత నాతరుణి సుతాతతి యీ
క్షితి నన్ను దర్మతియనిన నామతినిన్ను సమ్మతి సతతము ॥మరు॥

**మిశ్రం.**

ధరణియు గిరగిర దిరిగిన శరధులుపొరలుచు
పారిన సరపిజాప్త శశియైన ॥మరు॥
మరచి దారినడచిన యీ ధరాధరుడు శిరమొంచిన
హరా పురందర సుర చరాచర నరవర
నీసరిజగదీశు లెచ్చట జూచిన లేరని దోసిలి నొగ్గితి
భాసుర పాడినివాసుడౌ గోవిందదాసవంద్య
నన్ను మోసముజేసిన ॥మరు॥

### 11. రాగం-భైరవి తాళం-ఆది.

**పల్లవి.**

శ్రీరామా మమాశ్రితపరంధామ
ఘోరాఘవిరామ కోమలఘనశ్యామా ॥శ్రీ॥

**అనుపల్లవి.**

క్షీరాంభోధి సంచారా గమపరి
పురాధీర విచారా రారా యిటు

**మిశ్రం.**

నీరజాసనాది మౌనిజన బృందార కార్చితానంద పదాంబుజ
మేరుధీర మణిహార దైత్యసంహార
మార శృంగార పరాత్పర ॥శ్రీ॥

**చరణం.**

ఇందుశేఖరార్చిత పరమాదర
వందితాంఘ్రి యరవింద శుభాకరా
మందర, గిరిధరా నిందితాసురహర
కంధిగంభీర యానందసుందరాకార.

**మిశ్రం**

ముందుజన్మమందు నందు భవముల నంది
కంది కుందు చుండగల
నాయందు కరుణ పొందుపరచి
పాడి గోవిందదాస బృంద వంద్య బ్రోవర ॥శ్రీ॥

**12. రాగం-తోడి తాళం-ఆది**

**పల్లవి.**

బ్రోవా రావా దేమిరా బుధనుతపద రారా ॥బ్రో॥

**అను పల్లవి.**

నీ వఖిలజన జీవనుడవని దేవ దేవ కృపానిధేగని
వేవిధంబుల వేడినను నను కావరావదె

**మిశ్రం.**

శ్రీవనితావన సేవన పావన ॥బ్రో॥

**చరణం.**

వారిజ హితకుల నృపచరితా వర మొసగు సిరిసహిత
మారజనక సుకుమార శుభాన్విత నీరజాత లోచన సురసేవిత

**మిశ్రం.**

సారస సంభవ సన్నుత నీదరి
జేరితి కోరితి వేరన కిప్పుడు ॥బ్రో॥

**చరణం**

వందన మిడెదను యిదె గొనుమా నందనుడని మనుపుమ
మందెమేల మేల పాడిపుర గోవిందదాస వందిత నే వేడితి

**మత్రం.**

యెందుకిందు నాయందు కరుణరా దిందిరేశ
యని ముందుగ నిల్చిన ॥బ్రో॥

**13. రాగం-హిందూస్థాని తోడి తాళం-ఏకతాళం.**

**పల్లవి.**

గానలోలా మనసాను కూలా దీనపాలా దేవ బ్రోవవేల ॥గా॥

**అనుపల్లవి.**

దానవకుల కాల దైవ వందిత మూల
మానిత శ్రీలోల మమ్మేలవేల ॥గా॥
నిర్జరాశ్రిత పాద నిర్మలామృత బోధ
దుర్జనభేదా నాతోడై రారాద ॥గా॥
పండితజన పోష భవ్యసుందర వేష
మండిత మణిభూష మదదైత్యభీష ॥గా॥
పరమపావన వాద పాలింప నామీద
ధర పాడి గోవింద దాసానుమోద ॥గా॥

### 14. రాగం-హిందూస్థాని తాళం-ఆది.

**పల్లవి.**

భవనాశ దివిజ నివేశ రవి నిభ భాస భువి సుజన విలాస
శ్రీశివ వందిత శ్రీశా ననుచేరి బ్రోవు మీశ ఘన ॥భు॥

**అనుపల్లవి.**

సరస మార సుందర సుకుమార నిరుపమ పరమానందవిచార
మొర వినరా దరి గనరా వర మనరా నదియేరా ఘన ॥భు॥

**చరణం.**

సురపోష సరస సుభాష వరమణి భూష దురితదనుజ భీష
సుందరకారణవేషా శ్రీకర ఆగమఘోష
ధరను పాడి గోవిందదాస హృత్సరసీరుహ భాస్కర శ్రీశా
స్థిరపరమా, దర, వినుమా దరిగనుమా మరువ సుమా ఘన ॥భు॥

### 15. రాగం-ముఖారి తాళం-ఆట.

**పల్లవి.**

శ్రీరామ చంద్రుని సేవించితిని పూని
మారు జన్మము లేదని మన కతడె గతియని ॥శ్రీ॥

**అనుపల్లవి.**

ఘోరదనుజ సంహారా సుజనోద్ధార
మారామరా పూజి తామర వందిత

**మిశ్రం**

సా రసదళవిలోచనసా మజవరద కరుణరసా
పరిపూర్ణదనిమనసా రగదలచితిని సువిచా

రుడ వీవె జగదీశా అని కోరివేడిన
　　నేరమెంచుట మేరగాదె కృపానిధే యని ॥శ్రీ॥

**చరణం.**

ధరజా మనోహర కరుణించ వది యేర
నెర నమ్మితిని శ్రీధరా నిరుపమ శుభాకర

**మిత్రం.**

పరమ పావన భక్తా పరిపాలిత ముక్తా
　　భరణా జగత్కర్తా ధరుడనే వే సువ్యక్తా
వారిధిశయన హరివిభవా వర మొసగుటకు రావా
　　జగజ్జనకుడవు గావా నను బ్రోచుటకు దేవా
సమయంబిదెకావా అని దారధరుడగు
　　పాడిపుర గోవిందదాసోద్ధార యనిమది ॥శ్రీ॥

## 16. రాగం-హిందూస్థానితోడి తాళం-చాపు

**పల్లవి.**

రామా నన్ను కావవే రవికుల
　　సోమా నన్నుబ్రోవవే రఘు ॥రా॥

**అనుపల్లవి.**

వేమారు నీ నామమే కోరు నాప్రేమ
　　నీమానసంబున నామోదముంచి రఘు ॥రా॥

**చరణం.**

శ్యామలదేహ నిత్యామోద సందోహ
　　కోమలమోహ సూత్రామార్చన గేహ ॥రా॥

మంజుల మృదుభాష భంజనరిపు భీ
రంజితవేష రారాజపూజిత భూష ॥రా॥
వేదాంత వేద్యా సంపాద్య విద్యాభేద్య
సాధుజనారాధ్య సారాంశా మృతహృద్య ॥రా॥
వందితమూల రాకేందుసుందరఫాల
యిందిరలోల గోవింద దాసానుకూల ॥రా॥

**17. రాగం-సింధు నామక్రియ తాళం-ఆది**

**పల్లవి.**

శ్రీపార్వతీ రమణార్చితా శ్రితభక్త పాలిత పూజితా
సాపధ్వంస శ్రీపతినేనమ్మితి పాపశయమ సుమతీ పాలించువేడితి ॥శ్రీ॥

**అనుపల్లవి.**

సురరాజార్చితా సురరాజహత
సురరాజోన్నత సుఖభోగాన్విత
సురవందిత భూసురసేవిత
భాసుర రూపజిత పరమోకోన్నత

**మిశ్రం.**

నా మొరవిని యిటురావా ఇదె కరుణచే సనుబ్రోవ నిను
నెరనమ్మితి దేవా నే శరణంటిని సద్భావకావ ॥శ్రీ॥

**చరణం.**

వనజామోచన వనజోద్ధారణ
వనజాసన సద్వందిత సురధన
వనజాచరణ వనజనాభ సుజనా
వనపాడిపుర వాసాగోవింద దాసపోష

నా మనవిని వినిరాదా నాపై కనికరమును లేదా
నేనీ తనయుండనుగాదా
నిరతము నిను నమ్మితి శ్రీనాథ వాథ ॥శ్రీ॥

**18. రాగం-భైరవి. తాళం-రూపకం.**

**పల్లవి.**

జగన్మోహనావతారము నిగమా గోచరము చూడుము ॥జ॥

**అనుపల్లవి.**

ఖగరాడ్వాహనుడౌ శేష నగవేంకటేశ్వరు వేషము ॥జ॥

**చరణం.**

బృందారక వరులు దైత్యబృందములు యింపొంది బహుసత్య
సందోహముజేరి క్షీర సింధువు నందున మందరగిరీ నిడి

**మిశ్రం.**

అందుకు తరిత్రాడుగ నాగేంద్రుని పొందించియు
నానందమున మథించిన సుధ యిందిర గోవిందుడు జను ॥జ॥
రతి శతధృతిసతి భారతి అతిరూపోన్నత మాసతి
సుత దేవత తతి పార్వతి యతి సంస్కృతోన్నతుని గాంచి
చతురత వారల రూపం బతి హీనత గతి మతినిడి
యతివగు శ్రీపతితోడను జతగా మను వెతగూర్చిన ॥జ॥

సురులును కిన్నరులును మునివరులును జగదాధర జ్ఞానులు
వరదైత్య శ్రీకరులును సుందరులును హరిమరులున బడి
సురతకు యా తరుణిని యందరు సరసత నెరతనమున
విరివిని గన పాడిపుర గోవిందదాస వంద్యుండిడు ॥జ॥

**19. రాగం-తోడి తాళం-రూపకం**

**పల్లవి.**

గరుడావాహనారూఢుడై కదలెను వేంకటరమణుడు ॥గ॥

**అనుపల్లవి.**

తిరుపతిపుర పరిపాలుడు దీనజనానందమయుడు ॥గ॥

**చరణం.**

నవమణిమయ హారంబులు నానావిధ భూషణములు
రవల కిరీటము కల్కితురాయి మకర కుండలములు

**మిశ్రం.**

ప్రవిమలమగు వారణాసి పట్టుజరీ శాల్వలాది
వివిధకుసుమహారములు ధరియించి హొయలుమించి మంచి ॥గ॥

భేరిమృదంగాది ధ్వనులు బారుమేళములు భజనలు
మేరమీరు వాద్యములు తుతారలు భాంకారధ్వనులు
వారణములు తురగంబులు ఒంటెలపైన నగారలు
బోరుగొల్చు నగుబోతు ధమార వృషభములు నడువగ ॥గ॥

సురటీ లిరుగడల వేయ సొంపగు గొడుగులును మెఱయ
ధరణిసుర లార్తులీయ దైవజ్ఞులు సన్నుతిజేయ
కరదివిటీలును లైట్లును కంబబాణములు సువ్వలు
బిరుసు లగుట్లు మత్తాపులు పెట్లదిమ్మెలును మ్రోయగ ॥గ॥

పెదజీయంగారార్యులు పేర్మొనదగు భూదేవులు
అధికారులు యోగులు మున్నగు సద్భక్తులు
ముదమున సద్భక్తి మీర మ్రొక్కి ముందు నడచు చుండ
పృథివిని గోవిందదాస బృంద భవంబులను జండ ॥గ॥

**20. రాగం-ఆనందభైరవి తాళం-ఆట**

**పల్లవి.**

వేంకటేశ్వరుని జూడరే మీరు యింక సద్గతిని చేకొనరే ॥వేం॥

**అనుపల్లవి.**

పంకజ భవసుర శంకరులకాలార
ఓంకారమగుదొర యింకెవ్వరీధర

**మిశ్రం.**

సంకటంబుల ద్రుంచి సజనుల బింకమణచెడి మురహరుండని
కొంకకను నామనవి విని హృత్పంకజంబున నిలిపివేడరే ॥వేం॥

**చరణం.**

బారులుగాను దివిటీలు ఒక్కబారు భజనలు జేయువారు
కోరిఛత్రముమెక్కబారు బట్టెడువారు
ధీరులై సురటీమెక బారువేసెడువారు ॥వేం॥

**మిశ్రం**

సురులు కరి తురగములు తేరులు
దొరలు బ్రాహ్మణవరులు కిన్నర
వరులు నరు లిరుగడల గొలువగ
గరుడవాహనమెక్కి కదలిన ॥వే॥

**చరణం.**

పాటింపదేవ వేశ్యలు ఆటపాటలచే సొక్కిసోలు
నీటుగనుము పల్లెవాటందముగవేసి
నేటిదినము సూత్రనాటకధారుడు ॥వేం॥

**మిత్రం.**

కోటిసూర్యులసాటివెలగు కిరీటమును శిరమందు మెరయగ
మేటిభూషణములకు నడుమను బోటియగు శ్రీమెరయ వెడలిన ॥వేం॥

**చరణం.**

కల్లగాదిదె మీరుమ్రొక్కిపాలవెల్లి అల్లునివేడి సొక్కి
యెల్లకాలము నిన్ను వేడినవారికి
దుల్ల జేయుము పాపమెల్ల నీవని నిక్కి ॥వేం॥

**మిత్రం.**

మల్లెమొల్లలు కొల్లగను దోసిళ్లతో నెగజల్లుచుండగ
ఉల్లమును రంజిల్లగను బలు బల్లిదుండై వెడలివచ్చెడు.

**చరణం.**

యెందుజూచిన గగనమందు నల్లమందు పొగలు నేనేమందు
ముందుగ భేరిమృదంగ వాద్యముమ్రోయ
యిందిరేశుడు పరమానందుడై యిప్పుడు ॥వేం॥

**మిత్రం.**

పొందుగను శ్రీపాడిపుర గోవిందదాసులు వందనంబిడ
డెందమందమునొంది వరమింపొందనొసగను వెడలివచ్చెడి ॥వేం॥

## 21. రాగం-పూరికల్యాణి తాళం-ఆది

**పల్లవి.**

ఎక్కడున్నావని వెదకుదునో రామా ॥ఎ॥

**అనుపల్లవి.**

మ్రొక్కివేడినవాది మొరవిని బ్రోచు నీ

**చరణం.**

అణువులయందున నచలములందున
ప్రణవములందున ప్రాణలయందునీ
సూదిమోపను యెడమేదియు లేకను.
ఆదిమధ్యాంతము లందునిండిన నిను ॥ఎ॥

**మిత్రం.**

సోదింపను గురుతేదిలేక నిర్వాద జ్ఞానసంపాద దయానిధె
బీదసాధులను నాదరింపగల వేదవేద్యగోవిందదాస నుత ॥ఎ॥

**22. రాగం-శ్రీరాగం తాళం-ఆది**

**పల్లవి.**

దిక్కు లేనినా దీనభావమెరిగి మ్రొక్కివేడిన నాముందురావదేర ॥ది॥

**అనుపల్లవి.**

పక్క జేరినా పైనప్రేమబూని చిక్కుదీర్చిబ్రోవ చేరరావదేర ॥ది॥

**చరణం.**

నిఖిలలోకనాథ నిర్జరానుమోద
ప్రకటితార్యవేద పలుకనాతొ వాదా
ముఖము జూడరాద ముని వినోదపాద
అకట నే ననాథ నయ్యబ్రోవరాద ॥ది॥

ధీరయోగమోద దివ్యవేదబోధ
మారుపల్క రాదా మౌనివంద్యపాద
కోరివేడలేద కోపమా నామీద
ధారుణీ గోవింద దాసవంద్య ॥ది॥

## 23. రాగం-పూరికల్యాణి తాళం-రూపకం

### పల్లవి.

జన్మమేమి జన్మమయ్య జానకీరామయ్య యీ ॥జ॥

### అనుపల్లవి.

చిన్మయుడగు నిను గానక చిడిముడిపడుచుండెదు యీ ॥జ॥

### చరణం.

తలిదండ్రులు బంధుజనులు దారాసుత పరిజనములు
కలిమిలేమి కాలమందు కనులనైన జూడని యీ ॥జ॥

కామము క్రోధము లోభము ఖండింపక బహుకాలము
శ్రీమదమున నే ననయము జీవించిన నేమిఫలము

### మిత్రం

ప్రేమచె నామీదమనసుబెట్టి కరుణజూచునట్టి
నీమతమున జేర్చుము గోవిందదాసవందిత యీ ॥జ॥

## 24. రాగం-తోడి తాళం-ఆది

### పల్లవి.

గరుడవాహనా కరుణా భరణా భవహరణా ॥గ॥

### అనుపల్లవి.

సురముని సేవన సూనృత జీవన వరగుణపావన చరిత్రభువన ॥గ॥

### చరణం

నామనవిని వినవే మధుసూదన శ్రీమహిమావన కోమలవదన ॥గ॥
వేదవినుత ప్రహ్లాదవరద జిత వాదసహిత సంపాదనమహిత ॥గ॥
మందరధరముచుకుందవరద గోవిందదాసప్రియవందితఫలదా ॥గ॥

**25. రాగం-వరాళి తాళం-ఆది**

**పల్లవి.**

దేవదేవ మమ్ము బ్రోవరావా
పావనమైనట్టి నీదు సేవయీవ ॥దే॥

**అనుపల్లవి.**

దిక్కునీవే యనుచు మ్రొక్కరావే
ఓచక్కనయ్య నీసాయుజ్యసౌఖ్యమీవె ॥దే॥

**చరణం.**

యెన్నో మేము జన్మము లెత్తినాము
ఓ కన్నతండ్రి మేము పాపకర్ములము ॥దే॥

ఎవరున్నారు మాకు భువిని వేరు
ఓ దివిజవంద్య మాయాపద దీర్చువారు ॥దే॥
ఇందిరేశా జగదానందధీశా
సుందర గోవిందదాసవంద్య యీశా ॥దే॥

* * *